




www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం


PRAJAPAKSHAM ★

సంపుటి 27, సంచిక: 160 | మంగళవారం | 26-11-2024 | హైదరాబాద్ Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar పేజీలు: 12 | వెల రూ. 5.00


చికిత్స పొందుతూ విద్యార్థిని శైలజ మృతి

అభివృద్ధిలో రాజీపడేది లేదు

లోపలి పేజీల్లో




భారత ప్రజలమైన మేము,
భారతదేశాన్ని సర్వసత్తాక, సామ్యవాద,
లౌకిక, ప్రజాస్వామ్య, గణతంత్ర
రాజ్యంగా నిర్మించుకోవడానికి,
పౌరులందరికీ:
సాంఘిక, ఆర్థిక, రాజకీయ
న్యాయాన్ని;
ఆలోచన, భావప్రకటన, విశ్వాసం,
ధర్మం, ఆరాధనల స్వాతంత్ర్యాన్ని ;
అంతస్తుల్లోనూ, అవకాశాల్లోనూ,
సమానత్వాన్ని చేకూర్చడానికి;,
వారందరిలో
వ్యక్తిత్వ గౌరవాన్ని, జాతీయ
సమైక్యతను సంరక్షిస్తూ సౌభ్రాతృత్వాన్ని
పెంపొందించడానికి;
మన ఈ రాజ్యాంగ పరిషత్ లో
1949, నవంబర్ 26వ తేదీన ఎంపిక
చేసుకొని, శాసనంగా
రూపొందించుకున్న ఈ రాజ్యాంగాన్ని
మాకు మేము
సమర్పించుకుంటున్నాము.

**నేడు 75వ రాజ్యాంగ దినోత్సవం**

## అదానీ రూ.100 కోట్ల విరాళాన్ని

# తిరస్కరిస్తున్నాం

రాష్ట్రానికి అప్రతిష్ట రావొద్దనే ఉద్దేశంతోనే వెనక్కి తీసుకోవాలని ఆ సంస్థకు లేఖ

అనవసర వివాదాల్లోకి ప్రభుత్వాన్ని లాగొద్దు

కమీషన్లు తీసుకుని అదానీ సంస్థకు కెసిఆర్ ప్రాజెక్టులు అప్పగించాడు

మీడియా సమావేశంలో సిఎం రేవంత్‌రెడ్డి వెల్లడి

ప్రజాపక్షం/హైదరాబాద్



అదానీ గ్రూప్ సంస్థపై వస్తున్న వివాదాల నేపథ్యంలో తెలంగాణ రాష్ట్రంలో ఏర్పాటు చేస్తున్న ''యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ''కి అదానీ ఫౌండేషన్ ప్రకటించిన రూ.100 కోట్ల విరాళాన్ని స్వీకరించబోమని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ప్రక టించారు. అదానీ సంస్థ వివాదాలతో తెలంగాణ రాష్ట్రానికి అప్రతిష్ట రావొద్దనే ఉద్దేశంతోనే విరాళాన్ని వెనక్కి తీసుకోవాలని ఆ సంస్థకు లేఖ రాసినట్టు సిఎం వెల్లడించారు. అనవసర వివాదాల్లోకి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని లాగొద్దని సూచించారు. అదానీకి చెందిన విమానంలో ఆడంబరంగా తిరిగిన వాళ్లు తమపై ఆరోపణలు చేస్తున్నారని, కమీషన్లు తీసుకుని అదానీ సంస్థకు కెసిఆర్ ప్రాజెక్టులను అప్పగించారని, అదానీతో కెసిఆర్ వంగి వంగి చేతులు కలిపారని సిఎం రేవంత్‌రెడ్డి దుయ్యబట్టారు. గత బిఆర్‌ఎస్ పదేళ్ల నిర్లక్ష్యం కారణంగా తెలంగాణ రాష్ట్రానికి వేలాది కోట్ల రూపాయల నష్టం జరిగిందని సిఎం ఆరోపించారు. సోమవారం హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డితో కలిసి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సిఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు. నిరుద్యోగులకు వృత్తి నైపుణ్య శిక్షణ ఇవ్వడానికి 'యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ' అదానీతో పాటు పలు సంస్థలు విరాళాలు ఇచ్చేందుకు ముందుకొచ్చాయని, కానీ ఆ సంస్థల నుంచి ఇప్పటి వరకూ ఒక్క రూపాయి కూడా తీసుకోలేదని స్పష్టం చేశారు. అదానీ వివాదాల విషయంలో దేశ వ్యాప్తంగా చర్చలు జరుగుతున్నాయని, అదానీ నుంచి రాష్ట్ర ప్రభుత్వం నిధులను స్వీకరించిందని కొందరు ఆరోపణలు చేస్తున్నారని, కానీ తాము రాజ్యాంగ, చట్టబద్ధంగానే ఆ సంస్థకు కాంట్రాక్టులు వెళ్ళాయని

తరువాయి 2లో

### అదానీకి ప్రాజెక్ట్‌ల అప్పగింతపై

## విచారణకు సిద్ధమా?

అదానీ సంస్థకు గత బిఆర్‌ఎస్ సంస్థ ప్రాజెక్టులను అప్పగించిందని, కేసులు నమోదు చేయాల్సి వస్తే ముందుగా బిఆర్‌ఎస్ నాయకులపై కేసులు నమోదు చేయాల్సి వస్తుందని సిఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో అదానీ సంస్థకు అప్పగించిన ప్రాజెక్ట్‌లపై విచారణకు సిద్ధమా అని బిఆర్‌ఎస్ నాయకులను సిఎం ప్రశ్నించారు.

## అదానీపై తొలిరోజు

# దద్దరిల్లిన పార్లమెంటు

**కొద్దిసేపటికే ఉభయసభలు వాయిదా**





**న్యూఢిల్లీ :** అదానీ వ్యవహారంపై శీతాకాల సమావేశాల తొలిరోజే పార్లమెంటు దద్దరిల్లింది. ఉభయ సభలు సోమవారం ఉదయం 11 గంటలకు సమావేశమైన వెంటనే ఇండియా కూటమి సభ్యులు మూకుమ్మడిగా అదానీపై అమెరికాలో నమోదైన కేసు, మణిపూర్ హింసపై చర్చించాలని ప్రభుత్వాన్ని నిలదీశాయి. దీంతో లోక్‌సభ, రాజ్యసభ ప్రారంభమైన కొద్దిసేపటికే బుధవారానికి వాయిదా పడ్డాయి. రాజ్యాంగం ఆమోదించి 75 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా మంగళవారం నాడు సెంట్రల్ హాల్‌లో ఉభయ సభల సంయుక్త సమావేశం నేపథ్యంలో లోక్‌సభ, రాజ్యసభలను బుధవారానికి వాయిదా వేశారు.

లోక్‌సభలో తొలుత ఇటీవల మరణించిన సభ్యుల సంతాప తీర్మానం అనంతరం ఉభయ సభలను 12.00గంటలవరకు వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ ఓం బిర్లా ప్రకటించారు. సభ తిరిగి ప్రారంభం కాగానే ప్రతిపక్షాలు అదానీ కుంభకోణంపై చర్చ జరపాలని మరోసారి నినదించాయి. దీంతో సభను బుధవారం ఉదయానికి స్పీకర్ వాయిదా వేశారు.

**అదానీని ప్రధాని కాపాడుతున్నారు : ఖర్గే**

మరోవైపు రాజ్యసభ తిరిగి ప్రారంభం కాగానే రూల్ 267 కింద తనకు 13 నోటీసులు అందాయని చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ పేర్కొన్నారు. వాటిలో


తరువాయి 2లో

### పార్లమెంటును కొందరు నియంత్రిస్తున్నారు : ప్రధాని

**న్యూఢిల్లీ :** కొందరు వ్యక్తులు తమ రాజకీయ ప్రయోజనాల కోసం పార్లమెంట్‌ను నియంత్రించేందుకు ప్రయత్నిస్తున్నారని, గందరగోళాలకు పాల్పడుతున్నారని ప్రధాని నరేంద్ర మోదీ ఆరోపించారు. ప్రజలు 80–90సార్లు తిరస్కరించిన వారు తమ రాజకీయ ప్రయోజనాల కోసం గూండాయిజాన్ని ఆశ్రయిస్తున్నారని అన్నారు. వారి వ్యూహాలు చివరకు విఫలమైనప్పటికీ, ప్రజలు వారి ప్రవర్తనను నిశితంగా గమనిస్తారని తెలిపారు. శీతాకాల సమావేశాల ప్రారంభానికి ముందు సోమవారం ఉదయం పార్లమెంట్ వెలుపల మీడియా పాయింట్ వద్ద ప్రధాని మోదీ మాట్లాడారు. నిరంతరం ప్రజలు తిరస్కరించే వారు తమ సహచరుల మాటలను విస్మరిస్తారని, ప్రజాస్వామ్యాన్ని ఎప్పుడూ అగౌరవపరుస్తారని విమర్శించారు. పార్లమెంట్ సమావేశాలు సజావుగా సాగాలని, ఫలప్రదమైన చర్చలు జరగాలని అధికార, విపక్ష సభ్యులను మోదీ కోరారు. భారత రాజ్యాంగాన్ని ఆమోదించి ఈ నవంబరు 26 నాటికి 75వ ఏడాదిలోకి అడుగుపెడుతున్నామని, దానికి గుర్తుగా మంగళవారం సంవిధాన్ సదన్‌లో రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించుకుందామన్నారు.

### మోదీ సర్కారు తీరుకు వ్యతిరేకంగా

# నేడు దేశవ్యాప్త నిరసనలు




**హక్కుల సాధనకు కదలిన రైతులు, కార్మికులు**

**న్యూఢిల్లీ:** కేంద్రంలోని నరేంద్ర మోదీ సర్కారు తీరుపై తీవ్ర అసంతృప్తితో ఉన్న రైతులు, కార్మికులు మంగళవారం దేశవ్యాప్త నిరసనలకు దిగనున్నారు. కేంద్ర కార్మిక సంఘాల సంయుక్త వేదిక, వివిధ రైతు సంఘాల ఉమ్మడి సంఘం, సంయుక్త్ కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) ఉమ్మడి భాగస్వామ్యంలో జరిగే ఈ నిరసన కార్యక్రమాల్లో లక్షలాది మంది భాగస్వాములుకానున్నారు. దేశంలోని మెజారిటీ రైతులు, కార్మికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేయడానికి, ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి దేశంలోని ప్రధాన రైతు, కార్మిక సంఘాలు ఒకే తాటిపై నిలుస్తున్నాయి. ఈ నెల ప్రారంభంలో ఎస్‌కెఎం, కేంద్ర కార్మిక సంఘాల ఉమ్మడి వేదిక దేశ వ్యాప్త నిరసనలకు పిలుపునిచ్చాయి. వామపక్ష అనుబంధ రైతు సంస్థలు ఆల్ ఇండియా కిసాన్ సభ (ఎఐకెఎస్),

తరువాయి 2లో

### వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లు

# ఆస్తుల ఆక్రమణకే

**కేంద్రంపై ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు ఆరోపణ**

**బెంగళూరు :** వక్ఫ్ ఆస్తులను ఆక్రమించుకోవడానికే కేంద్రం వక్ఫ్‌బోర్డు (సవరణ) బిల్లు–2024ను రూపొందించిందని ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డ్ (ఎఐఎంపిఎల్‌బి) సోమవారం ఆరోపించింది. ఎఐఎంపిఎల్‌బి ప్రతినిధి ఎస్‌క్యూఆర్ ఇలియాస్ వక్ఫ్ జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జెపిసి) తన విధిని నిజాయితీగా నిర్వర్తించడంలేదని నిందించారు. 'దేశవ్యాప్తంగా విస్తరించి ఉన్న వక్ఫ్ ఆస్తులను ఆక్రమించుకోవడానికి వక్ఫ్ (సవరణ) బిల్లు2024ను కేంద్రం ఉద్దేశపూర్వకంగా రూపొందించినట్లు బోర్డ్ సమావేశం భావించింది' అని ఇలియాస్ ఇక్కడ విలేకరుల సమావేశంలో తెలియజేశారు.బెంగళూరులో ఆదివారం నాడు ముగిసిన ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డ్ 29వ సదస్సుకు సంబంధించి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.ప్రతిపాదిత 44సవరణలు, వాటి ఉప విభాగాలు 'వక్ఫ్ ఆస్తుల స్థితిని నాశనం చేయడానికి, తారుమారు చేయడానికి' రూపొందించబడ్డాయి అని

తరువాయి 2లో

### అధికారులు, జర్నలిస్టులు, సొసైటీలకు

# భూ కేటాయింపు రద్దు

**సుప్రీం కోర్టు తీర్పు**

**న్యూఢిల్లీ :** జిహెచ్‌ఎంసి పరిధిలో ఎంపిలు, ఎంఎల్‌ఏలు, ప్రభుత్వ అధికారులు, న్యాయమూర్తులు, జర్నలిస్టుల సొసైటీలకు రాష్ట్ర ప్రభుత్వం భూమి కేటాయింపులను సుప్రీం కోర్టు రద్దు చేసింది. ఈ కేటాయింపు అసేహతుకమైనదని, వివక్షాపూర్తిమైనదని, రాజ్యాంగంలోని 14వ అధికరణ(సమానత్వ హక్కు) ఉల్లంఘన కిందికి వస్తుందని వ్యాఖ్యానించింది. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వాలు భూకేటాయింపులు చేశాయి. వీటిని సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. దీనిపై విచారణ చేపట్టిన చేసింది.సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తాలతో కూడిన ధర్మాసనం సోమవారం నాడు ఈ మేరకు 64 పేజీల తుది తీర్పు వెలువరించింది. ప్రభుత్వానికి సొసైటీలు కట్టిన డబ్బులు వెనక్కి ఇవ్వాలని ఆదేశాలు జారీ తక్షణమే ఆయా సొసైటీలకు కేటాయించిన భూములను వెనక్కి తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశించింది. వాటి కోసం సొసైటీలు చెల్లించిన ధర, అభివృద్ధి ఛార్జీలను

తరువాయి 2లో

## కాళేశ్వరం రెండో దఫా విచారణ షురూ

సోమవారం ఒక్క రోజే 18 మంది ఇంజినీర్ల నుంచి పలు ప్రశ్నలకు సమాధానం

కొన్నింటిపై జస్టిస్ పిషి ఘోష్ అసహనం

ప్రజాపక్షం / హైదరాబాద్

కాళేశ్వరం కమిషన్ రెండో దఫా విచారణ సోమవారం ప్రారంభమైంది. కమిషన్ చీఫ్ జస్టిస్ పిసి ఘోష్ ఒక్క రోజే మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల వద్ద పనిచేసిన ఎఇ నుండి ఎస్ఇల స్థాయి వరకు 18 మంది ఇంజనీర్లను ప్రశ్నించి సమాధానాలను రాబట్టుకున్నారు. కొందరు డిఈలు సమాధానాలు చెప్పే క్రమంలో తప్పుడు సమాధానాలు ఇచ్చారు. డిజైన్ మార్పులు, నిర్మాణంలో ప్రత్యక్ష సాక్షులైన ఇంజినీర్లపై పలు ప్రశ్నలను ఆయన

తరువాయి 2లో




## ఫడ్నవీస్–షిండే మధ్య పోటీ!

సిఎం పదవికోసం ఏ ఫార్ములాపైనా చర్చ జరగలేదు : అజిత్ పవార్


గెలిపించిన 'లాడ్‌కీ బహిన్' పథకాన్ని మరచిపోం

**కరద్ (మహారాష్ట్ర) :** మహారాష్ట్ర ముఖ్యమంత్రి పదవి ఎవరు చేపట్టాలనే విషయంపై కూటమిపార్టీలమధ్య ఎలాంటి ఫార్ములాపైనా చర్చలు జరగలేదని ఉపముఖ్యమంత్రి అజిత్ పవార్ చెప్పారు. అధికార 'మహాయుతి' కూటమిలో ఉన్న భాగస్వామ్య పార్టీల నాయకులు అందరూ కలిసి కూర్చుని ముఖ్యమంత్రి పదవిపై

తరువాయి 12లో




# బ్రిటన్ నవలా రచయిత్రి బార్బరా బ్రాడ్‌ఫోర్డ్ మృతి






**న్యూయార్క్ :** బ్రిటిష్ నవలా రచయిత్రి, జర్నలిస్టు బార్బరా బ్రాడ్‌ఫోర్డ్ న్యూయార్క్‌లోని తన నివాసంలో సోమవారం మరణించారు. ఆమె వయసు 91 సంవత్సరాలు. ''ఎ ఉమెన్ ఆఫ్ సబ్‌స్టాన్స్'' నవలా రచయిత్రిగా ఆమె ప్రపంచ ప్రఖ్యాతిగాంచారు. 40 ప్రపంచ భాషలలో ప్రచురితమైన ఆమె నవలలు కొన్ని లక్షల ప్రతులు అమ్ముడుపోయాయి. నవలల విక్రయాల్లో ఆమె సంచలనం సృష్టించారు. ఆమె తన 40 ఏళ్ళ వయసులో వరుసగా ఆమె నవలలు ప్రచురించి సంచలనం సృష్టించారు. ఆమె నవల ''ఎ ఉమెన్ ఆఫ్ సబ్‌స్టాన్స్'' 1979లో విడుదలైంది. ప్రపంచంలో అత్యంత సంపన్నురాలైన రచయిత్రిగా, ప్రఖ్యాతి చెందిన రచయిత్రిగా ఆమె కడవరకూ కొనసాగారు. ఆమె మొత్తం 200 మిలియన్ డాలర్లు తన రచనల ద్వారా సంపాదించారు. 1999లో ఆమె పేరుతో ఆమె ఫోటోతో పోస్టల్ స్టాంపు విడుదలైంది. 2007లో ఆమెకు క్వీన్ ఎలిజిబెత్ 2 అవార్డు లభించింది. ప్రపంచవ్యాప్తంగా ఆమె నవలలు మొత్తం 90 మిలియన్ ప్రతులు అమ్ముపోయాయి.

## విచారణ షురూ (మొదటి పేజీ తరువాయి)

సంధించారు. ఈ సందర్భంగా నిర్మాణం, పనుల వివరాలపై కమిషన్ ఆరా తీసింది. మేడిగడ్డ బ్లాక్ 7 తో పాటు 3 బ్యారేజీల వర్క్ ప్లేస్‌మెంట్ల రిజిస్టర్లు, పలు ప్రింట్ అవుట్‌లను కమిషన్ స్వాధీనం చేసుకుంది. ఒక్కో అధికారి 200 పేజీల ప్రింట్ అవుట్‌లను కనీసం ఒక్కొక్కరు 4 నుండి 7 వరకు ఇచ్చారు. ఈ సందర్భంగా ఈ గణాంకాలు తామే ఇచ్చినట్లు ఆయా రిజిస్టర్లలో ఇంజనీర్ల సంతకాలను కమిషన్ తీసుకుంది. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల వద్ద క్షేత్ర స్థాయిలో జరిగిన పనులకు సంబంధించి , అలాగే కుంగిన పిల్లర్లకు సంబంధించిన బ్లాక్ 7 రిజిస్టర్లపైనా జస్టిస్ పిసి ఘోస్ కమిషన్ సంతకాలు తీసుకుంది. కాగా కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో క్వాలిటీ కంట్రోల్ రిజిస్టర్లు మిస్ అయినట్లు కమిషన్ గుర్తించింది. తొలి డ్యామేజీ 2020లోనే జరిగినట్లు గుర్తించి ప్రభుత్వానికి లేఖలు రాసినట్లు ఈ సందర్భంగా కమిషన్‌కు ఇంజనీర్లు వెల్లడించారు. కాగా కొందరు ఇంజనీర్లు యధాలాపంగా మళ్లీ ఇష్టానుసారం సమాధానాలు ఇచ్చారు. ముందే అనుకొని వచ్చి అసందర్భంగా సమాధానాలు చెప్పొద్దని ఘోష్ అసహనం వ్యక్తం చేశారు. విచారణలో తాను అడిగిన ప్రశ్నలకు మాత్రమే సమాధానం చెప్పాలని ఆదేశించారు. కాగా సోమవారం విచారణకు హాజరయిన వారిలో కాళేశ్వరం అసిస్టెంట్ ఇంజనీర్ రూపాణి విజయ్, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు ఎం. ప్రసాద్, ఎ. రవికాంత్, వి. గణేష్, వలి షేక్, బి. శ్రీనివాస్, జి.సాయి చరణ్, డిప్యూటి ఇఇ బి. నందా, జి. గంగాధర్, ఎల్. భీమ రాజు, ఎఈఈ శ్రీనివాస్ రెడ్డి, డిఈఈ వి.రంజిత్ కుమార్ , ఎం రామసుబ్బా రెడ్డి, రిటైర్డ్ ఈఈ సి. శ్రీనివాస్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్. శ్రీనివాసులు, చీఫ్ ఇంజనీర్ టి. శ్రీనివాస్, చీఫ్ ఇంజనీర్ వి. మోహన్ కుమార్ ఉన్నారు.

**నేటి విచారణకు 15 మందికి పిలుపు**

మంగళవారం విచారణకు మరో 15 మందిని ఆహ్వానించింది. నిజానికి రోజుకు 42 మంది వరకు విచారణకు పిలువాలని కమిషన్ భావించగా వివిధ కారణాల వల్ల ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, డివిజినల్ ఇంజనీర్లు, సూపరింటెండింగ్ ఇంజనీర్లు సహా పలువురు వివిధ కారణాల వల్ల హాజరు కాలేక పోయినట్లు తెలుస్తోంది.

## తిరస్కరిస్తున్నాం (మొదటి పేజీ తరువాయి)

సిఎం వివరించారు. ఒప్పందం కుదిరిన తర్వాత ఆ ఒప్పందాన్ని రద్దు చేస్తే న్యాయపరమైన చిక్కులు వస్తాయన్నారు. పెట్టుబడులకు కాంగ్రెస్, రాహుల్ గాంధీ వ్యతిరేకం కాదని, రాజ్యాంగం, చట్టానికి వ్యతిరేకంగా టెండర్లను, ప్రభుత్వ ఆస్తులను అప్పనంగా అప్పగించడాన్ని మాత్రమే రాహుల్‌గాంధీ వ్యతిరేకిస్తున్నామని సిఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

**బిఆర్‌ఎస్ ప్రభుత్వ వైఖరితో రాష్ట్రానికి వేల కోట్ల నష్టం**

కేంద్రం నుంచి తెలంగాణ రాష్ట్రానికి రావాల్సిన నిధులు, ప్రాజెక్టుల విషయంలో గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని, అందుకే తెలంగాణ రాష్ట్రానికి వేలాది కోట్ల రూపాయల నష్టం జరిగిందని సిఎం రేవంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్లమెంట్ సమావేశాల నేపథ్యంలో కాంగ్రెస్‌కు చెందిన ఎంపిలతో మంగళవారం ఢిల్లీలో చర్చిస్తామన్నారు. ఈ పార్లమెంట్ సమావేశాల్లో తెలంగాణ రాష్ట్రానికి చెందిన సమస్యలు, కేంద్రం నుంచి రావాల్సిన నిధులు, విభజన చట్టంలోని హామీలు తదితర అంశాలను ఎంపిలు పార్లమెంట్‌లో ప్రస్తావించేందుకు తగిన పూర్తి సమాచారాన్ని అందజేస్తామని సిఎం వివరించారు. కేంద్ర మంత్రులు అపాయింట్‌మెంట్ ఇస్తే, తమ ఎంపిలతో కలిసి ఆ మంత్రులకు వినతిపత్రం అందజేస్తామన్నారు. రాష్ట్రానికి రావాల్సిన నిధులను బిజెపి తన ట్రేజరీ నుంచి ఇవ్వడం లేదని, కేంద్ర ప్రభుత్వం ట్రేజరీ నుంచి ఇస్తున్నారని సిఎం అన్నారు. తన ఢిల్లీ పర్యటనకు రాజకీయ ప్రాధాన్యత లేదని సిఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. గవర్నర్ విచారణకు అనుమతి రాకుండా అడ్డుకునేందుకు, ప్రధాని మోదీ ముందు మోకరిల్లేందుకు బిఆర్‌ఎస్ తరహా తాము ఢిల్లీకి వెళ్లడం లేదన్నారు. ఎవరి కాళ్లు పట్టుకునేందుకో, కేసుల నుంచి తప్పించుకునేందుకో, లేదా విచారణకు గవర్నర్ అనుమతి ఇవ్వకుండా ఆపేందుకో తాము ఢిల్లీకి వెళ్లడం లేదని కెటిఆర్‌ను ఉద్దేశించి సిఎం రేవంత్ అన్నారు. వారి కడుపు మంట, దుఃఖం తమకు తెలుసునని, వారి కాకి గోలను తాము పట్టించుకోబోమని, ఇది ఒకరిపై కోపం, పగ చూపాల్సిన సమయం కాదన్నారు.

**రెండు లోక్‌సభ ఉప ఎన్నికల్లో మోదీని ఛీ కొట్టారు**

మహారాష్ట్రలో లోక్‌సభ ఉప ఎన్నికల్లో మోదీ ప్రభుత్వాన్ని, మంత్రివర్గంలో ఉన్న కిషన్‌రెడ్డిని మహారాష్ట్ర ప్రజలు చీకొట్టారని సిఎం రేవంత్‌రెడ్డి ఎద్దేవా చేశారు. మహారాష్ట్రంలోని నాందేడ్, కేరళలోని వయనాడ్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించిందని రేవంత్‌రెడ్డి గుర్తు చేశారు. అక్కడ రాష్ట్రానికి ఒకరకంగా, కేంద్రానికి మరో రకంగా ప్రజలు తీర్పు ఇచ్చారన్నారు. ఒక ఇంగిత జ్ఞానం లేని కిషన్‌రెడ్డిని కేంద్ర మంత్రివర్గంలో తీసుకోవడం తెలంగాణ రాష్ట్ర దురదృష్టకరమని సిఎం అన్నారు.

**కెటిఆర్ ఒక 'సైకో రామ్'**

కెటిఆర్ జైలుకు వెళ్లేందుకు తహతహలాడుతున్నారని, ఆయనొక 'సైకో రామ్' అని సిఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. జైలుకు వెళ్తే సిఎం కావొచ్చని కెటిఆర్ భావిస్తున్నారని, కానీ కెసిఆర్ కుటుంబం నుంచి ఇది వరకే కవిత జైలుకు వెళ్లారని, జైలుకు వెళ్లినవారే సిఎం అవుతారంటే, ముందుగా కవితకే అవకాశం దక్కుతుందని, ఈ అవకాశం కూడా కెటిఆర్‌కు లేదని రేవంత్‌రెడ్డి ఎద్దేవా చేశారు. కెసిఆర్ కుటుంబంలో సిఎం సీటు కోసం పోటీ ఎక్కువగా ఉన్నదని, అందుకే కెటిఆర్ జైలుకు వెళ్లేందుకు ప్రయత్నిస్తున్నారని ఎద్దేవా చేశారు.

## భూ కేటాయింపు రద్దు (మొదటి పేజీ తరువాయి)

వడ్డీతో పాటు చెల్లించాలని పేర్కొంది.

**తీర్పు విచారకరం: టియుడబ్ల్యుజె :** జర్నలిస్టుల సొసైటీకి కేటాయించిన భూమిని వెనక్కి తీసుకోవాలని సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు విచారకరమని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టియుడబ్ల్యుజె) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.విరాహత్ అలీ, రాంనారాయణలు వ్యాఖ్యానించారు. ఉన్నతాధికారులు, ఎంఎల్‌ఏలు, ఎంపిలతో సమానంగా జర్నలిస్టులను చూడడం సరి కాదని అన్నారు. తీర్పుపై కూలం కుషంగా చర్చించి, తగు చర్యలు తీసుకోవాలని ఒక ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

# ఉరుగ్వే ఎన్నికల్లో వామపక్ష కూటమి విజయం

### అధ్యక్షుడుగా యమందు ఓర్సీ గెలుపు

ప్రపంచం



మంటెవిడియో : ఉరుగ్వే అధ్యక్ష పదవికి జరిగిన ఎన్నికల్లో వామపక్ష కూటమి విజయం సాధించింది. వామపక్ష కూటమి నాయకుడు యమందు ఓర్సీ 2025 మార్చి 1వ తేదీన ఉరుగ్వే దేశాధ్యక్షుడుగా అధికార బాధ్యతలు చేపడతారు. 2030 వరకూ ఆ పదవిలో కొనసాగుతారు. వ్యవసాయ విశ్వవిద్యాలయంలో చదువుకున్న ఓర్సీ వ్యవసాయరంగ ఆర్థికవేత్త. 2023 డిసెంబరులో జరిగిన బ్రాడ్ ఫ్రంట్ కాంగ్రెస్ సమావేశంలో ఓర్సీని దేశాధ్యక్ష పదవికి పోటీ చేసే అభ్యర్థిగా అధికారికంగా ప్రకటించింది. ఈ ఏడాది అక్టోబరు 27న జరిగిన మొదటి రౌండు ఎన్నికల్లో ఓర్సీ 44 శాతం ఓట్లు సంపాదించుకున్నారు. తర్వాత నవంబరునెలలో జరిగిన రనాఫ్ ఎన్నికల్లో రిపబ్లికన్ కూటమికి చెందిన అల్వరో డెల్గాడోను ఓడించారు.

ప్రతిపక్షానికి చెందిన యమందు ఓర్సీ దేశాధ్యక్ష పదవికి జరిగిన ఎన్నికల్లో గెలిచారని దేశాధ్యక్షుడు లూయిస్ లాకల్లే పా గుర్తించారు. రెండోరౌండ్ ఎన్నికల్లో అల్వరో డెల్గాడోపై ఓర్సీ విజయం సాధించారని లాకల్లే పా ప్రకటించారు. వామపక్షాలు ఒక బ్రాడ్ ఫ్రంట్‌ను ఏర్పాటు చేసి అధ్యక్ష ఎన్నికల్లో పోరాడి పదవి గెలుచుకున్నాయి. వామపక్ష నాయకుడు ఓర్సీ విజయాన్ని నేషనల్ పార్టీకి చెందిన నాయకుడు డెల్గారో వినమ్రతగా అంగీకరించారు. రాజధాని మంటెవిడియోలో డెల్గాడో మాట్లాడుతూ వామపక్ష కూటమికి, కూటమి నాయకులకు హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నానన్నారు. ఎలాంటి అరమరికలు లేకుండా అపరాధ మనస్తత్వానికి దూరంగా తాము ఎన్నికల్లో ప్రజాస్వామ్యబద్ధంగా గెలిచిన వామపక్ష కూటమికి అభినందనలు తెలియజేస్తున్నామన్నారు. ప్రజా తీర్పునకు కట్టుబడతామన్నారు. దేశాధ్యక్షుడు లాకల్లే కూడా అధ్యక్ష పదవికి గెలిచిన ఓర్సీకి శుభాకాంక్షలు తెలియజేశారు.

ఓర్సీ పూర్తిపేరు యమందు రమోన్ ఆంటోనియో ఓర్సీ మార్టినెజ్. 1967లో జన్మించిన ఓర్సీ ఉరుగ్వే వామపక్ష ఎంపిపి (మూమెంట్ ఆఫ్ పాపులర్ పార్టిసిపేషన్) పార్టీలో ఎప్పటినుండో క్రియాశీలపాత్ర పోషిస్తూ నాయకత్వస్థానానికి ఎదిగారు. ఆయన తొలుత చరిత్ర అధ్యాపకుడుగా పనిచేశారు. ఎంపిపి నేషనల్ డైరెక్టరేట్ సభ్యుడుగా దీర్ఘకాలంగా ఉన్నారు. 2005 జులై నుండీ ఓర్సీ జాతీయ వామపక్ష విస్తార కూటమి బ్రాడ్ ఫ్రంట్ ఎగ్జిక్యూటివ్ కమిషన్‌లో కొనసాగుతున్నారు. 2019 సార్వత్రిక ఎన్నికల్లో బ్రాండ్ ఫ్రంట్ తరపున అధ్యక్ష పదవికి పోటీ చేసిన డేనియల్ మార్టినెజ్ విల్లమిల్‌కు ప్రచార సారథిగా ఓర్సీ బాధ్యతలు నిర్వహించారు.ఈ ఎన్నికల్లో బ్రాండ్ ఫ్రంట్ ఓడిపోయిన తర్వాత ఓర్సీ తదుపరి ఎన్నికలకు అధ్యక్ష అభ్యర్థిగా తెరమీదకు వచ్చి ముఖ్యభూమిక పోషించారు.

# యూరప్‌ను దిగ్భ్రాంతపరచిన రుమేనియా ఎన్నికలు

### ఫస్ట్‌రౌండ్‌లో జియోగ్యేస్క్యూ గెలుపు, వచ్చే 8న రనాఫ్



**బుఖారెస్ట్ :** రుమేనియా అధ్యక్షుడుగా గాలిన్ జియోగ్యేస్క్యూ (62) విజయం సాధించారు. పచ్చి మితవాది, జాతీయవాదాన్ని భుజానికి ఎత్తుకున్న జియోగ్యేస్క్యూ మొదటిరౌండ్‌లో భారీగా ఓట్లు సంపాదించుకుని యూరప్ దేశాలను దిగ్భ్రాంత పరిచారు.ఐతే డిసెంబరు 8వ తేదీన ఫైనల్‌గా రనాఫ్ పోటీ జరుగుతుంది. రెండో స్థానంలో నిలిచిన మధ్యేవాదపార్టీ నాయకుడు ఎలినా లాస్కోనీకి, జియోగ్యేస్క్యూకు మధ్య ఈ తుదిపోరు జరుగుతుంది. ఐదేళ్ళక్రితం ఓటర్లు ఎలా స్పందించారో ఈసారి కూడా అదేవిధంగా స్పందించడంతో 51 శాతం మాత్రమే పోలింగ్ జరిగింది. రష్యా చేస్తున్న యుద్ధ ప్రభావం రుమేనియాపై ఉంది. ఈ యుద్ధంలో ఉక్రేన్‌కే రుమేనియా మద్దతుగా ఉంది. యూరప్‌లో నాటోకు రుమేనియాలోని ఒక గ్రామం అతిపెద్ద యుద్ధ వైమానిక స్థావరంగా మారింది.

పొలిటికల్ కామెంటేటర్ రాడూ మగ్దిన్ దీనిపై వ్యాఖ్యానిస్తూ, జియోగ్యేస్క్యూకు ప్రజల మద్దతు అసాధారణమైన పరిణామమని అన్నారు. 34 ఏళ్ల నా ఎన్నికల అనుభవంలో ఏనాడూ ఎన్నికల సర్వేలు ఈ విధంగా అంచనాల్లో విఫలంకాలేదన్నారు. 99 శాతంఓట్ల లెక్కింపు పూర్తయ్యేసరికి జియోగ్యేస్క్యూ 3,50,000 ఓట్లు ఆధిక్యత సంపాదించి ప్రధానమంత్రి నియోలాక్యూను, మధ్యేవాదపార్టీ నాయకుడు ఎలినా లాస్కోనీలను పూర్తిగా పక్కకు నెట్టేశారు. మరో కన్జర్వేటివ్ అభ్యర్థి, జియోగ్యేస్క్యూ అనుకూలుడు జార్జ్ సిమినో నాలుగో స్థానంలో ఉన్నారు. వారం క్రితం ఎన్నికల సర్వేలో ఆయన ఐదూశాతం మేరకు ఓట్ల కొరతతో విజయావకాశాలకు దూరంగా ఉన్నారన్నారు. ఆయనకంటూ సొంతంగా ఒకపార్టీ లేదు. ఆయన ఇండిపెండెంట్‌గా సోషల్ మీడియాద్వారా, టిక్‌టాక్ ద్వారా భారీ ప్రచారం చేసుకున్నారు. ఆయన గతంలో ఐక్యరాజ్యసమితి గ్లోబల్ సస్టెయినబుల్ ఇడెక్స్ ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ జనరల్ బాధ్యతలతోపాటు యూరోపియన్ రీసెర్చ్ సెంటర్ ఫర్ క్లబ్ ఆఫ్ రోమ్ అధ్యక్షుడుగా కూడా పనిచేశారు. సోషల్ డెమోక్రటిక్‌పార్టీకి చెందిన సియోలాక్యూ కంటే ఎలినా లాస్కోనీ 1000 ఓట్లు మాత్రమే ఆధిక్యంలో ఉండి రెండోస్థానంలో కొనసాగుతున్నారు. రుమేనియా అధ్యక్ష పదవికి జరిగిన ఫస్ట్ రౌండ్ ఎన్నికల్లో ఆయన గెలిచారు. రష్యా అనుకూలవాదిగా ఆయన ముద్రపడ్డారు. దేశంలో ప్రజలు తీవ్ర ధరల సమస్యలతో సతమతమవుతున్నారు. సంప్రదాయ విలువలు రక్షిస్తామని జియోగ్యేస్క్యూ ప్రజలకు వాగ్దానం చేశారు. ఐతే రష్యా ఆయన గురించి తమకు ఎక్కువగా తెలియదని స్పష్టం చేసింది. ఉక్రేన్‌పై జరుగుతున్న యుద్ధంలో ఆయన ఉక్రేన్‌కు మద్దతు ఇస్తుండగా నాటోపై విమర్శలు చేస్తున్నారు. ఆదివారంనాడు అధ్యక్ష పదవికి పోలింగ్ జరిగింది. ప్రాథమిక ఫలితాల్లో యూరప్ వ్యతిరేక ప్రధానమంత్రి, సోషల్ డె మోక్రాట్స్‌కు చెందిన కూటమిపార్టీ నాయకుడు మార్సెల్ సియోలాక్యూను ఈ రేసులో లేకుండా వెనక్కు నెట్టారు. దేశంలో పెరుగుతున్న ధరలు, ద్రవ్యోల్బణం స సమస్య ఈ ఎన్నికల ఫలితాలపై ప్రభావం చూపించాయి.

# మరణశిక్ష విధించాల్సిందే

### నేతన్యాహూపై ఖొమైనీ నిప్పులు



టెహ్రాన్ : ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజిమన్ నేతన్యాహూకు మరణశిక్ష విధించాల్సిందేనని ఇరాన్ అధ్యక్షుడు ఆయెతుల్లా ఖొమైనీ సోమవారంనాడు నిప్పులు కక్కారు. అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు (ఐసిసి) నేతన్యాహూకు, ఇజ్రాయెల్ రక్షణమంత్రి గాలంట్‌కు, హమాస్ మిలిటరీ అధిపతి డైఫ్‌కు అరెస్టు వారెంట్లు జారీ చేసిన కొద్ది రోజుల తర్వాత ఖొమైనీ తీవ్రంగా స్పందించారు. గాజాలో, లెబనాన్‌లో దారుణ మానవ విధ్వంసం సృష్టించిన నేతన్యాహూకు అరెస్టు వారెంట్‌కు బదులుగా మరణశిక్ష విధించాల్సిందేనన్నారు. గాజాలో, లెబనాన్‌లో, సిరియాలో ఐడిఎఫ్ సైన్యం మానవ వ్యతిరేక విధ్వంసం సృష్టించిందని, అమాయకులైన ప్రజలను ఊచకోత కోసిందనీ, ఆసుపత్రులను ధ్వంసం చేసిందని అందువల్ల వారికి అరెస్టు వారెంటు సరిపోదని, ఎట్టి పరిస్థితుల్లోనూ నేతన్యాహూకు, గాలెంట్‌కు మరణశిక్ష విధించాల్సిందేనీ సోమవారంనాడు జరిగిన ఒక మిలిటరీ సమావేశంలో ఖొమైనా అన్నారు. ఐతే ఐసిసి ఉత్తర్వులను అమెరికా తిరస్కరించింది. తాము ఇజ్రాయెల్‌కే మద్దతు ఇస్తామని, దాడులు చేయడం ద్వారా తమ సార్వభౌమాధికారాన్ని కాపాడుకునే హక్కు ఇజ్రాయెల్‌కు ఉందని అమెరికా అధ్యక్షుడు బైడెన్ స్పష్టం చేశారు.

**ఐడిఎఫ్ ఉద్దేశపూర్వక దాడివల్లే లెబనాన్ జర్నలిస్టుల మరణం**

ఇదిలా ఉండగా ఇజ్రాయెల్ గతనెలలో జరిపిన దాడుల్లో ముగ్గురు లెబనాన్ జర్నలిస్టులు మరణించిన సంఘటన ఉద్దేశపూర్వకంగా జరిగినదేనని అంతర్జాతీయ మానవ హక్కుల గ్రూపు సోమవారంనాడు తన నివేదికలో చెప్పింది. పౌర ప్రాంతాలపై కూడా ఐడిఎఫ్ చేసిన దాడులు ఉద్దేశపూర్వకమైనవిగా కనిపిస్తున్నాయని పేర్కొంది. అక్టోబరు 25న ఆగ్నేయ లెబనాన్‌లోని గెస్ట్ హౌస్‌లో నిద్రిస్తున్న ముగ్గురు జర్నలిస్టులపై ఐడిఎఫ్ దిడిచేసి చంపింది. ఇక అప్పటినుండీ ఇప్పటివరకూ మరో 11 మంది లెబనాన్ జర్నలిస్టులను కూడా ఇజ్రాయెల్ సైన్యం చంపిందని లెబనాన్ ఆరోగ్యమంత్రిత్వశాఖ ప్రకటించింది. గాజాలో ఒకవైపు దాడులు జరుగుతుండగా మరోవైపు భారీ వర్షాల కారణంగా 50 లక్షలమంది పాలస్తినా ప్రజలకు మురికినీరు ప్రవాహం ముప్పు ఎదురైంది. ఇప్పటికే గాజాలో లక్షలమంది ప్రజలు పోషకాహారలోపంతో బాధపడుతున్నారు. ఇప్పుడు విపరీతమైన చలిగాలుల కారణంగా వారంతా మరణాలకు గురయ్యే కొత్త ప్రమాదం ఏర్పడింది. కాగా హిజ్బొల్లా ఉగ్రవాదులు సోమవారంనాడు ఇజ్రాయెల్‌పై క్షిపణులు ప్రయోగించారు. ఇజ్రాయెల్ రేడియో ఈ విషయాన్ని ధృవీకరించింది. ఉత్తరగాజా కమల్ అద్వాన్ ఆసుపత్రికపై ఇజ్రాయెల్ దళాలు తాజాగా దాడులు జరిపాయి.

## ఆస్తుల ఆక్రమణకే (మొదటి పేజీ తరువాయి)

ఇలియాస్ వివరించారు .వాటాదారుల సూచనలను ఏర్పాటుచేయడానికి ఏర్పాటైన జెపిసి ఈ అంశంపై ఎలాంటి లోకస్ స్టాండి తీసుకోలేదని, అంతేకాకుండా పక్షపాత ధోరణిని ప్రదర్శిస్తూ నియమనిబంధనలను అతిక్రమిస్తోందన్నారు. అంతేకాకుండా వారికి తగిన సమయం ఇస్తూ వారిపట్ల శ్రద్ధ కనబరుస్తోందని ఆయన ధ్వజమెత్తారు. తాము జాయింట్ పార్లమెంట్ కమిటీ తన విధిని నిజాయితీగా నిర్వర్తించడం లేదని తాము అభిప్రాయపడుతున్నామని ఇలియాస్ స్పష్టం చేశారు. గతంలో జరిగిన సందర్భాలను ఉటంకిస్తూ ఏ ముస్లిం సంస్థలతోనూ సంప్రదించకుండా బిల్లును తీసుకురావడం ఇదే మొదటిసారి అన్నారు. ఎఐఎంపిఎల్‌బి పూర్తి స్థాయి ప్రతినిధి బృందం సమావేశమై బిల్లుపై తన అభ్యంతరాలను సమర్పించింది. అంతేకాకుండా ప్రతినిధివర్గం వక్ఫ్ బోర్డు సవరణ బిల్లుపై అధ్యయనానికి సంబంధించి 211పేజీల వివరణాత్మక డాక్యుమెంట్‌ను అందజేసింది. సంయుక్త పార్లమెంటరీ కమిటీ సంబంధిత వాటాదారులను కాకుండా దేశంలోని మొత్తం పౌరులు అందరి నుంచి సూచనలను ఆహ్వానించింది అని ఇలియాస్ తెలిపారు.ఎన్ని ప్రయత్నాలను చేసినప్పటికీ ఈ బిల్లు ఆమోదం పొందితే సవరణలను ఉపసంహరించుకునేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు అందుబాటులో ఉన్నటువంటి అన్ని చట్టపరమైన, రాజ్యాంగ, ప్రజాస్వామ్య మార్గాలను అన్నింటిని వినియోగించుకుంటా మని ఆయన హెచ్చరించారు. ప్రతిపక్షాలు, మా ప్రయత్నాలు కొనసాగినప్పటికీ బిల్లు ఆమోదం పొందినట్లయితే అప్పుడు ముస్లింలు భారత రాజ్యాంగ పరిమితుల్లో, భారత రాజ్యాంగ చట్రంలో అన్ని చర్యలను తీసుకోవాలని ఒత్తిడిచేయబడతారని, వారు అన్ని న్యాయపరమైన, రాజ్యాంగపరమైన, ప్రజాస్వామ్యపరమైన చర్యలు తీసుకుంటారని ఇలియాస్ చెప్పారు. ఎఐఎంపిఎల్‌బి దాని మొత్తం నాయకత్వం, ఆఫీస్‌బేరర్లు అందరూ పార్లమెంట్ ముందు నిరసనగా బైఠాయించాలని నిర్ణయించినట్లు తెలిపారు. అందరూ ఆయా అసెంబ్లీల ముందు ధర్నా చేపట్టాలని ముస్లిం ప్రతిపక్షాల రాష్ట్ర నాయకత్వానికి విజ్ఞప్తి చేశామని ఇలియాస్ వెల్లడించారు.యూనిఫామ్ సివిల్ కోడ్ గురించి ప్రస్తావించగా ఇది ఆమోదయోగ్యమైనది కాదన్నారు. ఇది మతం సాంస్కృతిక వైవిధ్యాల స్వేచ్ఛకు, ప్రాథమిక హక్కులకు వ్యతిరేకమని రాజ్యాంగంలో పొందుపరచబడిందని ఇలియాస్ స్పష్టం చేశారు. షరియా చట్టంతో ఎప్పటికీ రాజీ పడబోమని , ముస్లిములకు ఇది ఆమోదయోగ్యం కాదని ముస్లిం పర్సనల్ లా బోర్డ్ స్పష్ట ం చేసింది. ఈ జోక్యాన్ని బిజెపి ప్రభుత్వాలు బాగా ఆలోచించిన కుట్రగా ఎఐఎంపిఎల్‌బి పరిగణిస్తోందన్నారు.ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు ఈ సందర్భంగా మతపరమైన స్థలాలకు సంబంధించిన వివాదాలపైనా చర్చించిందని ఇలియాస్ వివరించారు. వారణాసిలోని జ్ఞాన్‌వాపీ మసీదు, మథుర లోని శాహి ఈద్‌గా, మధ్యప్రదేశ్‌లోని భోజ్‌శాల కమల్ మౌలా మసీద్, లక్నోలోని తెలేవాలీ మసీద్, ఇప్పుడు ఉత్తరప్రదేశ్‌లోని సంభాల్‌లో ఉన్న జామా మసీద్ సహా దేశంలోని వివిధ ప్రాంతాలనుంచి తప్పుడు దావావేయడానికి ఇది న్యాయవాదులను నిరోధించలేదన్నారు. మసీదుపై కోర్టు ఆదేశించిన సర్వే హిందూవాదులు ఒక ఆలయాన్ని కూల్చివేయబడిన తర్వాత నిర్మించబడిందని పేర్కొన్నారు. అయితే ఇది హింసాత్మక ఘర్షణలకు దారితీసిందన్నారు. ఇది తుపాకీ కాల్పుల ద్వారా ముస్లిం నిరసనకారుల ప్రాణాలను బలిగొందని ఇలియాస్ ఆవేదన వ్యక్తం చేశారు.

**బిల్లును వ్యతిరేకిస్తూ పశ్చిమబెంగాల్ అసెంబ్లీలో తీర్మానం: మంత్రి సోవాందేబ్ చటోపాధ్యాయ**

వక్ఫ్ సవరణ బిల్లు2024ను వ్యతిరేకిస్తూ పశ్చిమబెంగాల్ శాసనసభలో తీర్మానం ప్రవేశపెడతామని, అయితే తేదీ ఇంకా ఖరారు కాలేదని పశ్చిమబెంగాల్ పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి సోవాందేబ్ చటోపాధ్యాయ సోమవారం చెప్పారు. వక్ఫ్ సవరణ బిల్లు విభజనతో కూడుకున్నదని, మైనార్టీల హక్కులకు భంగం కలిగించే అవకాశం ఉందని ఆరోపించారు. ఈ బిల్లు పై తృణమూల్ కాంగ్రెస్ పదేపదే తన వ్యతిరేకతను వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ఇదిలాఉంటే పశ్చిమబెంగాల్ మంత్రి, కోల్‌కతా మేయర్ ఫిర్హాద్ హాకీమ్ సోమవారం ఇక్కడ మాట్లాడుతూతృణమూల్ కాంగ్రెస్ మైనార్టీ సెల్ ఆధ్వర్యంలో నవంబరు 30న కోల్‌కతా నగరంలో వక్ఫ్ (సవరణ) బిల్లును వ్యతిరేకిస్తూ నిరసన ర్యాలీని నిర్వహించనున్నట్లు తెలిపారు.

**వక్ఫ్ బిల్లుపై పార్లమెంట్ కమిటీ పదవీ కాలం పొడిగించాలి : ప్రతిపక్ష సభ్యులు**

వక్ఫ్ సవరఫ బిల్లుపై జాయింట్ కమిటీలోని ప్రతిపక్ష సభ్యులు సోమవారం లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను కలిశారు. ప్యానెల్ చైర్మన్ జగదాంబికా పాల్‌పై ఫిర్యాదు చేశారు. కీలకమైన విచారణను ఆయన బుల్డోజ్ చేశారని ఆరోపించారు. ఈ విషయమై వారు స్పీకర్ ఓం బిర్లాకు ఒక వినతిపత్రం అందజేశారు. అనంతరం డిఎంకె సభ్యుడు ఎ.రాజా విలేకరులతో మాట్లాడుతూ చైర్మన్ సరైన ప్రక్రియను పాటించడం లేదని ప్రతిపక్షసభ్యుల తరపున స్పీకర్‌కు ఒక మెమోరాండాన్ని సమర్పించామని తెలియజేశారు. స్పీకర్ ఓంబిర్లాను కలిసిన సభ్యులలో డిఎంకె నేతలు రాజా. ఎం.అబ్దుల్లా, కాంగ్రెస్ సభ్యులు సయ్యద్ నసీర్‌హుస్సేన్, మహ్మద్ జావేద్, ఇమ్రాన్ మసూద్, తృణమూల్ సభ్యులు కళ్యాణ్ బెనర్జీ, నడిముల్ హక్, ఆప్ సభ్యుడు సంజయ్‌సింగ్, ఎస్‌పి సభ్యుడు మొహిబుల్లా, ఎఐఎంఐఎం సభ్యుడు అసదుద్దీన్ ఒవైసీ ఉన్నారు.

**బిహార్ అసెంబ్లీ వెలుపల సిపిఐ(ఎం) లిబరేషన్ నిరసన ప్రదర్శన**

పార్లమెంట్‌లో తీసుకురానున్న వివాదాస్పద వక్ఫ్ బిల్లును వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ శీతాకాల సమావేశాల తొలిరోజున బిహార్ అసెంబ్లీ వెలుపల సిపిఐ(ఎం)లిబరేషన్ సోమవారం నాడు నిరసన ప్రదర్శన నిర్వహించింది. ఈ ప్రదర్శనకు సిపిఐ(ఎం) లిబరేషన్ లెజిస్లేటివ్ పార్టీ నాయకుడు మెహబూబ్ ఆలం నాయకత్వం వహించారు. ఈ సందర్భంగా ఆలం మాట్లాడుతూ కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వంతో తనకున్న పలుకుబడిని ఉపయోగించుకోవాలని, ప్రతిపాదిత చట్టాన్ని ఉపసంహరించుకునేలా కృషిచేయాలని ముఖ్యమంత్రి నితీష్‌కుమార్‌ను కోరారు. మంగళవారం తాము బిహార్ అసెంబ్లీలో వాయిదా తీర్మానం తీసుకువస్తామని మెహబూబ్‌ఆలం తెలిపారు. 243మంది సభ్యులు ఉన్న బిహార్ శాసనసభలో 11మంది సభ్యులను కలిగి ఉన్న సిపిఐ(ఎం) లిబరేషన్ పార్టీ ఇండియా కూటమిలో భాగస్వామిగా ఉన్నది.

## నేడు దేశవ్యాప్త నిరసనలు (మొదటి పేజీ తరువాయి)

ఆల్ ఇండియా అగ్రికల్చరల్ వర్కర్స్ యూనియన్ (ఎఎల్‌ఎడబ్ల్యుయు), భారతదేశంలోని అతిపెద్ద ట్రేడ్ యూనియన్ ఫెడరేషన్లలో ఒకటైన ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఎఐటియుసి), సెంటర్ ఫర్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ (సిఐటియు)కు చెందిన నాయకులు, కార్యకర్తలు, మద్దతదారులు భారీ ఎత్తున నిరసనల్లో పాల్గొననున్నారు. ప్రధాని మోదీ నయా మితవాద పంథాను అనుసరిస్తూ తీసుకొచ్చిన నూతన కార్మిక కోడ్‌ను తక్షణమే ఉపసంహరించుకోవాలని, అన్ని రకాల పంటలకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి)ను చట్టబద్ధం చేయాలని చాలా కాలంగా డిమాండ్లు ఉన్నాయి. అప్పట్లో రైతులను దెబ్బతీసి, వ్యవసాయాన్ని పూర్తిగా కార్పొరేట్ సంస్థల చేతుల్లో పెట్టడానికి ఉద్దేశించిన సాగు చట్టాలపై రైతులు ఉద్యమించిన విషయం తెలిసిందే. సుమారు ఏడాది కొనసాగిన ఆ ఉద్యమంలో కనీసం 800 మంది రైతులు ప్రాణాలు కోల్పోయారు. దేశ వ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తడంతోపాటు, ఉత్తరప్రదేశ్‌తో సహా కొన్ని కీలక రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు ముంచుకురావడంతో, గత్యంతరం లేక వాటిని కేంద్రం ఉపసంహరించుకుంది. అయితే, ఎంఎస్‌పికి చట్టబద్ధత వంటి డిమాండ్లపై రైతులు ఆందోళనను విరమించకపోవడంతో, త్వరలోనే ఆ హామీలను నెరవేరుస్తామని నమ్మబలికింది. కానీ, ఇప్పటి వరకూ రైతు డిమాండ్ల పరిష్కారం దిశగా ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. మరోవైపు కార్మికులు ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న హక్కులను కాలరాసే విధంగా అన్ని కార్మిక చట్టాలను రద్దు చేసి, ఆ స్థానంలో కోడ్‌లను తీసుకురావడంపైన కూడా వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. ఆ డిమాండ్లతోపాటు అందరికీ కనీసం 200 రోజుల ఉద్యోగం, కనీస వేతనం 26,000 రూపాయలు వేతనం అందించాలన్న డిమాండ్ కూడా ఉంది. రైతులు, కార్మికులకు సమగ్ర రుణమాఫీని అమలు చేయాలని కూడా కోరుతున్నారు. ఎంఎస్‌పి కోసం చట్టాన్ని అమలు చేస్తామన్న హామీని నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలమైందనే అంశాన్ని ఎస్‌కెఎం ప్రతిసారీ లేవనెత్తుతూనే ఉంది. అన్ని వ్యవసాయ ఉత్పత్తులకు ఎంఎస్‌పిని చట్టబద్ధం చేసేందుకు అంగీకరిస్తూ 2021, డిసెంబర్ 9న ఇచ్చిన లిఖితపూర్వక ఒప్పందాన్ని కూడా పట్టించుకోవడం లేదని ఎస్‌కెఎం ఆరోపిస్తున్నది. రైతుల ఆందోళనలను విరమింప చేయడానికి ప్రధాని ఈ నాటకం ఆడారని విమర్శిస్తున్నది. ఇప్పుడు తిరిగి అదే డిమాండ్‌తో నిరసనలకు పిలుపునిచ్చింది. ఇప్పటికే, ఈనెల 7 నుండి దేశ వ్యాప్తంగా జిల్లాల్లో ఇంటింటికి ప్రచారం ప్రారంభించింది. ఈ ప్రచారం ఈనెల 25 వరకు కొనసాగింది. 26న జరిగే నిరసనల్లో ప్రతి జిల్లాలోని కనీసం 100 గ్రామాల నుంచి రైతులు పాల్గొంటారని అంచనా వేస్తున్నది. దేశవ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో భారీ సభలను సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న వ్యవసాయ వ్యతిరేక విధానాలను ప్రచారం చేయడానికి ఒక కరపత్రాన్ని విడుదల చేసింది. అందులో రైతులు, వ్యవసాయ కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావించింది. పెరుగుతున్న సాగు ఖర్చులు, ద్రవ్యోల్బణ పరిస్థితులు కారణంగా ప్రతి సంవత్సరం రైతులు చేసే కర్చులు 12 నుంచి 15 శాతం పెరుగుతున్న వైనాన్ని వివరించింది. ఇక కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. కొత్త లేబర్ కోడ్‌ల కారణంగా కార్మికుల్లో అభద్రతాభావం పెరుగుతున్నది. ఇప్పటికే ఉన్న నిరుద్యోగ సమస్య మరింత పెరిగే ప్రమాదం ఉంది. పారిశ్రామిక వాడల్లో, పట్టణ ప్రాంతాల్లో శ్రామికులు ఎక్కువగా శ్రమ దోపిడీకి గురవుతున్నారు. కొత్త లేబర్ కోడ్‌ల వల్ల 'చట్టబద్ధమైన కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత, సామాజిక భద్రత, ఎనిమిది గంటల పని దినం, సంఘటిత లేదా అసంఘటిత రంగాల్లో వేతనాలపై సామూహిక బేరసారాల హక్కు వంటివి ఏవీ దక్కవు. బిజెపి తీసుకొచ్చిన ఈ బిల్లు 2020లోనే చట్టంగా రూపొందినప్పటికీ, అన్ని ప్రధాన ట్రేడ్ యూనియన్లు తీవ్రంగా వ్యతిరేకించడంతో అవి ఇంకా అమలు కాలేదు. అయితే, కార్మిక కోడ్‌లను అమలు చేయాలన్న సంకల్పాన్ని మోదీ ప్రభుత్వం పదేపదే ప్రకటిస్తున్నది. శ్రామిక వర్గానికి కీలకమైన సామాజిక భద్రతను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, అంతేగాక, ఆహారం, విద్య, ఆరోగ్యం తదితరాలపై సబ్సిడీలను తగ్గించిందని ఎస్‌కెఎం ఆరోపిస్తున్నది. మార్కెట్ ధరలకు ఆహారాన్ని కొనుగోలు చేయలేని శ్రామిక వర్గం అత్యధిక శాతం రేషన్ కోసం ఎదురుచూసే పరిస్థితులు నెలకొన్నాయని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నది. ఈ ఏపరిస్థితులు మెరుగుపడాలంటే, కేంద్రంపై ఒత్తిడి తీసుకురాక తప్పదని, అందుకే నిరసనలతో మలి ఉద్యమాన్ని ప్రారంభిస్తున్నామని ఎస్‌కెఎం, కేంద్ర కార్మిక సంఘాల ఐక్య వేదిక స్పష్టం చేస్తున్నాయి.

## దద్దరిల్లిన పార్లమెంటు

(మొదటి పేజీ తరువాయి)

అదానీ కుంభకోణం, మణిపూర్ సంక్షోభం, సంభాల్ మసీదు సర్వే హింసాకాండ, వయనాడ్ విపత్తులకు సంబంధించినవి ఉన్నాయని తెలిపారు. అయితే చైర్మన్ ఆదేశాలకు అనుగుణంగా లేవని నోటీసులను తిరస్కరించారు. వాటిపై చర్చ జరపాల్సిందేనని కాంగ్రెస్, వామపక్ష సభ్యులు పట్టుబడ్డారు. సభా కార్యకలాపాలను పక్కనబెట్టి, అదానీ కుంభకోణంపై చర్చ చేపట్టాలని , ఈ ముఖ్యమైన అంశం దేశమంతటిపై ఏ విధంగా ప్రభావం చూపిస్తుందో ప్రతిపక్ష పార్టీలు వివరిస్తాయని కాంగ్రెస్ అధ్యక్షుడు, రాజ్యసభ విపక్ష నేత మల్లికార్జున్ ఖర్గే సభలో కోరారు. ప్రపంచవ్యాప్తంగా ఈ అంశం దేశ ప్రతిష్టకు కళంకమైందని, అయినప్పటికీ ప్రధాని మోదీ మాత్రం అదానీకే మద్దతునిస్తున్నారని ఖర్గే ఆరోపించారు. చర్చ కోసం ఖర్గే చేసిన ప్రతిపాదనను చైర్మన్ తిరస్కరించారు. రాజ్యాంగాన్ని ఆమోదించి 75 ఏళ్లు అని చైర్మన్ ధన్‌ఖడ్ అనగా, 75 ఏళ్లలో తాను 54ఏళ్లు సభ్యునిగా ఉన్నానని ఖర్గే గుర్తు చేశారు. అందుకు చైర్మన్ అభినందనలు తెలపగా, ఖర్గే ధన్యవాదాలు తెలిపారు. అదానీ కుంభకోణంపై చర్చ జరగాల్సిందేనంటూ ప్రతిపక్షాలు వెల్‌లోకి వెళ్లడంతో సభ 15 నిమిషాలు వాయిదా పడింది. సభ తిరిగి 11:45 గంటల సమయంలో సమావేశమవగా, ప్రతిపక్షాలు చర్చకు పట్టుబట్టడంతో సభను బుధవారానికి వాయిదా వేస్తున్నట్లు రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ ప్రకటించారు.

**అదానీపై జెపిసి వేసేందుకు భయపడ్డ ప్రభుత్వం**

అదానీ అంశంపై చర్చ జరిపేందుకు, జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జెపిసి) వేసేందుకు ప్రభుత్వం భయపడిందని ఇండియా కూటమి పార్టీలు విమర్శించారు. మోదానీ అంశంతో ఉభయ సభలు దద్దరిల్లాయని, ఈ కుంభకోణంపై జెపిసి వేయాలనే ఇండియా కూటమి డిమాండ్ చేస్తోందని కాంగ్రెస్ ఎంపి జైరామ్ రమేశ్ సభ వాయిదా పడిన అనంతరం మీడియాకు తెలిపారు. అదానీ అంశంపై చర్చకు ప్రభుత్వం భయపడుతోందని మరో కాంగ్రెస్ ఎంపి కె.సి.వేణుగోపాల్ అన్నారు. అసలు ఆ అంశాన్నే సభలో లేవనెత్తవద్దని అధికార పక్షం భావిస్తుందని, కనీసం ప్రతిపక్షానికి వివరణైనా ఇవ్వాలని, లేదంటే తమ ఆందోళనను కొనసాగిస్తామని ఆయన చెప్పారు.


### నియోజకవర్గం అభివృద్ధికి సిఎం, మంత్రుల సంపూర్ణ సహకారం

# అభివృద్ధిలో రాజీపడేది లేదు

#### రాష్ట్ర మంత్రి తుమ్మల, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని



**ప్రజాపక్షం/భద్రాచలం :** కొత్తగూడెం నియోజకవర్గాభివృద్ధికి ముఖ్యమంత్రితో పాటు మంత్రివర్గం సంపూర్ణ సహకారం అందిస్తోందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎంఎల్ఎ కూనంనేని సాంబశివరావు అన్నారు. సోమవారం నందా తండా నుంచి వికలాంగుల కాలనీ వరకు నిర్మాణం చేపట్టనున్న బిటి రోడ్ల ప్రారంభోత్సవంలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి పాల్గొన్నారు. అనంతరం రూ.1.50కోట్లతో కొత్తగూడెంలో నిర్మించిన నూతన గ్రంథాలయ భవనం ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన తుమ్మల, మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మితో కలిసి పాల్గొన్న అనంతరం నూతన గ్రంథాలయ ప్రాంగణంలో జరిగిన సభలో తొలుత మాట్లాడారు. ఇప్పటికే ప్రభుత్వం నుండి పెద్ద ఎత్తున నిధులు రాబట్టి నియోజకర్గంలో మౌలిక సదుపాయాల కల్పనకు పనులు ప్రారంభించినట్లు చెప్పారు. ప్రజల దీర్ఘకాలిక సమస్యలతో పాటు ఎన్ఎండిసి, మైనింగ్ యూనివర్సిటీ, కెటిపిఎస్, విద్యుత్ ప్లాంట్ వంటి ఏర్పాటు అంశాలను ప్రభుత్వం ముందు ఉంచామని, జిల్లా కేంద్రం అభివృద్ధి సాధించేందుకు మరింత దోహదపడుతుందని, ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి సహకరించాలన్నారు. విద్యా, వైద్యపరంగా జిల్లా ముందంజలో ఉండేందుకు పెద్దలు సహకరించాలని, ఇంటిగ్రేటెడ్ స్కూల్, కొత్తగూడెం కార్పొరేషన్ అంశాలను కూడా ముందుకు తీసుకెళ్లేందు మంత్రులు సహకరించాలని కోరారు. బైపాస్ రోడ్డు పూర్తయితే కొత్తగూడెం నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందుతుందని అన్నారు. జిల్లాలో నూతన గ్రంథాలయ భవనాన్ని ప్రారంభించుకోవడం సంతోషదాయకమని, వివిధ పోటీ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థుల కోసం అన్ని రకాలు పుస్తకాలు అందుబాటులో ఉంచాలని చెప్పారు. పుస్తక పఠనం ఎంతో విలువైందని, పుస్తకాలు చదవడం నేర్చుకోవడం ద్వారా జ్ఞానం పెరుగుతుందని చెప్పారు. ఇక్కడి సభకు పెద్ద ఎత్తున మహిళలు కూడా హాజరయ్యారని, మీ పిల్లలను గ్రంథాలయాలకు పంపించేందుకు ప్రయత్నించాలని కోరారు. నియోజకవర్గాభివృద్ధికి ప్రభుత్వం చర్చించి పెద్ద ఎత్తున నిధులు తీసుకొచ్చి అన్నదూ లేనివిధంగా అభివృద్ధి చేస్తున్నామని, విద్య, వైద్యం, మౌలిక సదుపాయాల కల్పనలో రాజీపడేదే లేదని అన్నారు. అనంతరం రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ రియాజ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రానికి గ్రంథాయాలకు ఎంతో అవినాభావం సంబంధం ఉందని, తెలంగాణ ఉద్యమానికి ఒకరకంగా గ్రంథాలయాలదే ప్రధాన భూమిక అన్నారు. రాబోయే రోజుల్లో రాష్ట్రంలోని గ్రంథాలయాలన్నింటినీ డిజిటల్ గ్రంథాలయాలుగా మార్చేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌పి రోహిత్ రాజ్, అదనపు కలెక్టర్ వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా, డిసిఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాస్, కొత్తగూడెం మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, గ్రంథాలయ కార్యదర్శి శంకర్, గ్రంథపాలకులు జి.మణిమృదుల, ఎం.నవీన్, మధుబాబుతో పాటు వివిధ శాఖల అధికారులు, మున్సిపల్ కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజాను ఢిల్లీలో ఆయన నివాసంలో సిపిఐ(ఎంఎల్)–లిబరేషన్ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య, ఆ పార్టీ ఎంపి రాజారామ్ సింగ్ సోమవారం నాడు కలిశారు. ఈ సందర్భంగా తాజా రాజకీయ పరిణామాలు, వామపక్ష ఐక్యత గురించి వారు చర్చించారు.



## ఎక్సైజ్ డైరెక్టర్‌ను కలిసిన గెజిటెడ్ ఆఫీసర్ అసోసియేషన్ సభ్యులు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డైరెక్టర్, ఐఎఎస్ అధికారి చెవ్వూరు హరికిరణ్‌ను సోమవారం తెలంగాణ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డైరెక్టర్ హరికిరణ్‌కు పూలమొక్కలు, పుష్ప గుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షాలు తెలిపారు. డైరెక్టర్‌ను కలిసిన వారిలో తెలంగాణ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, మెదక్ డిప్యూటీ కమిషనర్ జె.హరికిషన్, అసిస్టెంట్ కమిషనర్లు శ్రీనివాసరెడ్డి, చెంద్రయ్య, గణేష్, విజయ భాస్కర్‌రెడ్డి, ప్రదీప్‌రావు, ఉజ్వలరెడ్డి, జీవన్ కిరణ్‌లు ఉన్నారు.

### నేడు గ్రామాలలో

## ‘పనుల జాతర’

#### మంత్రి కొండా సురేఖ



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నవంబర్ 26న రాజ్యాంగ దినోత్సవం, ప్రజాపాలన విజయోత్సవాలను పురస్కరించుకుని రాష్ట్రవ్యాప్తంగా సోమవారం అన్ని గ్రామపంచాయతీల వికాసానికి కాంగ్రెస్ ప్రభుత్వం ‘పనుల జాతర’ను నిర్వహిస్తున్నట్లు అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి సురేఖ తెలిపారు. కార్యక్రమంలో భాగంగా రూ.2,750కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు వివరించారు. రాజ్యాంగంలో పొందుపరిచిన నిబంధనలకన్నా పాలకుల స్వీయ నైతికతే మన దేశ భవిష్యత్తును నిర్దేశిస్తుందని చెప్పిన రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ మాటలను కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం అంతఃకరణశుద్ధితో ఆచరిస్తున్నదని కొండా సురేఖ అన్నారు. నవంబర్ 26న రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా రాజ్యాంగం రూపకల్పనకు సుదీర్ఘకాలం శ్రమించిన మేధావుల కృషిని మంత్రి సురేఖ ఒక ప్రకటనలో స్మరించుకున్నారు.

## జనగణనలో కులగణన చేపట్టాలి




బిసిల సమరభేరిలో అఖిలపక్ష నేతలు

**ప్రజాపక్షం / ఖైరతాబాద్ :** దేశవ్యాప్తంగా జనగణనలో కులగణన చేపట్టాలని, పార్లమెంట్ లో బిల్లు పెట్టి చట్టసభలలో బిసిలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటుచేయాలని బిసిల సమరభేరి మహాసభలో అఖిలపక్ష పార్టీ నేతలు కేంద్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బిసి ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలని, ప్రైవేటు రంగంలో ఎస్‌సి, ఎస్‌టి, బిసిలకు రిజర్వేషన్లు తేవాలని విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ రవీంద్ర భారతిలో బిసిల సమరభేరి మహాసభ సోమవారం జాతీయ బిసి సంక్షేమ సంఘం కన్వీనర్ గుజ్జ కృష్ణ, నిరుద్యోగ జెఎసి చైర్మన్ నీల వెంకటేష్, నంద గోపాల్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సభలో ముఖ్యఅతిథులుగా ఎంఎల్‌సి ప్రొఫెసర్ కోదండరామ్, కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంతరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు ఎన్.బాలమల్లేశ్‌తోపాటు పలువురు బిసి నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోదండరామ్, హనుమంతరావు మాట్లాడుతూ కులగణన చేయాలని మొదటినుంచి రాహుల్‌గాంధీ మాట్లాడుతున్నారని దాని ప్రభావం నేడు దేశవ్యాప్తంగా మార్పు మొదలైందన్నారు. బిసిల సమస్యల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని తెలిపారు. ఎన్.బాలమల్లేశ్ మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం దేశవ్యాప్తంగా జనగణనతో పాటు కులగణన చేపట్టాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ నిజామాబాద్ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీ మేరకు బిసిలకు వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో 42శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని కోరారు.

బిసిలకు ప్రత్యేక మంత్రిత్వశాఖ ఏర్పాటుచేసేందుకు కేంద్రం తక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఎన్నికలకు ముందు బిజెపి ప్రభుత్వం కులగణన జరుపుతామని హామీనిచ్చి, అధికారంలోకొచ్చిన తర్వాత దానిని అమలుపరచడంలో పూర్తిగా వైఫల్య చెందిందని విమర్శించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్, ఎంఎల్‌ఎ కౌసర్ మోహినోద్దీన్, జాతీయ బిసి సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జకృష్ణ, 56బిసి కుల సంఘాలు, బిసి, ఉద్యోగ సంఘాల నేతలు పాల్గొన్నారు.

## ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

#### జిహెచ్‌ఎంసి కమిషనర్ ఇలంబర్తి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రజావాణి కార్యక్రమంలో ఫిర్యాదు చేసిన సమస్యలను సత్వరమే పరిష్కరించాలని జిహెచ్‌ఎంసి కమిషనర్ ఇలంబర్తి అధికారులను ఆదేశించారు. జిహెచ్‌ఎంసి ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కమిషనర్ సమస్యల పరిష్కారం కోరుతూ వచ్చిన ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలించి, సమస్యలను సత్వరమే పరిష్కరించాలన్నారు. ప్రజల సమస్యలు పరిష్కరించడంపై ఆయా అధికారులు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్లు శివ కుమార్ నాయుడు, నళిని పద్మావతి, వేణుగోపాల్ రెడ్డి, గీతా రాధిక, ఎస్. పంకజ, సరోజ, సి.ఎన్. రఘు ప్రసాద్, సత్యనారాయణ, సుభద్ర దేవి, చంద్రకాంత్ రెడ్డి, ఇంజనీర్ ఇన్ చీఫ్ మాడపాటి దేవానంద్, చీఫ్ ఇంజనీర్(ఎస్ఎన్‌డిపి) కోటేశ్వర రావు, అదనపు చీఫ్ సిటీపానర్లు గంగాధర్, ప్రదీప్, ముఖ్య వైద్యాధికారి డాక్టర్ పద్మజ, జాయింట్ కమిషనర్లు మహేష్ కులకర్ణి, హౌసింగ్ ఎస్.ఈ. కృష్ణారావు, పి.వి. రమణ రాజేశ్వర్ రావు, జలమండలి జిఎం సాయి రమణ పాల్గొన్నారు.

## డ్రగ్స్ కేసులో ఇద్దరికి ఐదేళ్ల జైలు శిక్ష



**ప్రజాపక్షం/హైదరాబాద్:** డ్రగ్స్ కేసులో సంగారెడ్డి జిల్లా న్యాయమూర్తి ఇద్దరికీ ఐదేళ్ల జైలు శిక్షతో పాటు రూ. 25000 వేల చొప్పున జరిమానాను సోమవారం విధిస్తూ తీర్పు వెల్లడించారు. వివరాల్లోకి వెళితే.. 2016 సంవత్సరములో పటాన్‌చెరువు ఎక్సైజ్ పోలీస్ స్టేషన్లో ఓపియం డ్రగ్స్ అమ్మకాలు జరుపు ఇద్దరూ పట్టుబడ్డారు. పటాన్ చెరువుకు చెందిన గొల్ల రమణ, రవీందర్ యాదవ్‌లపై సిఐ రఘునాథరెడ్డి కేసు నమోదు చేశారు. 2016లో నమోదైన ఈ కేసులో సోమవారం సంగారెడ్డి జిల్లా న్యాయమూర్తి ఇద్దరికీ ఐదేళ్ల జైలు శిక్ష రూపాయలు 25 వేల జరిమానా విధిస్తూ తీర్పును వెల్లడించారు. ఐదేళ్ల జైలు శిక్ష విధించడంతో కోర్టు కానిస్టేబుల్ నందు సింగ్ ఇద్దరినీ జైలుకు తరలించారు. డ్రగ్స్ కేసులో నిందితులకు శిక్షపడే విధంగా చర్యలు చేపట్టినటువంటి ఎక్సైజ్ సిబ్బందిని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ విబి కమలాసన్ రెడ్డి,సంగారెడ్డి మెదక్ డిప్యూటీ కమిషనర్ హరి కిషన్ అభినందించారు.

## వర్మ ఇంటి వద్ద ఎపి పోలీసుల హైడ్రామా

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్‌లోని దర్శకుడు రామ్ గోపాల్ వర్మ ఇంటి దగ్గర హైడ్రామా నెలకొంది. ఆర్‌జివిని అరెస్ట్ చేసేందుకు ఒంగోలు పోలీసులు సోమవారం ఉదయం 10 గంటలకు ఆయన ఇంటికి వెళ్లారు. అయితే, వర్మ ఇంట్లో లేరని ఆయన సన్నిహితులు పోలీసులకు చెప్పారు. దాంతో పోలీసులు అక్కడే ఉండిపోయారు.ఆర్‌జివి ఎక్కడికి వెళ్లారనే విషయంపై పోలీసులు ఆరా తీశారు. దీంతో అరెస్టు భయంతోనే ఆర్‌జివి అదృశ్యమై ఉంటారని పోలీసులు అనుమానించారు. కాగా, ఒంగోలు రూరల్ పిఎస్ లో విచారణకు వర్మ హాజరు కావాల్సి ఉంది. అయితే ఆయన విచారణకు హాజరు కాకపోవడంతో... ఆయనను అరెస్ట్ చేసేందుకు పోలీసులు సిద్ధమయ్యారు. ఈ క్రమంలోనే ఇప్పుడు కనిపించకుండా పోయారు.

కాగా, వైసిపి హయాంలో ప్రతిపక్షనేతగా ఉన్న ప్రస్తుత సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ ఆర్‌జివి అనుచిత వ్యాఖ్యలు చేస్తూ సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టడంపై కేసు నమోదైన విషయం తెలిసిందే. ఒంగోలులో నమోదైన ఈ కేసు విచారణకు ఆయన హాజరు కాలేదు. అరెస్టు నుంచి రక్షణ కోసం హైకోర్టును ఆశ్రయించారు. అయితే, కోర్టు తాము రక్షణ కల్పించలేమని చెప్పడంతో విచారణకు వచ్చేందుకు కాస్త సమయం కావాలని కోరారు. కానీ, ఇచ్చిన గడువు ముగిసినా వర్మ విచారణకు రాకపోవడంతో ఒంగోలు పోలీసులు ఇవాళ హైదరాబాద్‌లోని ఆర్‌జివి ఇంటికి చేరుకున్నారు. దీంతో ఆర్‌జివి తరపు న్యాయవాది వచ్చి వారితో చర్చించారు. ఆర్‌జివి పోలీసుల విచారణకు పూర్తిగా సహకరిస్తారని, అయితే ఆన్‌లైన్ ద్వారా విచారణలో పాల్గొంటారని తెలిపారు. ఈ విషయంపై పోలీసుల నుంచి స్పష్టత రావాల్సి ఉంది.

## డిసెంబర్ 7న రాష్ట్ర వ్యాప్త ‘ఆటో బంద్’

#### ఆర్‌టిఎ జాయింట్ కమిషనర్‌కు సమ్మె నోటీసు అందజేసిన తెలంగాణ రాష్ట్ర ఆటో డ్రైవర్స్ యూనియన్స్ జెఎసి



**ప్రజాపక్షం / హైదరాబాద్ :** రాష్ట్రంలోని ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహిస్తున్న ప్రభుత్వ తీరును నిరసిస్తూ డిసెంబర్ 7వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా ఆటో బంద్ ను నిర్వహిస్తున్నామని ప్రభుత్వానికి తెలంగాణ రాష్ట్ర ఆటో డ్రైవర్స్ యూనియన్స్ జెఎసి సమ్మె నోటీసు ఇచ్చింది. ఈ మేరకు జెఎసి నేతలు బి.వెంకటేశం, ఎస్.అశోక్ (ఎఐటియుసి), ఎం.ఎ.సలీమ్ (యుటిఎడిడబ్ల్యూఎ), ఎ.సత్తిరెడ్డి (టిఎడిఎస్) తదితరులు సోమవారం హైదరాబాద్ ఖైరతాబాద్‌లోని ఆర్‌టిఎ కార్యాలయంలో సోమవారం ఆర్‌టిఎ జాయింట్ కమిషనర్ రమేష్‌ను కలిసి సమ్మె నోటీసు అందజేశారు. తమ సమస్యలను పరిష్కరించాలని అనేకసార్లు వినతి పత్రాలు అందజేసినా, ధర్నాలు, ర్యాలీలు, పికెటింగ్‌లు చేసినా గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదని, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఉదాసీన వైఖరి ప్రదర్శిస్తుందని అందుకే ఒక రోజు ఆటో బంద్ నిర్వహిస్తున్నట్లు వారు సమ్మె నోటీసులో తెలియజేశారు. ఈ సందర్భంగా జెఎసి కన్వీనర్ బి.వెంకటేశం మీడియాతో మాట్లాడుతూ దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలు రవాణారంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, పెరిగిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలకు అనుగుణంగా ఆటోమీటర్ చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. మహాలక్ష్మి పథకం ఫ్రీ బస్సు వల్ల ఆర్థికంగా నష్టపోయి ఆత్మహత్య చేసుకున్న ఆటోడ్రైవర్ల కుటుంబాలకు రూ.10 లక్షలు చొప్పున పరిహారం ఇవ్వాలన్నారు. గ్రేటర్ హైదరాబాద్‌లో 20వేల కొత్త ఆటో పర్మిట్లు ఇవ్వాలని, ఆటోలకు థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్ చెల్లించాలని, యాక్సిడెంట్ బీమాను రూ.10లక్షలకు పెంచాలని, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మానిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు అర్హులైన ఆటో డ్రైవర్లకు ఏడాదికి రూ.12 వేలు ఆర్థిక సహాయం అందజేయాలని అయన కోరారు.

## ‘అంబర్–రెసోజెట్’ పెట్టుబడులు

#### రూ.250కోట్లు, వెయ్యి మందికి ఉద్యోగాలు
#### పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు



**ప్రజాపక్షం / హైదరాబాద్ :** పలు దిగ్గజ కంపెనీలకు ఎలక్ట్రానిక్ వినిమయ వస్తువులు, విడిభాగాలు అందించే ‘అంబర్ – రెసోజెట్’ భాగస్వామ్య సంస్థ రాష్ట్రంలో రూ.250 కోట్ల పెట్టుబడులతో ఉత్పాదన ప్లాంట్లు ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చింది. పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సమక్షంలో సంస్థ ప్రతినిధులు తమ పెట్టుబడుల ప్రణాళికను సోమవారం వెల్లడించారు. అంబర్ రెసోజెట్ సంస్థకు ప్రభుత్వ పరంగా అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తామని ఈ సందర్భంగా శ్రీధర్ బాబు వెల్లడించారు. ఈ సంస్థ దేశంలోని పలు కంపెనీల కోసం గది ఎసిలు, అత్యాధునిక వాషింగ్ మెషీన్లు, డిష్ వాషర్లు, పారిశ్రామిక ఎయిర్ కండిషనర్ల లాంటి పలు పరికరాలను ఉత్పత్తి చేసి అందిస్తోందని ఆయన తెలిపారు. వచ్చే మూడేళ్లలో రూ.250 కోట్ల పెట్టుబడులతో పరిశ్రమలు నెలకొల్పుతుందని శ్రీధర్ బాబు వెల్లడించారు. దీని వల్ల ప్రత్యక్షంగా వెయ్యి మందికి ఉద్యోగాలు లభిస్తాయని పేర్కొన్నారు. త్వరలోనే అత్యాధునిక ప్రింటెడ్ సర్క్యూట్ బోర్డు (పిసిబి)ల ఉత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేస్తుందని శ్రీధర్ బాబు వెల్లడించారు. వందేభారత్ రైళ్లు, మెట్రో రైళ్ల ఎయిర్ కండిషనింగ్ వ్యవస్థలతో పాటు, బస్సులు, డిఫెన్స్ వాహనాలు, పారిశ్రామిక అవసరాలకు ఎయిర్ కండిషనర్ల తయారీలో అంబర్ ఎంటర్ ప్రైజెస్‌కు మంచి పేరుందని ఆయన తెలిపారు. దేశవ్యాప్తంగా ఉత్పత్తి యూనిట్లు ఉన్న అంబర్ తాజాగా హైదరాబాద్‌ను గమ్యస్థానంగా ఎంచుకున్నందుకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్, టిజి ఐఐసి ఎండి డా.ఇ.విష్ణువర్ధన్ రెడ్డి, సిఇఓ మధుసూదన్, డైరెక్టర్ ఎలక్ట్రానిక్స్ డా. ఎస్.కె.శర్మ, అంబర్, రెసోజెట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

### స్థానిక సంస్థల్లో బిసిలకు జనాభా

## దామాషా ప్రకారమే రిజర్వేషన్లు

#### రాష్ట్ర వ్యాప్తంగా బిసి వర్గాల ఏకాభిప్రాయం
#### బిసి కమిషన్ చైర్మన్ టి.నిరంజన్ వెల్లడి




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** స్థానిక సంస్థల్లో బిసిలకు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్ల కల్పించాలని బిసి వర్గాల నుంచి ఏకాభిప్రాయం వచ్చిందని తెలంగాణ బిసి కమిషన్ ఛైర్మన్ టి. నిరంజన్ చెప్పారు. స్థానిక సంస్థలలో బిసిలకు రిజర్వేషన్ల నిర్ధారణకు సంబంధించి 10 ఉమ్మడి జిల్లాలో తాము చేపట్టిన బహిరంగ విచారణ పూర్తైందని, బిసి వర్గాలకు నుంచి విశేష స్పందన లభించిందని ఆయన వెల్లడించారు. సోమవారం హైదరాబాద్‌లోని బిసి కమిషన్ కార్యాలయంలో బిసి కమిషన్ సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్ , బి.బాలలక్ష్మీ లతో కలిసి ఛైర్మన్ టి.నిరంజన్ నిరంజన్ మీడియాతోమాట్లాడారు. వివిధ కుల సంఘాల ప్రతినిధులు తమ సమస్యలను, వెనుకబాటుతనాన్ని కమిషన్ దృష్టికి తీసుకువచ్చారని ఛైర్మన్ నిరంజన్ వెల్లడించారు. ముఖ్యంగా రాష్ట్ర ఆవిర్భావం తర్వాత బిసి జాబితాలో నుండి తొలగించిన 26 కులాలను తిరిగి చేర్చాలని, గ్రూపులు మార్చడంతోపాటు వివిధ కులాల ఫెడరేషన్ల ఏర్పాటు చేసి బలోపేతం వంటి పలు అంశాలను కమిషన్ దృష్టికి తీసుకు వచ్చారని తెలిపారు. 10 ఉమ్మడి జిల్లాల్లో నిర్వహించిన బహిరంగ విచారణలో మొత్తం 1224 వినతులు అందాయని వెల్లడించారు.

**రాష్ట్రస్థాయి బహిరంగ విచారణ మొదటి రోజు విజయవంతం**

తెలంగాణ బిసి కమిషన్ ఆధ్వర్యంలో చేపట్టిన బహిరంగ విచారణ కొనసాగింపులో భాగంగా సోమవారం హైదరాబాద్‌లోని రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి బహిరంగ విచారణ విజయవంతంగా కొనసాగింది. ఈ సందర్భంగా ఈ బహిరంగ విచారణలో వివిధ బిసి సంఘాలకు చెందిన నాయకులు, మేధావులు, బిసి వర్గాలకు చెందిన నాయకులు, మేధావులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని తమ అభిప్రాయాలను సూచనలను లిఖితపూర్వకంగా అందజేయగా బిసి కమిషన్ చైర్మన్ జి. నిరంజన్, సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్ , బాలలక్ష్మి రంగులు వినతులను స్వీకరించారు. ఇందులో భాగంగా 58 వినతులు,సూచనలు అఫిడవిట్‌లో రూపంలో కమిషన్‌కు అందినట్లు బిసి కమిషన్ ఛైర్మన్ టి.నిరంజన్ తెలిపారు. మంగళవారం సైతం బహిరంగ విచారణ కొనసాగనుందని, బిసి వర్గాలు తమ తమ అభిప్రాయాలను సూచనలు అందజేయాల్సిందిగా కోరారు. ఈ సమావేశంలో డిప్యూటీ డైరెక్టర్ యు. శ్రీనివాస రావు, స్పెషల్ ఆఫీసర్ జి సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### తెలంగాణ సాంస్కృతిక సారథి

## చైర్‌పర్సన్‌గా డాక్టర్ వెన్నెల



#### మంత్రి జూపల్లి , టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ శుభాకాంక్షలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్ర సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్‌గా దివంగత ప్రజాగాయకుడు గద్దర్ కుమార్తె డాక్టర్ వెన్నెలబాధ్యతలు స్వీకరించారు. సోమవారం మాదాపూర్‌లోని సాంస్కృతిక సారథి కార్యాలయంలో జరిగిన కార్యక్రమానికి పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, టిపిసిసి అధ్యక్షులు, ఎంఎల్‌సి మహేష్ కుమార్ గౌడ్, ఎంఎల్‌సిలు పట్నం మహేందర్ రెడ్డి, ప్రొఫెసర్ కోదండరాం, మాజీ ఎంపి వి.హనుమంతరావు, సినీ నటుడు ఆర్, నారాయణ మూర్తి, విమల గద్దర్, భాషా, సాంస్కృతిక శాఖ సంచాలకులు డా.మామిడి హరికృష్ణ, తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ... ప్రభుత్వం చేపట్టే అభివృద్ధి, సంక్షేమ పథకాలను విస్తృతంగా ప్రచారం కల్పించడంతో పాటు సమాజాన్ని జాగృతం చేయడంలో వెన్నెల సారథ్యంలోని తెలంగాణ సాంస్కృతిక సారథి కృషి చేయాలని అన్నారు. ప్రజలను చైతన్యవంతం చేయడంతో పాటు తెలంగాణ సాంస్కృతిక ఔనత్యాన్ని ఇనుమడించే విధంగా కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు. డా.వెన్నెల నేతృత్వంలో తెలంగాణ సాంస్కృతిక సారథి మరింత బలోపేతం కావాలని అకాంక్షించారు. గత బిఆర్‌ఎస్ ప్రభుత్వ హయంలో ఆట, పాటకు ఆదరణ దక్కలేదని, కళాకారులకు సరైన గుర్తింపు దక్కలేదని చెప్పారు. ప్రజా ప్రభుత్వంలో కళాకారులందరికి సముచిత గౌరవం లభిస్తున్నందని వెల్లడించారు.

## ప్రభుత్వంలో విలీన ప్రక్రియ పూర్తిచేయాలి

#### టిజెఎస్ ఆర్‌టిసి జెఎసి ఛైర్మన్ అశ్వత్థామ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రభుత్వంలో విలీన ప్రక్రియను పూర్తి చేసి, దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని టిజిఎస్ ఆర్‌టిసి జెఎసి చైర్మన్ ఈ.అశ్వత్థామ రెడ్డి అన్నారు. ఈ మేరకు టిజిఎస్ ఆర్‌టిసి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జెఎసి ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి, రవాణా శాఖమంత్రి, రావాణా శాఖ ముఖ్యకార్యదర్శుల కార్యాలయాల్లో వినతిపత్రాలు అందచేశారు. ఈ సందర్భంగా అశ్వత్థామరెడ్డి మాట్లాడుతూ కార్మికుల న్యాయమైన డిమాండ్‌లను వచ్చేనెల మొదటివారంలోగా పరిష్కరించాలని, లేనిపక్షంలో 9వ తేదీ అనంతరం ప్రత్యక్ష పోరాటానికి దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జెఎసి నాయకులు మర్రి నరేందర్, కులకర్ణి, పున్న హరికిషన్, రాములు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్
సూపరింటెండింగ్ ఇంజనీర్, సికింద్రాబాద్ జోన్.
Short NIT.No. 41/SE(M)/Sec-bad Zone/GHMC/2024-25, ‘ఇ’-ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన తేది: 25.11.2024
పనుల సంఖ్య: 01 పని. అంచనా విలువ: రూ.65.00 లక్షలు, బిడ్స్ స్వీకరణకు ఆఖరి తేదీ & సమయం / ప్రారంభ తేది : బిడ్ దాఖలుకు ప్రారంభ తేదీ & సమయం: 26.11.2024న మ.01.00గం.ల నుండి, బిడ్ దాఖలుకు ఆఖరి తేదీ & సమయం: 29.11.2024న మ.01.00 గం.ల వరకు. సంప్రదించవలసిన పేరు & చిరునామా, సెల్ నం.: ఎస్ఇ, సికింద్రాబాద్ జోన్, జిహెచ్ఎంసి. సెల్: 9491642490 / 8008066855. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ అనగా http://www.tender.telangana.gov.inలో చూడవచ్చు.
సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్, సికింద్రాబాద్ జోన్, జిహెచ్ఎంసి.
DIPR R.O. No. : 7053-PP/CL/ADVT/1/2024-25, Date: 25-11-2024

# యువతరంగం

ఫోకస్

## పబ్లిక్‌'పై చిన్నచూపు!

మన దేశంలో పబ్లిక్ పాలసీ, పబ్లిక్ మేనేజ్‌మెంట్ అంశాన్ని విస్మరించినట్టు కనిపిస్తోంది. పబ్లిక్ రంగ విద్యా సంస్థలలో సరైన అధికారిక శిక్షణ లేకపోవడంతో, ప్రైవేటు రంగ సంస్థలతో ఇవి పోటీ పడలేక పోతున్నాయన్నది నిజం. దేశం మొత్తం మీద 1,113 విశ్వవిద్యాలయాలు ఉన్నాయి. వీటిలో 56 సెంట్రల్ యూనివర్శిటీలు. అయితే, కేవలం 130 విశ్వవిద్యాలయాల్లోనే పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ ప్రోగ్రామ్‌ను అందిస్తున్నారు. మరింత దారుణంగా, కేవలం 29 సంస్థలు పబ్లిక్ పాలసీ కోర్సులు నిర్వహిస్తున్నాయి. ఈ కోర్సులు సాధారణంగా 20 నుంచి 60 మంది విద్యార్థులతో, చిన్నచిన్న బ్యాచ్‌లుగా కొనసాగుతున్నాయి. ఈ రంగంలో అవకాశాలు చాలా పరిమితమన్న అభిప్రాయం అటు తల్లిదండ్రుల్లో, ఇటు విద్యార్థుల్లో వేళ్లూనుకోవడంతో, సూక్ష్మంగా 'పబ్లిక్ యాడ్' అని పిలిచే పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ కోర్సువైపు ఎవరూ కన్నెత్తి చూడడం లేదు. అనేకానేక రంగాల్లో ఈ కోర్సు పూర్తిచేసి, నైపుణ్యంగల ఉద్యోగులు, అధికారులు అవసరమన్న విషయాన్ని ప్రభుత్వాలు ప్రకటించడం లేదు. ఈ విషయాన్ని అసలే పట్టించుకోవడం లేదు. పబ్లిక్ పాలసీ విద్య మొత్తం ఇప్పటికీ పాశ్చాత్య విధానాలపై ఆధారపడే కొనసాగుతున్నది. కేస్ స్టడీల కోసం కూడా విదేశాల్లో జరిగిన ఘటనలనే అధ్యయనం చేయాల్సిన పరిస్థితి. దేశ సామాజిక, సాంస్కృతిక, రాజకీయ వైవిధ్యాలు, అంశాలను పక్కకుపెట్టి, విదేశీ విధానాలను అవలంభించడంలో ఔచిత్యం ఏమిటో అధికారులకే అర్థంకావాలి. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడుస్తున్నా, నేటికీ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, పబ్లిక్ పాలసీపై సరైన సిలబస్ రూపుదిద్దుకోకపోవడం దారుణం. అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ స్థాయిలలో పబ్లిక్ మేనేజ్‌మెంట్ అధ్యయనం చేయడానికి సరైన అవకాశాలు, సౌకర్యాలు లేవు. ఏదైనా ఒక కీలకమైన ఉద్యోగంలో చేరినప్పుడు, బాధ్యతలను తీసుకునే ముందుగానీ, విధులు నిర్వహిస్తున్న సమయంలోగానీ ప్రత్యేక శిక్షణకు ఏర్పాట్లు జరగడం లేదు. కార్యనిర్వాహక అధికార కేంద్రీకరణ కూడా విధాన రూపకల్పన పరిధిని, విశ్లేషకుల సంఖ్యను పరిమితం చేస్తున్నది. రాజకీయాలకు అతీతంగా కొనసాగాల్సిన విద్యా వ్యవస్థను సైతం కలుషితం చేసే విధానాలు నిస్సంకోచంగా కొనసాగుతున్నాయి. ప్రభుత్వాల జోక్యం, ఆయా పార్టీల ఇష్టాయిష్టాలపై నిర్ణయాలు తీసుకోవడం వంటి అంశాలు పబ్లిక్‌యాడ్ కోర్సు పరిస్థితిని మరింత దిగజారుస్తున్నాయి. పేలవమైన విధానాలు ఆర్థిక వృద్ధికి, ప్రజా సంక్షేమానికి ఆటంకం కలిగించడం సహజం. పరిమిత పౌర భాగస్వామ్యం మరో సమస్య. విధాన రూపకల్పన ప్రక్రియలపై అవగాహన లేకపోవడం మరో సమస్య. స్థానిక వాస్తవాలకు ఈ కోర్సు చాలా దూరంగా ఉంది. విదేశాల్లో అనుసరిస్తున్న విధానాల నుంచి కేస్ స్టడీస్ వరకూ ప్రతి అంశాన్నీ అనుకరించడం వల్ల 'స్థానికత' లోపిస్తున్నది. నిత్యం స్థానిక, ప్రాంతీయ, జాతీయ పరిణామాలను గమనించే విద్యార్థులు, ఈ విషయాలను విడిచిపెట్టి, విదేశాల్లో జరుగుతున్న లేదా జరిగిన ఘటనలను కేస్ స్టడీకి తీసుకోవడానికి ఇష్టపడడం లేదు. ఈ సమస్యలను పరిష్కరిస్తే తప్ప దేశంలో పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, పబ్లిక్ పాలసీ కోర్సులకు మంచి రోజులు రావు.




## విదేశాల్లో చదువుకు ఎడ్యుకేషన్ లోన్..



విదేశాల్లో ఉన్నత చదువుల కోసం వెళ్లే విద్యార్థులకు వివిధ బ్యాంకులు, ఆర్థిక సంస్థలు ఎడ్యుకేషన్ లోన్‌ను అందచేస్తున్నాయి. ఈ లోన్‌పై సరైన అవగాహన లేక ఇబ్బందిపడుతున్న వారు కూడా ఉన్నారు. ముందుగా ప్రణాళికను సిద్ధం చేసుకొని, సరైన సమయంలో సరైన నిర్ణయాలు తీసుకుంటే, విద్యా రుణం పొందవచ్చు. విదేశీ విద్య కోసం ఎడ్యుకేషన్ లోన్ సాధారణంగా రెండు రకాలు.. మొదటిది సెక్యూర్డ లోన్. రెండోది అన్ సెక్యూర్డ్ లోన్. మొదటి విధానంలో ఆస్తి, ఫిక్స్డ్ డిపాజిట్లు లేదా ఇతర ఆస్తులు వంటివి బ్యాంకుల్లో పెట్టాల్సి ఉంటుంది. ఈ లోన్ సాధారణంగా తక్కువ వడ్డీ రేట్లను అందిస్తాయి. అయితే, ఆస్తులుగానీ, ఇతరత్రా పత్రాలుగానీ లేనివారి కోసం అన్ సెక్యూర్డ్ లోన్ కూడా ఉంటుంది. ఈ విధానంలో ఎలాంటి ఆస్తులు తాకట్టు పెట్టాల్సిన అవసరం లేదు కానీ ఎక్కువ వడ్డీ రేట్లు, కఠినమైన అర్హత ప్రమాణాలు ఉండవచ్చు. ప్రతి బ్యాంకు ఎడ్యుకేషన్ లోన్ మంజూరు చేయడానికి అందుకు కొన్ని అర్హత ప్రమాణాలు చూస్తుంది. వీటిలో ఎడ్యుకేషన్ బ్యాక్ గ్రౌండ్, జిఆర్ఇ, జిమాట్ తదితర పరీక్షల్లో సాధించిన స్కోర్ లేదా ఐలెట్స్, టోఫెల్ తదితర పరీక్షల్లో సంపాదించిన గ్రేడ్ కీలక పాత్ర పోషిస్తుంది. గుర్తింపు పొందిన ఫారెన్ యూనివర్సిటీ నుండి అడ్మిషన్, స్టడీ కోర్సు వివరాలు తప్పనిసరి. లోన్ కోసం కావాల్సిన డాకుమెంట్స్ ఫారెన్ యూనివర్సిటీ నుండి అడ్మిషన్ లెటర్, అకడమిక్ రికార్డులు, ఎగ్జామ్ స్కోర్లు, ఐడి ప్రూఫ్ (ఆధార్, పాస్పోర్ట్ మొదలైనవి), రెసిడెంట్ ప్రూఫ్, ఫైనాన్సియల్ డాకుమెంట్స్ ఆదాయ ధ్రువీకరణ, ఐటీ రిటర్న్స్, బ్యాంక్ స్టేట్మెంట్లు). కొన్ని ప్రభుత్వాలు, ఆర్థిక సంస్థలు కూడా విదేశాల్లో చదువుతున్న విద్యార్థులకు సపోర్ట్ గా సబ్సిడీ లేదా ప్రత్యేక పథకాలను అందిస్తుంటాయి. మరొక విషయం ఏంటంటే విదేశాలకి వెళ్ళేటప్పుడు ఒక్కరిపైనా ఎలాంటి క్రిమినల్ కేసులు లాంటివి ఉండకూడదు. ఈ విషయాలను దృష్టిలో ఉంచుకొని, లోన్ కోసం ప్రయత్నిస్తే, విదేశాల్లో ఉన్నత చదువుల కల నెరవేరడం కష్టం కాదు.

## నాటి చైల్డ్ ఆర్టిస్టే... నేటి ఐఎఎస్

చాలా మంది సినిమా తారలకు వివిధ పాత్రల్లో నటిస్తుంటారు. ఐఎఎస్, ఐపిఎస్ అధికారుల పాత్రల్లో కొంత మంది నటించడం కాదు... జీవించేస్తారు. కానీ, నటీనటులు ఎవరూ గ్లామరస్ వినోద ప్రపంచాన్ని విడిచిపెట్టి, నిజ జీవితంలో సివిల్ సర్వెంట్స్‌గా వృత్తిని కొనసాగించిన దాఖలాలు లేవు. అయితే, చైల్డ్ ఆర్టిస్టుగా సినీ రంగంలో ప్రస్థానాన్ని మొదలుపెట్టి, అనేక హిట్ చిత్రాలు, టివి షోలలో నటించిన హెచ్ఎస్ కీర్తన మాత్రం రొటీన్ నటీనటుల కోవకు చెందదు. వెండితెర, బుల్లితెరపై స్టార్‌గా వెలుగుతూ, కెరీర్ పీక్‌లో ఉన్నప్పుడే కెరీర్‌కు స్వస్తి చెప్పిన కీర్తన, చిన్నతనం నుంచే యుపిఎస్‌సి పరీక్షను పూర్తి చేసి, సివిల్ సర్వెంట్‌గా సేవలు అందించాలన్న తన ఆశయాన్ని నెరవేర్చుకుంది. నిజానికి ఆమె నటనా కెరీర్ ఉజ్వలంగా ఉండేది. డబ్బుతోపాటు పేరుప్రఖ్యాతలు కూడా ఆర్జించి, సెలబ్రిటీగా లక్షలాది మంది అభిమానుల జేజేలు అందుకునేది. చిన్న వయసులోనే కెమేరా ముందుకొచ్చిన కీర్తన, తీరికలేని షెడ్యూల్స్‌తో బిజీగా ఉంటున్నప్పటికీ చదువును ఏమాత్రం అశ్రద్ధ చేయలేదు. తన ఆశయాలను బతికించుకుంది. గ్రాడ్యుయేషన్ పూర్తయిన వెంటనే యుపిఎస్‌సికు సన్నాహాలు ప్రారంభించింది. కానీ, లక్ష్యసాధనలో ఆమెకు ఎన్నో అడ్డంకులు ఎదురయ్యాయి. ఎన్ని ప్రయత్నాలు చేసినా ఫలితం లేకపోయింది. ఒకటికాదు.. రెండు కాదు.. ఏకంగా ఐదు పర్యాయాలు యుపిఎస్‌సి పరీక్షలో విఫలమైంది. ఆ స్థానంలో ఇతరులు ఎవరైనా ఉంటే, తిరిగి గ్లామర్ ప్రపంచాన్ని ఎన్నుకొని ఉండేవారు. కానీ, కీర్తన తన పట్టు వీడలేదు. ఆరో ప్రయత్నంలో యుపిఎస్‌సిని పూర్తి చేసింది. 167 ఆల్ ఇండియా ర్యాంక్ (ఎఐఆర్)తో సత్తా చాటుకుంది. మొదటి పోస్టింగ్‌ను కర్నాటకలోని మాండ్య జిల్లాలో పొందింది. అక్కడ ఆమె అసిస్టెంట్ కమిషనర్‌గా విధుల్లో చేరింది. ఐఎఎస్ అధికారిణి కావడానికి ముందు ఆమె కర్నాటక అడ్మినిస్ట్రేటివ్ సర్వీసెస్ (కెఎఎస్) పరీక్షలో ఉత్తీర్ణత సాధించి, రెండు సంవత్సరాలు కెఎఎస్ అధికారిణిగా పని చేసింది. కృషి చేస్తే, లాంటి కలలనైనా సాకారం చేసుకోవచ్చని నిరూపించిన కీర్తన యూత్ ఐకాన్‌గా నిలుస్తోంది.





## సవాళ్లకు ఎదురీత..



స్కాట్‌లాండ్‌కు చెందిన విలియామినాను భర్త వదిలేశాడు. అప్పటికి ఆమె వయసు కేవలం 20 ఏళ్లు. దిక్కుతోచని పరిస్థితి. ఏం చేయాలో అర్థంగాని ఆమె బతువు తెరువును అన్వేషిస్తూ అమెరికా చేరింది. మసచూసెట్స్‌లోని హార్వర్డ్ కాలేజీ అబ్జర్వేటరీ డైరెక్టర్‌గా పని చేస్తున్న ప్రొఫెసర్ ఎడ్వర్డ్ పెకెరింగ్ ఇంట్లో మనిమనిషిగా చేరింది. ఖగోళ పరిశోధనలో తీరికలేకుండా ఉండే ఎడ్వర్డ్‌కు సమయానుకూలంగా ఇంటిపనులు చేస్తూ, ఆయన నమ్మకాన్ని చూరగొంది. ప్రచారంలో ఉన్న కథను అనుసరించి, ఎడ్వర్డ్ ఒకసారి తన వద్ద పని చేస్తున్నవారిపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తాడు. సకాలంలో విధులు నిర్వర్తించలేకపోతున్నారంటే మండిపడతాడు. 'మీ కంటే మా ఇంట్లో పని మనిషి బాగా పని చేస్తుంది. మీ బదులు ఆమెకు ఉద్యోగం ఇస్తే బాగుటుంది' అంటాడు. ఈ ప్రచారం ఎంతవరకూ సరైనదో తెలియదుగానీ, విలియామినా స్కాట్‌లాండ్‌లో చదువుకున్నదని, 14 ఏళ్ల వయసులోనే ట్యూటర్‌గా పాఠాలు చెప్పిందని తెలియడంతో, 1881లో ఆమెకు హార్వర్డ్ అబ్జర్వేటరీలో ఉద్యోగమిచ్చాడు. తర్వాతి కాలంలో 'హార్వర్డ్ కంప్యూటర్స్'గా ప్రఖ్యాతిగాంచిన బృందంలో విలియామినా తొలి ఉద్యోగి. గ్లాస్ ప్లేట్ ఫొటోలను పరిశీలించడం, నక్షత్రాలను గుర్తించడం ఆమె పని. విధి నిర్వహణలో అపూర్వ ప్రతిభ కనబరచిన ఆమె, త్వరలోనే అబ్జర్వేటరీకి క్యూరేటర్‌గా పదోన్నతి పొందింది. కనీసం డజను మంది పని చేసే బృందానికి నాయకత్వం వహించింది. ఎన్నో కొత్త నక్షత్రాలను గుర్తించింది. లెక్కలేనన్ని అవార్డులు, రివార్డులు సంపాదించుకుంది. ఈ ప్రస్థానంలో విలియామినా ఎన్నో అడ్డంకులను సమర్థంగా అధిగమించింది. లెక్కలేనన్ని సమస్యలను తనకుతానుగా పరిష్కరించుకుంది. వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంది. అకుంఠిత దీక్షతో ఉన్నత శిఖరాలు అధిరోహించింది. విలియామినా వంటి ధీరవనితలు యువతకు మార్గదర్శకులు.

### యూత్ ఐకాన్స్

ఎంతో మంది యువతీయువకులు దేశ కీర్తిప్రతిష్టలను ఇనుమడింపచేశారు. చిన్న వయసులోనే అత్యున్నత శిఖరాలను అధిరోహించారు. యువతకు మార్గదర్శకులుగా నిలిచారు. అలాంటి అద్వితీయ ప్రతిభావంతుల గురించి క్లుప్తంగా తెలుసుకుందాం..

## అభివృద్ధి పేరిట భూములు లాక్కోవ్వద్దు

### బికెఎంయు రాష్ట్ర అధ్యక్షుడు కలకొండ కాంతయ్య



ప్రజాపక్షం/నార్సింగి : అభివృద్ధి పేరిట భూములు లాక్కోవ్వద్దని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కలకొండ కాంతయ్య ప్రభుత్వాన్ని కోరారు. అభివృద్ధి పేరా వేలాది ఎకరాల భూములను ప్రభుత్వం పరిశ్రమల యజమానులకు, రియల్ ఎస్టేట్ వ్యాపారులకు అప్పజెప్పడం సరికాదన్నారు. శంషాబాద్ మండల కేంద్రంలో సోమవారం శంషాబాద్‌లో 7, 8 తేదీలలో నిర్వహించే సమావేశాల కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలకొండ కాంతయ్య మాట్లాడుతూ అభివృద్ధి పేరా రైతుల భూములు తీసుకున్నా పరిశ్రమల్లో వ్యవసాయ కార్మికుల కుటుంబాల పిల్లలకు ఉద్యోగ అవకాశాలు దొరకడం లేవని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. బిజెపి ప్రభుత్వం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకాన్ని నిర్వీర్యం చేస్తూ వ్యవసాయ కార్మికులకు ఉపాధి దొరకకుండా చేస్తున్న పరిస్థితి ఉందన్నారు. ఈ పరిస్థితులలో రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు రంగారెడ్డి జిల్లా శంషాబాద్‌లో నిర్వహించడం ప్రాధాన్యం సంతరించుకుంటుందన్నారు. రెండు రోజులు రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు జరుగుతాయని, మొదటి రోజు దేశ అభివృద్ధిలో ఉపాధి హామీ కార్మికుల పాత్ర అంశంపై సదస్సు ఉంటుందని, సదస్సుకు రాష్ట్రమంత్రులతో పాటు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, సిపిఐ కూనమనేని సాంబశివరావు, ప్రొఫెసర్ హరగోపాల్ హాజరవుతున్నారు. వ్యవసాయ కార్మికులు పెద్దఎత్తున సదస్సులో పాల్గొనాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యుడు పుస్తకాల నర్సింగరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్ధుల జంగయ్య, అధ్యక్షుడు జె.అంజయ్య, ఎం.కృష్ణ, స్వరూప, బండి నరసింహ్మా, టి.సత్యం, రాములు తదితరులు పాల్గొన్నారు.

## విప్లవానికి దిక్సూచి ఫిడెల్ కాస్ట్రో



ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : సామ్రాజ్యవాద వ్యతిరేక తిరుగుబాటు విప్లవానికి దిక్సూచి ఫిడెల్ కాస్ట్రో అని ఎఐఎస్ఎఫ్ మాజీ జాతీయ ఉపాధ్యక్షులు రావి శివరామకృష్ణ తెలిపారు. సోమవారం ఖమ్మం గిరిప్రసాద్ భవన్‌లో ఎఐఎస్ఎఫ్ ఖమ్మం జిల్లా సమితి ఆధ్వర్యంలో ఫిడెల్ కాస్ట్రో తొమ్మిదవ వర్ధంతి నిర్వహించారు.ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శివరామకృష్ణ మాట్లాడుతూ గెరిల్లా పోరాటాలు నిర్వహించి స్వాతంత్ర్య ఫలాలు అందించిన విప్లవ వీరుడు ఫిడెల్ కాస్ట్రో 13 ఆగస్టు 1926 బైరాన్ క్యూబాలో జన్మించి 1969 నుండి 2008 వరకు క్యూబాను పాలించారన్నారు. ఫిడెల్ కాస్ట్రోను ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు ఉద్యమించాలని తెలిపారు. కార్యక్రమంలో ఖమ్మం జిల్లా సమితి కార్యదర్శి ఇటికాల రామకృష్ణ, ఎఐవైఎఫ్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి మద్దోజు శ్రావణ్‌కుమార్, శివకౌషిక్, హరికృష్ణ, రాజు, గోపి, నరేష్, ప్రతాప్, సాయిసందీప్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు

# ఏడాది కావస్తున్నా.. ఇచ్చిన హామీల అమలేదీ?

### సంక్షేమ, గురుకులాలపై రాష్ట్ర సర్కార్ నిర్లక్ష్యం
### సంబరాలపై ఉన్న దృష్టి ఫీజు బకాయిల విడుదలపై లేదా?
### ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి



ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి : రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయకుండా ప్రభుత్వం చేస్తున్న నిర్లక్ష్యం వల్ల విద్యార్థుల సెమిస్టర్ పరీక్షలకు ఆటంకం కలుగుతుందని ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి అన్నారు. ఫీజు బకాయిల విడుదల లేక రాష్ట్రంలో కళాశాలల బంద్ చేసినా ప్రభుత్వం స్పందించకుండా మౌనంగా ఉంటూ విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతుందన్నారు. రాష్ట్రంలో గురుకులాలు, హాస్టళ్లలో విద్యార్థులకు ఫుడ్ పాయిజన్‌లు జరుగుతూ అనారోగ్యానికి గురవుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ప్రభుత్వానికి ప్రజా విజయోత్సవాలపై ఉన్న దృష్టి విద్యార్థుల ఫీజు బకాయిల విడుదలపై లేదని ఆరోపించారు. సోమవారం కరీంనగర్ జిల్లా కేంద్రంలోని స్థానిక బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో జరిగిన సమావేశంలో మణికంఠరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో గత బిఆర్ఎస్ ప్రభుత్వం విద్యారంగాన్ని విస్మరించిందని రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని విద్యార్థులు వారి తల్లిదండ్రులు గెలిపిస్తే అధికారంలోకి వచ్చి దాదాపు యేడాది కావస్తున్నా ఎన్నికల్లో విద్యార్థులకిచ్చిన హామీల అమలు ఊసే లేదన్నారు. విద్యార్థినులకు ఎలక్ట్రిక్ స్కూటీలు, ల్యాప్‌టాప్, ఇంటింటికీ ఇంటర్నెట్, విద్యార్థులకు రూ.5లక్షల భరోసా కార్డు ఇస్తామని చెప్పి ఇప్పటికీ ఇవ్వలేదన్నారు. రాష్ట్రంలో ఫీజు బకాయిలు విడుదల లేకపోవడంతో విద్యార్థులు సర్టిఫికెట్ల కోసం ఇబ్బందులు పడుతున్నారన్నారు. సిబ్బందికి జీతాలు ఇవ్వలేక భవన కిరాయిలు చెల్లించలేక ఆర్థిక ఇబ్బందులతో కళాశాలలను నిర్వహణ చేయలేమని ప్రైవేట్ బడ్జెట్ కళాశాలల యాజమాన్యాలు సైతం గత అయిదు రోజుల నుంచి డిగ్రీ కళాశాలల నిరవధిక బంద్ నిర్వహించడంతో సెమిస్టర్ పరీక్షలు వాయిదా పడ్డాయన్నారు. దీని ప్రభావం విద్యార్థుల విద్యాసంవత్సర భవిష్యత్తుపై పడుతుందన్నారు. రేవంత్‌రెడ్డి ఆనాడు ప్రతిపక్ష హోదాలో ఫీజు బకాయిలను అధికారంలోకి రాగానే విడుదల చేస్తామని హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చి 11నెలలు కావస్తున్నా పెండింగ్ ఫీజు బకాయిలు ఇవ్వకపోవడం, సిఎం వద్దే విద్యాశాఖ ఉన్నా ఫీజు బకాయిలు విడుదల చేయడంలో నిర్లక్ష్యం సరికాదన్నారు. ప్రభుత్వం వెంటనే విద్యార్థుల చదువులను, భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని డిగ్రీ కళాశాలలతో చర్చించి పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, సంక్షేమ గురుకుల హాస్టళ్లలో ఫుడ్ సేఫ్టీ అధికారులతో నిత్యం తనిఖీలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ హాస్టళ్లు, గురుకులాలపై ప్రభుత్వ పర్యవేక్షణ లేకుండా పోయిందని, అద్దె భవనాల్లో కొనసాగుతున్న హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలని, విద్యాశాఖ తన వద్ద పెట్టుకున్న సిఎం రేవంత్‌రెడ్డి విద్యాశాఖపై సమీక్ష నిర్వహించడం లేదన్నారు. దీంతో సమస్యలు పెరుగుతున్నాయని, రాష్ట్రంలో విద్యాశాఖ మంత్రిని నియమించాలని మణికంఠరెడ్డి డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎఐఎస్ఫ్ అధ్యక్ష, కార్యదర్శులు రామారపు వెంకటేష్, మచ్చ రమేష్, నగర కార్యదర్శి మామిడిపల్లి హేమంత్, నగర నాయకులు సందీప్‌రెడ్డి, సాయికృష్ణ, వినయ్ రెడ్డి, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాసంఘాల బలోపేతమే లక్ష్యం





### సిపిఐ ఖమ్మం జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్

ప్రజాపక్షం/ఖమ్మం : ప్రజా సంఘాల బలోపేతమే లక్ష్యంగా కార్యాచరణ రూపొందించుకుని అమలు చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ తెలిపారు. స్థానిక గిరిప్రసాద్ భవన్‌లో సోమవారం ప్రజా సంఘాల సంయుక్త సమావేశం శింగు నర్సింహారావు అధ్యక్షతన జరిగింది. సమావేశంలో పోటు ప్రసాద్ మాట్లాడుతూ ప్రజాసంఘాల బలోపేతం తక్షణ కర్తవ్యంగా అన్ని ప్రజా సంఘాల మహాసభలను పూర్తిచేయాలన్నారు. పాలకవర్గాలు అన్ని రంగాల పట్ల నిర్లక్ష్య వైఖరి అవలంభిస్తున్నారని రైతు కార్మిక, యువజన, మహిళా వ్యతిరేక ప్రణాళికను పాలకులు అమలు చేస్తున్నారన్నారు. రైతులు అప్పుల ఊబిలోకి కూరుకుపోతున్నారని, అసంఘటిత రంగంలో ఉన్న కార్మికుల ఆదాయం తగ్గి ఖర్చులు పెరిగాయని, నిత్యావసర వస్తువుల ధరలకు నియంత్రణ లేదని, పాలకులు సామాన్యులను పట్టించుకోకుండా పాలన సాగిస్తున్నారన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో కార్మిక, రైతు, యువజన, విద్యార్థి, మహిళా సంఘాల సంఘటిత పోరాటాలు చేయాల్సిన అవసరముందన్నారు. బలమైన ఉద్యమ నిర్మాణం జరిగినప్పుడే ప్రజా సంఘాలు బలపడతాయని ప్రసాద్ తెలిపారు. భారత కమ్యూనిస్టుపార్టీ 100వ సంవత్సరంలోకి అడుగిడుతున్న సందర్భంగా పార్టీ సభ్యత్వ పునరుద్ధరణ కార్యక్రమాన్ని పూర్తి చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్‌కె జానిమియా, తాటి వెంకటేశ్వరరావు, తోట రామాంజనేయులు, రావి శివరామకృష్ణ, ఇటికాల రామకృష్ణ, శ్రావణ్, రేసు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

### ఉద్యమాల్లో విద్యార్థులు భాగస్వాములు కావాలి

ఖమ్మం అర్బన్ : వందేళ్ల ఘనమైన చరిత్ర కలిగిన సిపిఐలో ఎఐఎస్ఎఫ్ పాత్ర ఎనలేనిదని సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ తెలిపారు. సోమవారం పార్టీ సభ్యత్వాలను ఎఐఎస్ఎఫ్ ఖమ్మంజిల్లా సమితి నాయకులకు సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ అందజేశారు. ఈ సందర్భంగా పోటు ప్రసాద్ మాట్లాడుతూ ప్రజా ఉద్యమాల్లో విద్యార్థులు భాగస్వాములు కావాలన్నారు. ఈరోజు విద్యారంగ సమస్యలపై సమరశీల పోరాటాలు నిర్వహిస్తూ విద్యార్థుల గొంతుకగా ఎఐఎస్ఎఫ్ నిలిచిందన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు, పెట్రో ధరలు, కార్మికులకు కష్టం కలిగిన వారి తరుపున నిలబడి పోరాడే పార్టీ కేవలం సిపిఐ మాత్రమే అన్నారు. నిరుపేదలకు ఇండ్ల స్థలాలు, రేషన్ కార్డుల కోసం, పింఛన్ల కోసం రైతులకు రైతు భరోసా, రుణమాఫీ వంటి వాటి కోసం గొంతు విప్పి ప్రశ్నించగలిగేది ఎర్రజెండా నాయకులేనన్నారు. వందేళ్ల సిపిఐ ఆవిర్భావ వేడుకల్లో విద్యార్థులు పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ మాజీ జాతీయ ఉపాధ్యక్షులు రావి శివరామకృష్ణ, ఖమ్మంజిల్లా సమితి కార్యదర్శి ఇటికాల రామకృష్ణ, జిల్లా సహాయ కార్యదర్శి శివకౌషిక్, నాయకులు హరికృష్ణ, రాజు, గోపి, నరేష్, ప్రతాప్, సాయిసందీప్, పవన్, రాజు, రవి, గణేష్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

## వంట కార్మికులను తొలగించొద్దు

### సెంట్రలైజ్డ్ కిచెన్ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి
### వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవీందర్ డిమాండ్



ప్రజాపక్షం/ములుగుప్రతినిధి : సెంట్రలైజ్డ్ కిచెన్ నిర్ణయాన్ని ఉపసహరించుకోవాలని, వంట కార్మికుల అక్రమ తొలగింపును నిరోధిస్తూ జిఒ విడుదల చేయాలని మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి జంపాల రవీందర్ డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ ములుగు జిల్లా సమితి సమావేశం సోమవారం గన్నాల రాజకుమారి అధ్యక్షతన రిటైర్డ్ ఉద్యోగుల భవనంలో జరిగింది. సమావేశంలో జంపాల రవీందర్ మాట్లాడుతూ గత 22 సంవత్సరాలుగా సొంత డబ్బులు పెట్టి పాఠశాలలో వంటలు చేస్తూ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందిస్తూ, పెట్టిన పెట్టుబడి బిల్లులు, వేతనాలు, నెలల తరబడి పెండింగ్‌లో ఉన్న వంటలు చేస్తున్న వంట కార్మికులను రకరకాల కారణాలు చూపుతూ, అధికారులకు నచ్చకపోయినా వంట కార్మికులను తొలగించడానికి ప్రయత్నాలు చేస్తున్నారని, ఇది ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. సంవత్సర కాలంగా కోడిగుడ్ల బిల్లులు, అల్పాహారం బిల్లులు 9,10 తరగతుల విద్యార్థులకు సంబంధించిన బిల్లులు, అయిదు నెలలుగా వంట బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ప్రభుత్వం ఇస్తున్న మెనూ చార్జీలకు మార్కెట్‌లో పెరిగిన ధరలకు చాల వ్యత్యాసం ఉన్నందున, కోడిగుడ్లకైతే ప్రభుత్వం రూ.5లు చెల్లిస్తుంటే మార్కెట్‌లో రూ.7కు లభిస్తుంది మరి రెండు రూపాయలు నష్టం ఎవరు భరించాలన్నారు. గత పది సంవత్సరాలుగా మెనూ చార్జీలు పెంచకపోతే, విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాలు ఎలా అందిస్తారన్నారు. ఈ కారణాలు పరిగణలోకి తీసుకోకుండా వంట కార్మికులపై అభాండాలు మోపడం ఎంత వరకు సమంజసమన్నారు. ప్రభుత్వం, అధికారులు స్పందించి విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించే విధంగా మెనూచార్జీలు తరగతితో సంబంధం లేకుండా ప్రతి విద్యార్థికి, రూ.25 చెల్లించాలని, కోడిగుడ్లు, గ్యాస్ ప్రభుత్వమే సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. చేయని తప్పులను చేసినట్లు చూపించి వంట కార్మికులను తొలగించరాదని కోరారు. సమావేశం అనంతరం కలెక్టర్ కార్యాలయంలోని సూపరింటిండెంట్‌కు, డిఇఒ కార్యాలయాల సూపరింటిండెంట్‌కు వినతి పత్రాలు అంద జేశారు. సమావేశంలో ఎఐటియుసి నాయకులు ముత్యాల రాజు, తెలంగాణ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు జనగాం రజిత, ప్రధాన కార్యదర్శి దాసరి సరోజన, తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ జిల్లా సమితి సభ్యులు కుడుముల సమ్మక్క, సరోజన, పౌర రాధ, మాలగాని కమలక్క, లావణ్య, పద్మ, లలిత, కౌసల్య, ఆసరి లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

## ఎల్‌డిఎఫ్‌పై తప్పుడు ప్రచారం చేసినా ‘చెలక్కర’లో

# యుడిఎఫ్‌కు ‘మొండిచెయ్యే’

### కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ ఎద్దేవా

### ఉప ఎన్నికలల్లో రాష్ట్ర ప్రజలు వామపక్ష ప్రభుత్వం వైపే గట్టిగా నిలబడ్డారని హర్షం



**కోజికోడ్ :** కేరళలో లెఫ్ట్‌డెమొక్రటిక్ ఫ్రంట్‌కు సారథ్యం వహిస్తున్న ముఖ్యమంత్రి పినరయి విజయన్ కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలోని యునైటెడ్ డెమొక్రటిక్ ఫ్రంట్ (యుడిఎఫ్)పై ధ్వజమెత్తారు. కేరళ రాష్ట్రంలో జరిగిన ఉప ఎన్నికల సం దర్భంగా యుడిఎఫ్ మత సంస్థలతో చేతులు కలిపి ఎల్‌డిఎఫ్‌పై ‘తప్పుడు ప్రచారం’ చేసినప్పటికీ లెఫ్ట్ డెమొక్రటిక్ ఫ్రంట్ విశేష పనితీరును ప్రదర్శించిందని కితాబు ఇచ్చారు. వారి విజయాన్ని నిర్ధారించుకోవడానికి ఎల్‌డిఫ్‌కు వ్యతిరేకంగా మతపరమైన సంస్థలతో చేతులు కలపడానికి కూడా యుడిఎఫ్ వెనుకాడలేదని ధ్వజమెత్తారు. శనివా రం ప్రకటించిన చెలక్కర అసెంబ్లీ నియోజకవర్గంలో ఎల్‌డిఎఫ్ విజయం సాధించడం ఎంతో ప్రాముఖ్యమైనదని విజయన్ అభివర్ణించారు. శనివారం వెలువడిన పాలక్కాడ్ అసెంబ్లీ నియోజకవర్గం ఉప ఎన్నికల ఫలితాలలోఎల్‌డిఎఫ్ తన ఓటింగ్ షేర్‌ను గణనీయంగా పెంచుకోగలిగింద ని సిఎం సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈఉప ఎన్నిక కేరళ ప్రభుత్వానికి మూల్యాంకనం అవుతుందన్నారు. ఎల్‌డిఎఫ్ కాంగ్రెస్ నేతృత్వంలోని యుడిఎఫ్ తీవ్రస్థాయిలో వ్యతిరేక, తప్పుడు ప్రచారం చేసిన తర్వాత ఏమి జరిగిందని విపక్ష ఫ్రంట్ యునైటెడ్ డెమొక్రటిక్ ఫ్రంట్‌పై ముఖ్యమంత్రి పినరయి విజయన్ మండిపడ్డారు. ఆయన సోమవారం నాడు ఇక్కడ జరిగిన పార్టీ కార్యక్రమంలో ప్రసంగిస్తూ చెలక్కర నియోజకవర్గాన్ని కైవసం చేసుకునేందుకు యుడిఎఫ్ విశ్వప్రయత్నాలు చేసిందని, అంతేకాకుండా చెలక్కర అసెంబ్లీ నియోజకవర్గాన్ని దక్కించుకునేందుకే యుడిఎఫ్ అత్యంత ప్రాధాన్యతను ఇచ్చిందని విమర్శించారు. చెలరేగి గెలిచి రాజకీయంగా భారీ విజయం సాధించాలని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ప్రయత్నించిందని, ఫలితాల ప్రకటించిన తర్వాత ఏమి జరిగిందో ప్రశ్నించుకోవాలన్నారు. పాలక్కాడ్, చెల క్కర అసెంబ్లీ నియోజకవర్గాలు, వాయనాడ్ లోక్‌సభ నియోజకవర్గంలో ఎల్‌డిఎఫ్‌ను ఓడించేందుకు యునైటెడ్ డెమొ క్రటిక్ ఫ్రంట్ ఎస్‌డిపిఐ, జమాతే ఇస్లామీ వంటి సంస్థలతో చేతులు కలిపిందని ముఖ్యమంత్రి పినరయి విజయన్ ఆరోపిం చారు. ఉప ఎన్నికల ఫలితాలను మొత్తంగా గమనిస్తే కేరళ రాష్ట్ర ప్రజలు వామపక్ష ప్రభుత్వం వైపే గట్టిగా నిలబడ్డారన్న విషయం స్పష్టం అవుతోందన్నారు. గత లోక్‌సభ ఎన్నికలలో చెలక్కర అసెంబ్లీ సెగ్మెంట్‌లో పార్టీ పనితీరును పోల్చిచూస్తే యుడిఎఫ్ అభ్యర్థి తన వోట్ శాతాన్ని నిలబెట్టుకోలేకపోయిందని, కానీ ఎల్‌డిఎఫ్ అభ్యర్థి మాత్రం మంచి ఆధిక్యతతో విజయాన్ని దక్కించుకున్నారని ముఖ్యమంత్రి పినరయి విజయన్ సంతోషం వ్యక్తపరిచారు.

# ‘సంభాల్’ ఘటనలో 25 మంది అరెస్ట్

### ఎస్‌పి ఎంపి, ఎంఎల్‌ఎ కుమారుడిపై ఎఫ్ఐఆర్

### మరొకరి మరణంతో నాలుగుకు చేరిన మృతులు

లక్నో : ఉత్తర్‌ప్రదేశ్ సంభాల్‌లో మొగల్ కాలం నాటి మసీదు సర్వే సందర్భంగా ఆదివారం జరిగిన హింసాత్మక ఘటనకు సంబంధించి 25 మందిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ ఘటనకు సంబంధించి ఏడు ఎఫ్ఐఆర్‌లను నమోదు చేశారు. వాటిలో సమాజ్‌వాదీ పార్టీ ఎంపి జియా ఉర్ రెహమాన్ బర్క్, స్థానిక ఎస్‌పి ఎంఎల్‌ఎ ఇక్బాల్ మహమూద్ కుమారుడు సోహేల్ ఇక్బాల్‌లు, సహా ఆరుగురి పేర్లను నిందితులుగా చేర్చారు. మరో 2,750 మంది గుర్తు తెలియని నిందులుగా ఎఫ్ఐఆర్‌లో నమోదు చేశారు. ఈ విషయాన్ని జిల్లా ఎస్‌పి కృష్ణన్ కుమార్ వెల్లడించారు. ఇప్పటికే బైటి వారు సంభాల్‌లోకి ప్రవేశింకుండా ఈ నెల 30వ తేదీ వరకు నిషేదాజ్ఞలు విధించినట్లు జిల్లా కలెక్టర్ రాజేందర్ పెన్సియా తెలిపారు. బైటివారు, సంఘ సేవా సంస్థలు, ప్రజా ప్రతినిధులు సంబంధిత అధికారి నుంచి అనుమతి లేకుండా జిల్లా సరిహద్దుల్లోకి ప్రవేశించవద్దని నిషేధ్నాల్లో పేర్కొన్నారు. సంభాల్ తెహసీల్ అంతటా ఇంటర్నెట్ సేవలను నిలిపివేయటంతో పాటు, అన్ని పాఠశాలలకు సోమవారం నాడు జిల్లా యంత్రాంగం సెలవు ప్రకటించింది. సంభాల్‌లో మసీదు సర్వేను వ్యతిరేకిస్తు జరిగిన అందోళనలో అల్లర్లలో ముగ్గురు మరణించగా, సోమవారం నాడు చికిత్స పొందుతూ మరొకరు మరణించారు. దీంతో మృతుల సంఖ్య నలుగురికి చేరింది. నగరంలో శాంతియుత వాతావరణ నెలకొందని, పలువురు దుకాణాలు తెరిచారని ఎస్‌పి వెల్లడించారు.

**సుప్రీం కోర్టు జోక్యం చేసుకోవాలి :**

రాహుల్‌గాంధీహిందూ –ముస్లింల మధ్య గొడవలు సృష్టించేందుకు బిజెపి అధికారాన్ని వినియోగించటం యు పికి లేదా దేశ ప్రయోజనాలకు మంచిది కాదని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అన్నారు. సంభాల్ ఘటనపై సుప్రీం కోర్టు జోక్యం చేసుకొని, సాధ్యమైనంత త్వరలో న్యాయం చేయాలని ‘ఎక్స్’ ద్వారా విజ్ఞప్తి చేశారు. ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం వివక్షపూరిత, తొందరపాటు నిర్ణయం అత్యంత దురదృష్టకరమని, అన్ని పక్షాలఅభిప్రాయాలను వినకుండా అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవటంతో వాతావరణం దెబ్బతిని కాల్పులకు, పలువురు మరణానికి దారి తీసిందన్నారు. దీనికి బిజెపి ప్రభుత్వానిదే ప్రత్యక్ష బాధ్యత అని రాహుల్ గాంధీ విమర్శించారు. సంభాల్ ఘటనపై కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ స్పందిస్తూ యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం అధికారంలో ఉంచి ప్రజల్లో విభజన తీసుకువస్తుందని, సుప్రీం కోర్టు ఈ విషయాన్ని పరిగణలోకి తీసుకొని న్యాయం చేయాలని ఈ సందర్భంగా వారు విజ్ఞప్తి చేశారు.


**మా ఎంపి అక్కడ లేకున్నా ఎఫ్ఐఆర్ : అఖిలేశ్ యాదవ్**

తమ ఎంపి జియా ఉర్ రెహమాన్ సంభాల్‌లో లేనప్పటికీ ఆయన పేరును ఎఫ్ఐఆర్‌లో ఎందుకు చేర్చారని సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ ప్రశ్నించారు. ఆ ఘటనలో ముగ్గురు యువకులు ప్రాణాలు కోల్పోవడం విషాధకరమని, అందులో ఒకరు పోలీసుల కాల్పుల్లో మరణించిన వీడియోలు ఉన్నాయని, ఈ అల్లర్లు ముమ్మాటికీ ప్రభుత్వమే సృష్టించిందని ఆరోపించారు. సంభాల్ వాతావరణాన్ని చెడిపోయేందుకు కారణమైన పిటిషన్ దారుడు, పోలీసులు, అధికార యంత్రాంగంపై హత్యా నేరం కేసులు నమోదు చేయాలని , వారిలో అధికారులను సస్పెండ్ చేయాలని ఆయన ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ డిమాండ్ చేశారు.

సబర్మతి రిపోర్ట్ సినిమా చూసిన తరువాత కొంత మంది బిజెపి నాయకులు తాము కూడా పెద్ద నాయకులు కావాలని భావిస్తున్నారని, అలాంటి వారే ఈ ఘటనకు పాల్పడ్డారని అఖిలేశ్ ఆరోపించారు. కాగా సంభాల్ ఘటనకు బిజెపినే కారణమని బిహార్ ఆర్‌ఎల్‌డి నేత తేజస్వీయాదవ్ విమర్శించారు.

## ప్రసంగించేందుకు మాకూ..అనుమతి

### 75వ రాజ్యాంగదినోత్సవ వేడుకల్లో అవకాశం కోసం లోక్‌సభ స్పీకర్‌కు ప్రతిపక్షనేతల లేఖ



న్యూఢిల్లీ : రాజ్యాంగ దినోత్స వ వేడుకలలో ఉభయ సభల్లో ప్రతిపక్ష నేతలను మాట్లాడేందుకు అనుమతించాలని ఇండియా కూటమిలోని వివిధ ప్రతిపక్ష పార్టీలకు చెందిన నాయకులు లోక్‌సభ స్పీ కర్ ఓంబిర్లాకు సోమవారం నాడు ఒక లేఖ రాశారు. రాజ్యాంగ సభ రాజ్యాంగాన్ని ఆమోదించిన 75 వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం సంవిధాన్ సదన్‌లోని సెంట్రల్ హాల్‌లో జరుగనున్న కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉపరాష్ట్రపతి జగ్‌దీప్ ధన్కర్, ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రసంగించనున్నారు. ‘భారత రాజ్యాంగాన్ని ఆమోదించిన 75 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా సంవిధాన్ సదన్ సెంట్రల్ హాల్‌లో రేపు (మంగళవారం) జరుగనున్న కార్యక్రమం నేపథ్యంలో మేంఈ లేఖను మీకు రాస్తున్నాం. ఈ కార్యక్రమంలో భారత రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, ప్రధానమంత్రి ప్రసంగిస్తారని మాకు అర్థమైంది. ఈ చరిత్రాత్మక సందర్భంలో ప్రతిపక్ష పార్టీల నేతలకు సైతం మాట్లాడే అవకాశం ఇచ్చి అత్యున్నత స్థాయిలో పార్లమెంటరీ ప్రజాస్వామ్య ప్రయోజనాలు, సంప్రదాయాలను నెలకొల్పుతారని మేం విశ్వసిస్తున్నాం’అని వారు ఆ లేఖ లో పేర్కొన్నారు. లోక్‌సభ స్పీకర్‌కు రాసిన లేఖలో సంతకాలు చేసినవారిలో టిఆర్.బాలు,తిరుచిశివ, కనిమొజి, సుప్రియా సూలే, రాఘవ్ చద్దా, పి.సం దోష్ కుమార్, ఇటి.మొహమ్మద్ బషీర్, కె,రాధాకృష్ణన్, రాంజీ లాల్ సుమ న్, ఎన్‌కె.ప్రేమ్‌చంద్రన్ ఉన్నారు. సోమవారం నాడు పార్లమెంట్ శీతాకాల సమావేశాలు ప్రారంభమైన నేపథ్యంలో ఇండియా కూటమికి చెందిన ప్రతిపక్షనాయకులు సమావేశమయ్యారు. అదానీ గ్రూప్ అవినీతిపై గట్టిగా గళమెత్తాలని నిర్ణయించారు.అంతేకాకుండా ఈ అవినీతిపై జాయింట్ పార్లమె ంటరీ కమిటీ వేయాలని డిమాండ్ చేయాలన్న ప్రతిపాదనను వారు ఆమోదించారు.ఇండియా కూటమిలోని ప్రతిపక్షపార్టీల నేతలందరూ ఎఐసిసి అధ్యక్షులు, రాజ్యసభలో ప్రతిపక్షనేత మల్లికార్జున ఖర్గే పార్లమెంట్ హౌస్ ఆఫీస్‌లో సమావేశమయ్యారు. దీనిపై మల్లికార్జున ఖర్గే సహా పలువురు ప్రతిపక్ష సభ్యులు వాయిదాతీర్మానం నోటీసులు ఉభయ సభలకు అందజేశారు.

# ఎడతెగని సంఘర్షణ ఎదుర్కొంటున్న ‘మణిపూర్’

**న్యూఢిల్లీ :** మణిపూర్‌లో మరోసారి హింస చెలరేగింది. ఆందోళనకారులు వీధుల్లోకి వచ్చి విధ్వంసానికి పాల్పడ్డారు. ముఖ్యమంత్రి బీరేన్‌సింగ్ సహా పలువురు ఎమ్మెల్యేల నివాసాలపై దాడి చేశారు. మహిళలు, చిన్నారులను పొట్టనపెట్టుకుంటున్న వారిని శిక్షించలేకపోతే పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఉగ్రవాదుల దుశ్చర్యను నిరసిస్తూ పలు వాహనాలకు నిప్పు పెట్టారు. జిరిబామ్‌లో ఉగ్రవాదులు అపహరించి హత్య చేసిన ఆరుగురి మృతదేహాలు లభించడంతో పెద్ద ఎత్తున విధ్వంసం జరిగింది. దీంతో నిరవధిక కర్ఫ్యూ విధించారు. ఇంటర్నెట్ సేవలు నిలిపివేశారు. మృతులలో ముగ్గురు మహిళలు, ఇద్దరు చిన్నారులు ఉన్నారు. ఉగ్రవాదులు, భద్రతాదళాల మధ్య కాల్పులు జరిగిన తర్వాత జిరిబామ్‌లోని పునరావాస కేంద్రం నుంచి ఆరుగురు అదృశ్యమయ్యారు. వీరిలో ఇద్దరు మహిళలు, ఓ చిన్నారి మృతదేహాలు శనివారం బారక్ నదిలో లభించాయి. ఒక మహిళ, ఇద్దరు చిన్నారుల మృతదేహాలనుశుక్రవారం రాత్రి కనుగొన్నారు. ఉగ్రవాదుల దుశ్చర్యపై ఆగ్రహించిన నిరసనకారులు ప్రదర్శనలు జరిపారు. ముగ్గురు రాష్ట్ర మంత్రులు, ఆరుగురు ఎమ్మెల్యేల నివాసాలపై దాడులు చేశారు. ముఖ్యమంత్రి బీరేన్ సింగ్ అల్లుడు, బీజేపీ ఎమ్మెల్యే ఆర్.కె ఇమో సహా ముగ్గురు శాసనసభ్యుల ఇండ్లను ధ్వంసం చేశారు. వారి ఆస్తులకు నిప్పు పెట్టారు. ఇంఫాల్‌లోని వేర్వేరు ప్రాంతాలలో ఆందోళన చేస్తున్న నిరసనకారులను చెదరగొట్టేందుకు పోలీసులుభాష్పవాయు గోళాలు ప్రయోగించారు. శాంతి భద్రతల పరిస్థితి అదుపు తప్పటంతో ఇంఫాల్ లోయలోని ఇంఫాల్ ఈస్ట్, ఇంఫాల్ వెస్ట్, బిష్ణుపూర్, తౌబాల్, కక్‌చింగ్ జిల్లాలలో నిరవధిక కర్ఫ్యూ విధించారు. శాసనసభ భవనానికి కేవలం 200 మీటర్ల దూరంలో ఉన్న తంగ్‌మైబాండ్ ప్రాంతంలోని రోడ్డు మధ్యలో ఆందోళనకారులు టైర్లు వేసి నిప్పు పెట్టారు. జిరిబమ్ పట్టణంలో శనివారం రాత్రి కనీసం రెండు చర్చిలు, మూడు ఇండ్లను దగ్ధం చేశారు. జిరిబమ్‌లో శనివారం రాత్రి భద్రతా సిబ్బందితో జరిగిన కాల్పులలో పది మంది కుకీజో యువకులు చనిపోయారు. వీరి మృతదేహాలను అసోంలోని సిర్‌చార్ పట్టణం నుంచి చురాచాంద్‌పూర్‌కు విమానంలో తరలించారు. దానికి ముందు సిర్‌చార్ ఆస్పత్రిలో మృతదేహాలకు శవ పరీక్షలు నిర్వహించారు. మణిపూర్‌లో హింసాత్మక ఘర్షణలు మరియు రక్తపాతం కొనసాగడం తీవ్రంగా కలవరపరిచే అంశం, ప్రపంచమంతా తిరిగొచ్చిన ప్రధాని నరేంద్ర మోడీ మణిపూర్ రాష్ట్రాన్ని సందర్శించి అక్కడ శాంతిని పునరుద్ధరించే పని చేపట్టకపోవడం దిగ్భ్రాంతిని కలిగించే అంశం. ఇరవై నెలలుగా ఈశాన్య రాష్ట్రమైన మణిపూర్‌లో వివాదం నెలకొంది. 2023 మే ప్రారంభం నుంచి, హింస, స్థానభ్రంశం, ప్రాణనష్టం, జీవనోపాధి మరియు ఆస్తి నష్టం వంటివి సాధారణ స్థితిని దారుణంగా మార్చాయి. మే 3, 2023న, రాష్ట్ర రాజధాని ఇంఫాల్‌కు దగ్గరగా ఉన్న మణిపూర్‌లోని చురచంద్‌పూర్ పట్టణంలో మైతేయ్ కమ్యూనిటీ, కుకీ తెగ మధ్య హింస చెలరేగింది. షెడ్యూల్డ్ తెగ హోదా కోసం గిరిజనేతర మైటీ ప్రజల డిమాండ్ కారణంగా ఘర్షణలకు తక్షణ కారణం చెప్పబడింది. మెయిటీస్, కుకీలు సంక్లిష్టమైన చరిత్ర, సంక్లిష్టమైన సంబంధాన్ని పంచుకుంటారు. మెయిటీలు కుకీలను బయటి వ్యక్తులు, మాదకద్రవ్యాల వ్యాపారులుగా చూస్తారు, కుకీలు రాష్ట్రంలో ప్రధాన రాజకీయ పరిపాలనా స్థానాలను కలిగి ఉన్న మైటీలచే తమను తాము అట్టడుగున ఉంచుకున్నట్లు చూస్తారు. కొన్నేళ్లుగా రెండు వర్గాల మధ్య అనేక గొడవలు జరుగుతున్నాయి. ఏది ఏమైనప్పటికీ, రాష్ట్రవ్యాప్తంగా విస్తరించిన ప్రస్తుత అల్లర్లు ప్రజల ఆరోగ్యం, జీవనోపాధి, విద్యపై తీవ్ర పరిణామాలను కలిగి ఉన్నాయి.20నెలలపాటు రక్తసిక్తమైన సంఘర్షణలో చిక్కుకున్న రాష్ట్రంలో హింస మళ్లీ పుంజుకుంది. జాతి ఉద్రిక్తతలు మణిపూర్‌ను బహిరంగ యుద్ధ ప్రాంతంగా మార్చాయి. అశాంతిని అరికట్టడానికి అధికారులు కర్ఫ్యూ, ఇంటర్నెట్ బ్లాక్‌అవుట్‌ను మళ్లీ విధించారు. రెండు రోజులుగా మణిపూర్‌లో ఘోరమైన జాతి హింస పుంజుకుంది. అశాంతిని అణిచివేసేందుకు ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదు. ప్రభుత్వ ఉద్యోగాల కేటాయింపు ,భూమిని కొనుగోలు చేసే హక్కుకు హామీ ఇచ్చే ప్రత్యేక హోదాను అందుకుంటామని మైతేయి వాదనపై మైతీ ,కుకీ అనే రెండు గ్రూపుల మధ్య వివాదం రాజుకుంది. అశాంతిలో 300 మందికి పైగా మరణించారు మరియు కనీసం 80,000 మంది నిరాశ్రయులయ్యారు. హింస చెలరేగడంతో, గ్రామాలు తగులబెట్టడం లైంగిక వేధింపుల నివేదికలు విస్తృతంగా వ్యాపించడంతో, భారత సైన్యం ప్రవేశించి, రాష్ట్రాన్ని రెండు గ్రూపుల మధ్య పహారా కాస్తుంది. మణిపూర్ జనాభాలో 53 శాతం ఉన్న ప్రధానంగా మణిపూర్ లోయలో నివసించే మెయిటీ కమ్యూనిటీని ఎస్టీ జాబితాలో చేర్చాలనే డిమాండ అశాంతిని నెలకొల్పింది. కానీ అది కారణం మాత్రమే. అంతర్లీనంగా ఉన్న కోపం, చాలా కాలం పాటు తెగల మధ్య వైరుధ్యం అన్నీ కలిసి మణిపూర్ లో రావణకాష్టంకి దారితీసింది. రాష్ట్రంలోని కొండ ప్రాంతాలలో రిజర్వ్ చేయబడిన రక్షిత అడవులపై ప్రభుత్వం యొక్క నిర్బంధానికి మాత్రమే కాకుండా, కుకీల హింసకు గురవుతున్న భావనతో కూడా ముడిపడి ఉంది. మయన్మార్‌లోని సరిహద్దుకు ఆవల ఉన్న ఒకే జాతికి చెందిన అనేక మంది చిన్‌లు, భారతదేశంలోకి ప్రవేశించారు, అక్రమ వలసదారులు అని పిలవబడే వారిపై ప్రభుత్వం కఠినమైన వైఖరి కుకీలకు కోపం తెప్పించింది, వారి బంధువులు.మణిపూర్‌లోని కొండల్లోని రిజర్వ్‌డ రక్షిత అటవీ ప్రాంతాలను గిరిజన సంఘాలు ఆక్రమించడాన్ని వ్యతిరేకిస్తూ బిజెపి ముఖ్యమంత్రి కఠినమైన వైఖరి వివిధ కారణాల వల్ల వచ్చింది, మణిపూర్‌లో భూమిపై తీవ్రమైన ఒత్తిడి ఉంది. గిరిజన గ్రామాలలో జనాభా పెరగడంతో, వారు తమ చారిత్రక మరియు పూర్వీకుల హక్కుగా భావించే చుట్టుపక్కల అటవీ ప్రాంతాలకు వ్యాపిస్తున్నారు. దీన్ని ప్రభుత్వం వ్యతిరేకిస్తోంది. అదే సమయంలో, లోయలలో నివసించే మెయిటీలు, కొండ ప్రాంతాలలో స్థిరపడటానికి లేదా భూమిని కొనుగోలు చేయడానికి అనుమతించనందున కోపంతో ఉన్నారు, గిరిజన ప్రజలు లోయలలో భూమిని కొనుగోలు చేయవచ్చు.కొత్త గ్రామాలను ఎలా గుర్తించాలనే దానిపై ప్రభుత్వానికి అసలు విధానం లేదు. అలాగే మణిపూర్‌లో పారదర్శకమైన అటవీ విధానం లేదు. దీంతో సొంత పార్టీలోనే దుమారం రేగింది.ఇంఫాల్ లోయలోని తిరుగుబాటుదారులు శిబిరాల్లో చేరితే మైతీ, గిరిజన వర్గాల మధ్య పూర్తిస్థాయి సాయుధ పోరాటంగా సంక్షోభం తీవ్రరూపం దాల్చుతుందనే భయాల మధ్య సైన్యం, అస్సాం రైఫిల్స్ ఫ్లాగ్ మార్చ్‌లను కొనసాగించడంతో శనివారం యుద్ధవాతావరణం నెలకొంది. ఇదే సమయంలో భారత్‌మయన్మార్ సరిహద్దుల్లో అస్థిర పరిస్థితి నెలకొంది. మణిపూర్‌లో సాధారణ స్థితిని పునరుద్ధరించడానికి జరుగుతున్న ప్రయత్నాలకు ఇది హానికరం అని భద్రతా వర్గాలు వెల్లడించాయి. మైతీలైనా, కుకీలైనా అందరూ ఒకే రాష్ట్రానికి చెందిన వారు. శాంతి నెలకొంటేనే సమాజం ముందుకు సాగుతుంది



## విస్తృత ప్రజాప్రయోజనాల కోసం

# మతాచరణలో రాష్ట్రం జోక్యం చేసుకోవచ్చు

### స్పష్టం చేసిన సుప్రీంకోర్టు



**న్యూఢిల్లీ:** మతపరమైన విధానాలను ఆచరించే విషయంలో రాష్ట్రాలు జోక్యం చేసుకోవచ్చునని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. కానీ ఎప్పుడు జోక్యం చేసుకోవాలనే విషయంపై కూడా ఒక స్పష్టత ఇచ్చింది. విస్తృత ప్రజాప్రయోజనాలకు ఆటంకం కలిగినప్పుడు జోక్యం చేసుకోవచ్చు. ఒక రాష్ట్రం అమలు చేసే అభివృద్ధి చర్యలు, సమానత్వ హక్కులకు గనుక మతాచరణ ప్రక్రియ ఆటంకంగా, అవరోధంగా ఉంటే, నేరాలకు తోడ్పాటు ఇచ్చేదిగా ఉన్నట్లయితే అలాంటి సందర్భాల్లో రాష్ట్రాలు మతపరమైన ఆచరణ ప్రక్రియలో జోక్యం చేసుకోవచ్చు. విస్తృతమైన ప్రజా ప్రయోజనాలు సాధించాలనుకున్నప్పుడు అభివృద్ధి చర్యలకు, సమానత్వ హక్కులకు గనుక మతసంబంధమైన వైఖరులు ఆటంకాలుగా ఉంటే అందులో జోక్యం చేసుకోకుండా లౌకికదృక్పథంగల రాష్ట్రాన్ని ఎవరూ అడ్డుకోలేరు అని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ ఖన్నాలతో కూడిన ధర్మాసనం సోమవారంనాడు స్పష్టం చేసింది. రాజ్యాంగ పీఠికలో సామ్యవాదం, లౌకికవాదం అనే పదాలను చేర్చేందుకు రాజ్యాంగం గనుక అంగీకరించకపోవడం నిజమైతే, రాజ్యాంగానికి సవరణలు చేయడానికి అధికారం పొందిన పార్లమెంటు ద్వారా భారత రాజ్యాంగ పత్రం ఎల్లప్పుడూ సజీవంగానే ఉంటుందని ధర్మాసనం స్పష్టం చేసింది. ‘‘ఏదిఏమైనప్పటికీ విస్తృత ప్రజాప్రయోజనాలు సాధించేటప్పుడు అభివృద్ధి, సమానత్వ హక్కులకు గనుక మతానికి సంబంధించిన దానికి ముడిపడిన ఆచరణ ప్రక్రియలు ఏవైనా పెద్ద ఆటంకాలుగా మారినట్లయితే, అవరోధాలుగా ఉన్న అలాంటి వైఖరులను తొలగించడానికి లౌకిక దృక్పథంగల రాష్ట్రాన్ని అడ్డుకోలేరు, దీని సారాంశం ఏమిటంటే, సమానత్వ హక్కు అనే ఒక రాజ్యాంగ లక్షణానికి లౌకికతత్వం ప్రాతినిధ్యం వహిస్తుంది, రాజ్యాంగ ప్రణాళికను మౌలికంగా చెక్కుచెదరకుండా ఉంచేందుకు రూపొందించిన సమానత్వ సాధనకు ఈ లౌకికతత్వం ఒక ప్రతినిధి’’ అని ధర్మాసనం స్పష్టం చేసింది. 1976లో పార్లమెంటు సవరణ ద్వారా రాజ్యాంగ పీఠికలో ‘‘సామ్యవాదం’’, ‘‘లౌకికవాదం’’, ‘‘సమగ్రత’’ అనే మూడు పదాలను చేర్చారు. ‘‘1949లో ‘సెక్యులర్’ అనే పదాన్ని రాజ్యాంగంలో చేర్చేందుకు ఆలోచించినప్పుడు ఆ పదం అస్పష్టంగా ఉందని భావించారు, ఈ ‘‘లౌకికతత్వం’’ అనే పదం మతాన్ని వ్యతిరేకిస్తుందని ఆనాడు కొంతమంది విద్యావేత్తలు, నిపుణులు, న్యాయవేత్తలు భాష్యం చెప్పారు, ప్రభుత్వం ఏ మతానికీ దేశంలో మద్దతు ఇవ్వదు, ఏ మత విశ్వాసాన్ని ఆచరించినాగానీ ఆ వృ త్తిపై జరిమానా విధించదు అని రాజ్యాంగంలో ఉన్నందువల్ల ఆనాటి న్యా యనిపుణులు ‘‘లౌకికతత్వం’’ అనే పదం ఒకవేళ మతానికి ఆటంకం కాగలదన్న భాష్యం చెప్పారు’’ అని ధర్మాసనం వివరణ ఇచ్చింది.ఏ మతాన్ని ప్ర భుత్వం తన సొంతమతంబగా ఆచరించదు, ప్రభుత్వం దృష్టిలో ప్రజలు అందరూ సమానమే, అందరికీ స్వేచ్ఛ ఉంది, అందరూ తమ తమ మత వృత్తులు ఆచరించడానికి ప్రచారం చేసుకోవడానికి స్వేచ్ఛ ఉంది, ఎవరైనాగానీ తమ తమ మత విశ్వాసాలు, నమ్మకాలతో సంబంధం లేకుండా ఏ మతాన్ని అనుష్టించడానికైనా పౌరులకు స్వేచ్ఛను రాజ్యాంగం ఇచ్చింది, అందరికీ ఈ విషయంలో సమాన హక్కులున్నాయి’’ అని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఖన్నా అన్నారు. సోషలిస్టు, సెక్యులర్ అనే పదాలు రాజ్యాంగ పీఠికలో ఒక అంతర్భాగం అని స్పష్టం చేసింది. తీర్పు చెప్పడంలో 44 సంవత్సరాలుగా జాప్యమైన పిటిషన్లు సహా మొత్తం అన్ని పిటిషన్లను ఈ ప్రాతిపదికపై సుప్రీంకోర్టు ధర్మాసనం తిరస్కరించింది.

## ‘ఉల్ఫా’పై 5ఏళ్ల పాటు నిషేధం పొడిగింపు

### నోటిఫికేషన్ జారీ చేసిన కేంద్ర హోం మంత్రిత్వ శాఖ

**న్యూఢిల్లీ :** యునైటెడ్ లిబరేషన్ ఫ్రంట్ ఆఫ్ అసోం (ఉల్ఫా) పై 5ఏళ్లపాటు నిషేధాన్ని కేంద్రం పొడిగించింది. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ సోమవారం జారీ చేసిన ఒక నోటిఫికేషన్‌లో ఈ విషయం వెల్లడించింది. అసోంను భారత్‌నుంచి విడదీయడంతోపాటు ఇతర తిరుగుబాటు గ్రూప్‌లతో సంబంధాలు కొనసాగిస్తూ అక్రమార్జనకు పాల్పడుతున్న కారణంగా ఈ నిషేధం పొడిగింపు నిర్ణయం తీసుకున్నట్లు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ తెలియజేసింది. ఉల్ఫా మొట్టమొదట 1990సంవత్సరంలో నిషేధిత సంస్థగా ప్రకటించబడింది. అప్పటి నుంచి కాలానుగుణంగా ఈ నిషేధాన్ని పొడిగిస్తూ వచ్చింది. భారత సార్వభౌమాధికారం, సమగ్రతకు విఘాతం కల్పించే కార్యకలాపాలను ఉల్ఫా, దాని అన్ని వర్గాలు, విభాగాలు, ఫ్రంట్ ఆర్గనైజేషన్లు పాల్గొంటున్నాయని నోటిఫికేషన్‌లో పేర్కొంది. భారతదేశం నుంచి అసోంను విడదీయడం, తమ సంస్థ కోసం బెదిరింపులు, నిధుల దోపిడీని కొనసాగించడం, దోపిడీ, హింస కోసం ఇతర తిరుగుబాటు గ్రూప్‌లతో సంబంధాలు కొనసాగించడం తన లక్ష్యమని ఉల్ఫా ప్రకటించింది. నవంబరు 27, 2019నుంచి జులై 1, 2024వరకు అసోంలో పేలుళ్లకు పాల్పడటం, పేలుడు పదార్థాలను అమర్చడం వంటి అనేక కేసులు సహా 16 క్రిమినల్ కేసులను ఉల్ఫా కలిగిఉన్నది. అంతేకాకుండా ఉల్ఫా అక్రమ ఆయుధాలు, మందుగుండు సామగ్రిని కలిగిఉందన్న అభియోగం నమోదైంది. గత ఐదేళ్లలో పోలీసులు లేదా భద్రతాదళాల ఆపరేషన్లలో ముగ్గురు ఉల్ఫా హార్డ్‌కోర్ కేడర్లు మ రణించారని, మూడు ఛార్జిషీట్‌లను దాఖలు చేసి మూడు కేడర్లను ప్రాసిక్యూట్ చేయడం జరిగిందని, ఉల్ఫా కార్యకర్తలపై 15 కేసులు నమోదయ్యాయని హోం మంత్రిత్వ శాఖ వెల్లడించింది. 27ఇతర నేర కార్యకలాపాలలో ఉల్ఫా పాల్గొన్నదని, దానిలోని 56మంది సిబ్బందిని అరెస్ట్‌చేశామని, 63మంది కేడర్లు లొంగిపోయారనివివరించింది.ఉల్ఫా స భ్యుల వద్ద నుంచి27 ఆ యుధాలు, 550 రౌండ్లు, 9 గ్రెనేడ్లు, రెండు అధునాతన పేలుడు పరికరాలను స్వా ధీనం చేసుకున్నట్లు హోం మంత్రిత్వ శాఖ తెలిపింది. చట్ట విరు ద్ధ కార్యకలాపాల(నివారణ)చట్టం1967 (37ఆఫ్ 1967) నిబంధనలప్రకారం ఉల్ఫాను చట్టవిరుద్ధమైన సంఘంగా ప్రకటించాలని ప్రభుత్వం సిఫారసు చేసింది.

## జీవితంపై విరక్తి చెంది కూతురు సహా చెరువులో దూకి తండ్రి ఆత్మహత్య

**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి:** జీవితంలో ఏది సాధించలేకపోతున్నా నాకు చావేశరణ్యం నన్ను క్షమించంటూ భార్యనుద్దేశించి సుసైడ్ నోట్ రాసి భర్త ఆత్మహత్య చేసుకున్న ఘటన నిజామాబాద్‌లో చోటు చేసుకుంది. తన మరణం తర్వాత రెండవ పెళ్లి చేసుకోవాలని భార్యనుద్దేశించి సుసైడ్ నోట్ వాశాడు. బ్రెయిన్ సరిగ్గా ఎదగని తన కూతురు భార్యకు అడ్డు కాకూడదని ఆమెను వెంట తీసుకెళ్లి చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్న హృదయవిదారక ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. నగరంలోని సీతారాంనగర్ కాలనీ (గాజుల్‌పేట్)కు చెందిన రఘుపతి క్రాంతికుమార్(35)కుపెద్ద కూతురుకు చిన్ననాటి నుంచి మెదడు ఎదుగుదల లేకపోవటంతో ఆస్పత్రుల చుట్టూ తిరుగుతూ వైద్యమందిస్తున్నారు. అయినప్పటికీ ఫలితం లేకుండా పోయిందని ఈ క్రమంలోనే తాను జీవితంలో ఏది సాధించలేకపోతున్నానని, జీవితంపై విరక్తి చెందిన క్రాంతికుమార్ సోమవారం తెల్లవారు జామున 4 గంటల సమయంలో పాపతో పాటు న్యాల్‌కల్ చెరువు వద్దకు వెళ్లి అందులో దూకాడు. ధర్మారం గురుకులంలో డాటా ఎంట్రీ ఆపరేటర్‌గా పని చేసిన క్రాంతికుమార్ తెలంగాణ జాగృతిలో చురుగ్గా పని చేసినట్లు తెలుస్తుంది.


**SHRIRAM Finance వాహనముల బహిరంగ వేలం ప్రకటన**

సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా ఈ క్రింది వాహనములు వాయిదాలు సకాలంలో చెల్లించని కారణంగా స్వాధీన పరుచుకున్న వాహనములు ఉన్నవి ఉన్నట్లుగా వేలం ద్వారా విక్రయించుటకు నిర్ణయించనైనది.

| S.No | VEHICLE NO | Customer Name | MAKE & MODEL | YEAR |
|---|---|---|---|---|
| 1 | TS07UC 2365 | MOHAN REDDY GOPU | TOYOTA ETIOS DIESEL-P | 2016 |
| 2 | TS03ET 8138 | LINGAIAH VALLEPU | MAHINDRA 475 DI | 2018 |
| 3 | TS03UC 1009 | RAJU JATTI | TATA ACE MEGA -XL | 2017 |
| 4 | TS12UA 5017 | JAHANGEER PASHA MOHAMMAD | EITHER 11.10 FT | 2010 |
| 5 | TS30T 2735 | NITHIN KUSA | AL DOST | 2018 |
| 6 | TS07UE 4411 | SANDEEP KUATLA | AL 3118 SUPER FBT | 2017 |
| 7 | AP24TB 5141 | SWAROOPA KUKATLA | MAHINDRA XYLO-P | 2012 |
| 8 | TS03T 0228 | RAJU SHIVARATRI | TATA PRIMA 2523 T FBT | 2016 |
| 9 | TS03UB 9504 | PRASHANTH VAKKALA | EICHER 380 | 2017 |
| 10 | TS03EN 7830 | PRADEEP ODELA | JOHN DEERE 5310 HARVESTER | 2016 |
| 11 | TS03EG 5258 | VIJAY KUMAR THALLAPELLI | JCB 3DX | 2015 |
| 12 | AP01Y 3455 | MAHENDER BERE | AL 3116 IL FBT Auction on 26-11-2024 at Karimnagar | 2011 |

AUCTION DATE : 30-11-2024

VENUE : SHRIRAM AUTOMALL INDIA LTD, PUNNEL CROSS ROAD, BOLLIKUNTA, WARANGAL

గమనిక : ప్రకటన తేది నుండి బండి అమ్ముడు అయే వరకు వర్తించును

SHRIRAM FINANCE LIMITED
D.No : 24-7-29,1st Floor, Fathima Complex, Fathimanagar, Kazipet
Cell : , 9959090723, 9666726222




**డాక్యుమెంట్స్ పోయినవి**

హనుమకొండ జిల్లా, వేలేరు మండలములోని కన్నారం గ్రామానికి చెందిన **జక్కుల కనుకమ్మ భర్త పెద్దకొమురయ్య** గారికి సంబంధించిన పట్టాపాస్ బుక్కు గత సెప్టెంబర్ నెలలో కనుకమ్మ కన్నారం నుండి హనుమకొండకు బస్‌లో ప్రయాణం చేయుచుండగా భూమికి సంబంధించిన డాక్యుమెంట్స్ పట్టాపాస్ బుక్ పోయినది, పట్టాపాస్ బుక్ నెంబర్ **T21100020134**, ఖాతా నెం 267, గల పాస్ బుక్ దొరికినవారు ఈక్రింది అడ్రస్ లో ఇవ్వగలరని మనవి.

ఇట్లు: **జక్కుల కనుకమ్మ,**
**భర్త : పెద్దకొమురయ్య**
ఇంటి నెంబర్ : 1-42, గ్రామం : కన్నారం, మండలం : వేలేరు,
జిల్లా : హనుమకొండ,
పిన్ నెంబర్ - 505471,
ఫోన్ నంబర్: 9182545868


## రాజ్యాంగ పీఠికలో సోషలిస్టు–సెక్యులర్ చేరికపై

### విచారణకు సుప్రీంకోర్టు తిరస్కృతి



**న్యూఢిల్లీ:** రాజ్యాంగ పీఠికలో సోషలిస్టు, సెక్యు లర్, ఇంటిగ్రిటీ అనే మూడు పదాలను చేర్చడాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. ప్రదాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమా ర్‌లతో కూడిన ధర్మాసనం సోమవారం ఈ పిటిషన్లపై విచారణ జరిపేందుకు తిరస్కరించింది. ఈ పిటిషన్లపై కూలంకషంగా వాదనలు విని, విచారణ కొనసాగించాల్సిన అవసరం లేదని ప్రధాన న్యాయమూర్తి ఖరాకండీగా చెప్పారు. సామ్యవాదం, లౌకికవాదం, సమగ్రత అనే పదాలను రాజ్యాంగ పీఠికలో చేరుస్తూ 1976లో పార్లమెంటు రాజ్యాంగ సవరణ చేసింది. దీనిని సవాలు చేస్తూ రాజ్యసభ మాజీ సభ్యుడు సుబ్రహ్మణ్యస్వామి, న్యాయవాది విష్ణు శంకర్ జైన్, ఇతరులు దాఖలు చేసిన పలు పిటిషన్లపై తీర్పును సుప్రీంకోర్టు ఈ నెల 22న వెలువరించకుండా రిజ ర్వు చేసింది. జస్టిస్ సంజీవ్‌ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్‌లు రిజర్వు చేసిన తీర్పును సోమవారం వెలువరించారు. దీనిపై విచారణ అవసరం లేదని తిరస్కరించారు. ‘‘సామ్యవాదం, లౌకికవాదం అనే రెండు భావనలను రాజ్యాంగ సవరణ ద్వారా 1976లో రాజ్యాంగ పీఠికలో చేర్చారు. కానీ 1949లో ఆమోదం పొందిన భారత రాజ్యాంగంలో ఉన్న భావనలకు వీటికి తేడా ఏమీ లేదు,ఈ రెండుఒకటే, ఈ విధంగా పాతవాటిని తవ్వు కుంటూ చేసే వాదనలను సమ్మతించినట్లయితే ఇవన్నీ తర్వాత మిగిలిన రాజ్యాంగ సవరణలు అన్నింటికీ వర్తిస్తాయి’’ అని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సంజీవ్‌ఖన్నా స్పష్టం చేశారు.

తెలుగు జాతీయ దినపత్రిక
ప్రజాపక్షం
PRAJAPAKSHAM
మంగళవారం, నవంబరు 26

## కాప్ 29 : ఒక అడుగు ముందుకు

భూతాపం పెరుగుదలను పరిమితిలో ఉంచే నిరోధక చర్యలు అమలుకుగాను వర్ధమాన, పేద దేశాలకు అభివృద్ధి చెందిన దేశాలు అందించే సహాయంపై అజర్‌బైజాన్ రాజధాని బాకూలో జరిగిన కాప్ 29లో 200దేశాలు రెండు వారాలు పైగా కుస్తీపట్టిన తరువాత 2035 నాటికి ఏటా 300 బిలియన్ డాలర్ల సమకూర్చటానికి అభివృద్ధి చెందిన దేశాలు అంగీకరించటం కొంతలో కొంత మెరుగు. ఇది లక్ష్యం దిశగా ప్రయాణానికి ఏ మాత్రం సరిపోదని భారత్, మలావీ, బొలీవియా, నైజీరియా తిరస్కరించాయి. అయితే 'వాతావరణ నిధి'పై ఒప్పందం జరగకుండానే కాప్ 29(కాన్ఫరెన్స్ ఆఫ్ పార్టీస్-ఐరాస వాతావరణ మార్పుపై ఐక్యరాజ్యసమితి (ఫ్రేమ్‌వర్క్ కన్వెన్షన్ యొక్క) విధాన నిర్ణయాక సంస్థ) ముగిసే ప్రమాదం తలెత్తిన నేపథ్యంలో ఈ మాత్రం మెరుగైన ఒప్పందాన్ని సాధించటం కూడా గణనీయమైన సాఫల్యమే. అనేక శతాబ్దాలుగా వర్ధమాన దేశాల సంపదను దోపిడీ చేయటమే గాక, తమ స్వలాభాపేక్షకు ప్రకృతిని విధ్వంసంచేసే భూతాపాన్ని పెంచిన పాపాలను గుర్తించి, ప్రపంచానికి ఉపద్రవంగా పరిణమిస్తున్న వాతావరణ మార్పుల తీవ్రతను ఉపశమింపజేసేందుకయ్యే వ్యయభారాన్ని అభివృద్ధి చెందిన లేదా పారిశ్రామిక దేశాలు భరించాలని తృతీయ ప్రపంచ దేశాల ఒత్తిడిని అవి 29 ఏళ్ల క్రితం అర్ధమనస్కంగా అంగీకరించాయి. వర్ధమాన దేశాల్లో అభివృద్ధిలో ముందున్న దేశాలు కూడా ఆర్థికభారాన్ని పంచుకోవాలని వాదించాయి. గ్రీన్‌హౌస్ గ్యాస్‌ల విడుదల నియంత్రణను తాము ఆమోదిస్తే ఇప్పుడిప్పుడే అభివృద్ధిలోకి వస్తున్న తమ కృషి బుగ్గిపాలవుతుందని, వందల ఏళ్లుగా వాతావరణాన్ని కలుషితం చేసిన దేశాలు తమపై భారం మోపాలని చూడటం విడ్డూరంగా ఉందని చైనా, భారత్ నాయకత్వంలో గ్లోబల్ సౌత్‌గా పిలవబడే వర్ధమానదేశాలు అభ్యంతరం చెప్పాయి. అయితే కాలం గడిచేకొద్దీ ప్రకృతి వైపరీత్యాలు సృష్టిస్తున్న విధ్వంసాలతో విపరీతంగా నష్టపోతున్న ప్రపంచ ప్రజల ఒత్తిడివల్ల అభివృద్ధి చెందిన దేశాలు ఐరాస వాతావరణ నిధికి తాము అందించే సొమ్మును పెంచుతూ వచ్చాయి. గ్రీన్‌హౌస్ గ్యాస్‌ల పర్యవసానాలను అదుపు చేయగల టెక్నాలజీ కూడా ఆ దేశాలవద్దే ఉంది. ఈ క్రమంలో అవి 2020 నాటికి సాలీనా 100 బిలియన్ డాలర్ల సహాయం అందిస్తామన్న గత వాగ్దానాన్ని రెండేళ్ల ఆలస్యంగా 2022లో నెరవేర్చాయి. ఆ వాగ్దానం 2025తో ముగుస్తుంది. 100బిలియన్ డాలర్లతో పోల్చితే 300 బిలియన్ డాలర్ల సహాయానికి వాగ్దానం మేలే. కాని భూతాపంలో పెరుగుదలను 2100 సంవత్సరానాటికి పారిశ్రామికీకరణ పూర్వపు స్థాయిలనుంచి 1.5 డిగ్రీ సెల్సియస్‌కు పరిమితం చేయాలన్న పారిస్ అంతర్జాతీయ ఒప్పందం లక్ష్యం నెరవేరాలంటే ఏటా 1.3ట్రిలియన్ డాలర్ల సహాయం అవసరమని అంచనా. అయితే అమెరికాలో జనవరి 20 నుంచి ట్రంప్ అధ్యక్ష స్థానంలోకి వస్తున్నందున, 'వాతావరణ మార్పు బూటకం' అని భావించే ఆయన నాలుగేళ్ల పాలనలో నిధుల విడుదలపై, ఉద్గారాల విడుదల తగ్గింపు చర్యలపై అనుమానాలు లేకపోలేదు.


అయినా, బాకూ ఒప్పందం గ్లోబల్ వార్మింగ్‌కు వ్యతిరేకంగా బీమా విధానం అని వ్యాఖ్యానించారు ఐరాస వాతావరణ ఛీఫ్ సిమోన్ స్టీయిల్. "ఇది కష్టమైన ప్రయాణం. అయినా మేము ఒప్పందం సాధించాం. ఈ ఒప్పందం స్వచ్ఛమైన ఇంధన వినియోగాన్ని ప్రోత్సహిస్తుంది, వందలకోట్ల ప్రాణాలు కాపాడుతుంది" అన్నారు. పారిశ్రామిక దేశాలు శిలాజ ఇంధనాలను శతాబ్దాలుగా వినియోగించటం (గ్రీన్ హౌస్ గ్యాస్‌ల విడుదలలో వాటి వాటా అత్యధికం. దానివల్ల వాతావరణ మార్పులవల్ల కలుగుతున్న ఉత్పాతాలకు ఇతరులు లోనవుతున్నారు. అందుకు పారిశ్రామిక దేశాలు పరిహారం చెల్లించాలన్న అభిప్రాయాన్ని అవి సందేహాలకు అతీతంగా అంగీకరించక తప్పలేదు. అయితే కార్బన్ ఉద్గారాలను తగ్గించుకోవలసిన బాధ్యత అన్ని దేశాలపై ఉంది. 'శిలాజ ఇంధనాల నుంచి ఇతర ఇంధనాలకు పరివర్తన'కోసం గత సంవత్సరం దుబాయ్‌లో జరిగిన కాప్ 28 లో కుదిరిన చారిత్రాత్మక ఒప్పందాన్ని ముందుకు తీసుకెళ్లటానికి ఆయిలు ఉత్పత్తి దేశాలు ఉత్సాహం చూపటం లేదు. అయితే శిలాజ ఇంధనాలకు, భూగోళ తాపానికి సంబంధాన్ని అందరూ అంగీకరించినందున, ఒకింత ఆలస్యంగానైనా అట్టి పరివర్తనకు గల్ఫ్, ఇతర ఆయిలు ఆధారిత ఆర్థిక వ్యవస్థలు సిద్ధపడక తప్పదు.

# భారత రాజ్యాంగ పరిరక్షణ నేటి కర్తవ్యం

కృష్ణ ఝా

1949 నవంబర్ 26న ఆమోదం పొందిన మన రాజ్యాంగం 1950 జనవరి 26 నుంచి అమలులోకి వచ్చింది. లౌకికవాదం (సెక్యులరిజం) అనే పదాన్ని 42వ సవరణ ద్వారా 1976 డిసెంబర్ 18న రాజ్యాంగ పీఠికలో చేర్చడం జరిగింది. భారతదేశం పౌర స్వేచ్ఛావాదం, ప్రజాతంత్ర, లౌకికవాదం, సామాజికంగా మౌలిక పరివర్తలతోకూడిన సమాజం అనే ఆలోచనతో వికాసం చెందేందుకు పునాదులలో ఇదొకటి. అన్ని మతాలు సమానంగా గౌరవింపబడాలి. నిజానికి రాజ్యానికి ఎలాంటి మతం లేదని రాజ్యాంగం చెబుతోంది. పౌరులంతా తమ స్వంత మతం గురించి బహిరంగంగా చెప్పుకునేందుకు, అనుసరించేందుకు, ప్రచారం చేసుకునేందుకు అనుమతిస్తుంది. ''భారత రాజ్యాంగ మౌలిక నిర్మాణంలో లౌకికవాదం ఒక భాగం. దీని అర్థం అందరికీ స్వాతంత్ర్యం, అన్ని మతాలకు గౌరవం'' అని లౌకికవాదం గురించి అలెగ్జాండర్ ఒవిక్స్ రాశారు.

రాజ్యాంగాన్ని రాజ్యాంగ పరిషత్ రూపొందించింది. దీనిని ప్రాదేశిక శాసనసభల సభ్యులు పరిమిత వయోజన ఓటింగ్ విధానం ద్వారా పరోక్ష పద్ధతిలో ఎన్నుకోబడ్డారు. ఇది జాతీయోద్యమంలో ప్రజాదరణ పొందిన డిమాండ్. బ్రిటీష్ ప్రభుత్వం తీవ్ర ఒత్తిడిలోకి వచ్చి, చివరకు రాజ్యాంగ పరిషత్ ఏర్పాటుకు 1946లో ఆమోదం తెలిపింది. తమ వలసవాద ప్రభుత్వం నుంచి దేశానికి స్వేచ్ఛకోసం భారత ప్రజలు చేస్తున్న పోరాటంలో వ్యక్తమైన వారి దీర్ఘకాలిక ఆకాంక్ష ఫలితమే మన రాజ్యాంగమని చెప్పడం అతిశయోక్తి కాజాలదు. వాస్తవానికి మన రాజ్యాంగం మౌలిక సూత్రాలైన ప్రజాస్వామ్యం, స్వేచ్ఛ, స్వాతంత్ర్యం వగైరా ఆలోచనలను జాతీయోద్యమ ప్రక్రియలోనే ప్రజలలో పాదుకొల్పారు.



రాజ్యాంగ పరిషత్ సమావేశ దృశ్యం

వాస్తవానికి, మన రాజ్యాంగ మార్గదర్శక మూలమైన పీఠికకు నెహ్రూ రచించిన ప్రఖ్యాత విశేష తీర్మానమే ఆధారం. దీనిని 1947 జనవరి 22న రాజ్యాంగ పరిషత్ ఆమోదించింది. ఇందులో '' సాంఘిక, ఆర్థిక, రాజకీయ న్యాయం; ఆలోచన, వ్యక్తీకరణ, విశ్వాసం, నమ్మకం, ఆరాధన, స్వేచ్ఛ, హోదా , అవకాశంలో సమానత్వం వ్యక్తిగౌరవం, దేశ ఐక్యతను హామీయిచ్చే సౌభ్రాతృత్వాన్ని వారందరిలో పెంపొందించటం ఉన్నాయి. భారత దేశాన్ని సార్వభౌమ, సోషలిస్టు, లౌకిక, ప్రజాతంత్ర, గణతంత్ర దేశంగా రాజ్యాంగ పీఠిక ఏర్పాటు చేసింది.

మన రాజ్యాంగంలోని ముఖ్యమైన భాగం ఏమిటంటే అది కొన్ని ప్రాథమిక హక్కులను హామీ ఇస్తూ, వాటికి రాజ్యం రక్షణ కల్పించింది. ప్రాథమిక హక్కులలో సమానత్వ హక్కు, దోపిడీకి వ్యతిరేకంగా స్వాతంత్ర్యం, ఎవరికి వారు స్వంత మతాన్ని ఆమోదించటం ఉన్నాయి. అంతేగాక రాజ్యం నిరంకుశ చర్యల నుంచి వ్యక్తులు, మైనారిటీ గ్రూపులను పరిరక్షించడమే లక్ష్యంగా రాజ్యాంగ పరిష్కారాల హక్కు వంటివి ఉన్నాయి. మరోవైపు చట్టసభలు, రాజ్యం ''ప్రజల సంక్షేమాన్ని ప్రోత్సహించే'' విధంగా ప్రభుత్వ విధానాలకు సంబంధించిన ఆదేశిక సూత్రాలు ఉన్నాయి. ఈ విధంగా వ్యక్తి స్వాతంత్ర్యం, స్వేచ్ఛ ఆధారంగా ఆధునిక, ప్రగతిశీల, లౌకిక, సమ సమాజ నిర్మాణానికి రాజ్యాంగ ప్రాథమిక మౌలిక సూత్రాలు వస్తుగత పరిస్థితులను సృష్టించినట్లు కనిపిస్తున్నది.

రాజ్యాంగం తన పీఠిక ద్వారా దేశంలోని ప్రతి ఒక్కరికీ ఉమ్మడి సంస్కృతీ ప్రపంచాన్ని, భిన్నత్వంలో ఏకత్వమనే వాస్తవ సంకేతాన్ని, పరస్పర ప్రేమ, గౌరవం అనే అంశాలను హామీ ఇచ్చింది. కానీ, మన లౌకిక ప్రజాతంత్ర వ్యవస్థ నిర్మితమయ్యేందుకు ఉపయోగించిన మొదటి, చివరి ఇటుకను, దాని స్ఫూర్తిని ధ్వంసం చేయాలని మితవాద శక్తులు కృతనిశ్చయంతో ఉన్నాయి. లౌకిక స్ఫూర్తి ప్రజాబాహుళ్యం భాగస్వామిగా ఉన్న, విస్తృత వ్యాప్తి చెందిన స్వాతంత్ర్య పోరాటంలోనే వ్యక్తమైంది. భారత రాజ్యాంగంలో ప్రతిష్ఠించిన లౌకికవాద మౌలిక లక్షణాలను గత కొంతకాలంగా ఆర్ఎస్ఎస్ తమ దాడికి ప్రత్యేకించి లక్ష్యంగా చేసుకుంటున్నది. ఆధునిక, లౌకిక ప్రపంచ భావనను ఎత్తిపట్టిన రాజ్యాంగం అమలులోకి వచ్చిన నాటి నుంచే దాన్ని ఆర్ఎస్ఎస్ ఆక్షేపిస్తున్నది. ఆర్ఎస్ఎస్ పత్రిక 'ఆర్గనైజర్' 1949 నవంబర్ 30న 'రాజ్యాంగం' పేరుతో తీసుకువచ్చిన సంచికలో 'భారత నూతన రాజ్యాంగంలో ఘోరమైనది ఏమిటంటే అందులో భారతీయత గురించి ఏమీ లేకపోవటం.. ప్రాచీన భారతీయ రాజ్యాంగ చట్టాలు, వ్యవస్థలు, పేర్లు, శబ్దాల ఆనవాళ్ళు కూడా అందులో లేవు... స్పార్టా లైకర్గస్ లేదా పర్షియాకు చెందిన సొలొన్ కంటే ఎంతో ముందుగా మనువు చట్టాలు రాయబడ్డాయి. ఈ రోజుకు కూడా మనుస్మృతిలో ఆయన ప్రతిపాదించిన చట్టాల పట్ల ప్రపంచం ప్రశంసాపూర్వకంగా ఉత్తేజితమవుతుంది. అప్పటికప్పుడు విధేయత, ఆమోదయోగ్యతను సాధిస్తున్నాయి. కానీ, మన రాజ్యాంగ పండితులకు అది ఎంత మాత్రం పట్టింపు లేదు' అని పేర్కొంది. అలా భారతదేశాన్ని ఆర్ఎస్ఎస్ ఊహించినట్లు పరిపాలించే విధంగా హిందూత్వ సిద్ధాంతం ముందుకు సాగింది.

ఎన్నో ఏళ్ళుగా పెంపొందించుకుంటూ వస్తున్న మన రాజ్యాంగం ప్రబోధించిన ఆదర్శాలు గత పదేళ్ళలో గణనీయంగా క్షీణించటాన్ని భారతదేశం చవిచూస్తోంది.

ప్రస్తుత రాజ్యాంగాన్ని మార్చి, దాని స్థానంలో కొత్తది తీసుకురావాలని గత కొంత కాలంగా బిజెపి నాయకులు బహిరంగంగానే ప్రకటనలు చేస్తున్నారు.

మన రాజ్యాంగానికి నేడు 75 సంవత్సరాలు అనేది వాస్తవం. కానీ, అది ప్రాసంగికతను కోల్పోలేదు. అంతే కాకుండా అదేమి ఉచిత బహుమతి కాదు. ''జాతి ఉత్తమ రక్తంతో కొనవలసిన సంపద'' అని గాంధీజీ అన్నారు.

స్వాతంత్ర్య పూర్వం నుంచే వేదనాభరిత త్యాగాల ద్వారా సాధించుకున్న మన రాజ్యాంగ వారసత్వం నేడు ముప్పును ఎదుర్కొంటున్నది. దానిని పరిరక్షించుకునేందుకు లౌకిక శక్తులు మధ్య ఐక్యతనే ఏకైక మార్గం .

1950 జనవరి 26 నుంచి అమలులోకి వచ్చిన రాజ్యాంగం దాన్ని రూపొందించిన వారి దృష్టిలో లౌకికం, ప్రజాస్వామికం. నేటి భారతదేశం వాస్తవికత చాలా భిన్నంగా ఉంది. ప్రభుత్వం మీద ఆర్ఎస్ఎస్ నియంత్రణ సాధించింది. అది రాజ్యాంగ మూల స్వభావం మీదనే నేరుగా దాడి చేస్తున్నది. దాని స్థానంలో హిందూత్వను ప్రభుత్వ అనధికారిక భావజాలంగా చేయాలని ఆర్ఎస్ఎస్ కోరుకుంటున్నది.

# అదానీ మోసంపై చలనం లేని మోడీ సర్కారు

రాజ్యాంగ వ్యవస్థలను, విలువలను, కనీసమైన ప్రజాస్వామిక, నాగరిక సంప్రదాయాలను కూలదోయడంలో, ధ్వంసం చేయడంలో సంఘ్ పరివార్ చూపుతున్న శక్తి ఆశ్చర్యం గొలుపుతున్నది. ఇంతకన్న పతనం, ఇంతకన్న దుర్మార్గం, ఇంతకన్న నీచం సాధ్యమా అనుకున్న ప్రతిసారీ, దిగజారడానికి మరొకమెట్టు ఉందని సంఘ్ పరివార్ చూపుతున్నది.

ఈ పది సంవత్సరాలలో పార్లమెంటరీ రాజకీయ, అధికార, ఆర్థిక, విద్యా, సామాజిక, సాంస్కృతిక విలువల, న్యాయ వ్యవస్థలలో ప్రతి ఒక్కదాన్నీ కనీవినీ ఎరగనంత ధ్వంసం చేసి, వాటి అసలు స్వరూపం నుంచి తారుమారు చేసి, రూపంలో యథాతథంగా కనబడుతున్నప్పటికీ సారంలో డొల్లలుగా మార్చేసిన ఘనచరిత్ర సంఘ్ పరివార్ ది. మూడో దఫా అధికారం వచ్చిన తర్వాత మరింత నిస్సిగ్గుగా, మరింత దుర్మార్గంగా సాగనున్నదని సూచనలు కనబడుతున్నాయి. రెండో దఫా చివరిలో తన అనుంగు మిత్రుడు గౌతమ్ అదానీ అక్రమాలు బైటపడుతుండగా రక్షించడానికి ప్రారంభమయిన ఈ భారత్ తోడో కార్యక్రమం మూడో దఫా మొదట్లోనే మరొక మలుపు తిరిగి, సెబి వంటి స్వతంత్ర నియంత్రణా వ్యవస్థలను కూడా డొల్లచేసే దిశగా ముందుకు సాగుతున్నది.

2023 జనవరిలో బైటపడిన అదానీ కంపెనీల స్టాక్ మార్కెట్ అక్రమాలలో ప్రధానమైనది. అన్న పేరుతో నడిచే కంపెనీల నుంచి తమ్ముడి కంపెనీల షేర్లలోకి అక్రమ నిధుల బట్వాడా జరిగిందనేది. దాన్ని భారత స్టాక్ మార్కెట్ పరిభాషలో రిలేటెడ్ పార్టీ ట్రాన్సాక్షన్ (సంబంధిత వ్యక్తుల లావాదేవీలు) అంటారు. అటువంటి లావాదేవీలు స్టాక్ మార్కెట్ వ్యాపారాన్ని తారుమారు చేసే, అక్రమాలతో నింపే అవకాశం ఉందని, అందువల్ల ఆ లావాదేవీలను నియంత్రించడానికి, అడ్డుకోవడానికి, ఆంక్షలు విధించడానికి స్వతంత్ర సంస్థ అవసరమనే భావనతో సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజెస్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబి) అనే నియంత్రణా సంస్థ ఏర్పడింది. భారత పార్లమెంటు చట్టం ద్వారా ఏర్పడిన ఈ చట్టబద్ధ సంస్థ కర్తవ్యం ప్రజల తరపున చిన్న మధ్యతరగతి మదుపుదారుల ప్రయోజనాలు రక్షించడం. స్టాక్ మార్కెట్ దిగ్గజాలు, కార్పొరేట్ సంస్థలు, సంపన్నులు తమ ఆర్థిక బలాన్ని ఉపయోగించి స్టాక్ మార్కెట్ ను అల్లకల్లోలం చేయకుండా, చిన్న మదుపుదార్ల సంపద కొల్లగొట్టకుండా చూడడం. భారత స్టాక్ మార్కెట్ల చేసులో కార్పొరేట్ దొంగ గొడ్లు పడి నాశనం చేయకుండా భారత పార్లమెంటులో ప్రజా ప్రతినిధులు ఏర్పాటు చేసిన కంచె అది. కాని ఆ కంచె దొంగ గొడ్ల మేతను చూసీ చూడనట్టు ప్రవర్తిస్తున్నద 2023 జనవరి హిండెన్ బర్గ్ నివేదిక ఆ గొడ్లు ఎక్కడ ఎట్లా మేశాయో ఉదాహరణలు చూపింది. అప్పటికి ఇంకా చేసును కాపాడవలసిన కంచె ఎందుకు కాపాడకుండా ఉండిపోయింది. అనే అమాయక ప్రశ్న దగ్గరికి మాత్రమే చేరాం. సంపద ఎక్కడి నుంచి వచ్చిందో, సక్రమ మార్గాలలో వచ్చిందో, అక్రమ మార్గాలలో వచ్చిందో చెప్పనక్కరలేని, పన్నులు చెల్లించనక్కరలేని, పన్ను రహిత దేశాలలో డొల్ల కంపెనీలు పెట్టిన అన్న, భారతదేశంలోని తమ్ముడి కంపెనీ షేర్లు కొని, కొన్నట్టుగా నటించి మాయ చేస్తుంటే పట్టుకోవలసిన నియంత్రణా సంస్థ ఎందు కు పట్టుకోలేదు అని అప్పటి ప్రశ్న. ఆ నివేదిక బైటపడగానే దేశంలో వ్యవస్థల విధ్వంస చిహ్నాలు మరొకసారి బైటపడ డం మొదలయింది. నియంత్రణా సంస్థ తన తప్పును ఒప్పుకోకపోగా బుకాయింపులు మొదలుపెట్టింది. మసిపూసి మారేడు కాయ చేసిన రెండు నివేదికలనూ సుప్రీంకోర్టు అంగీకరించింది. ఈ మధ్యలో అధికారికంగా ప్రభుత్వ సంస్థలూ, అనధికారికంగా సంఘ్ పరివార్ సంస్థలూ గౌతమ్ అదానికి రక్షణ కావాచాలు తయారు చేశాయి. ఆ ప్రహసనం ఒక వైపు సాగిస్తూనే, మరొకవైపు హిండెన్ బర్గ్ పరిశోధనా సంస్థకే సంజాయిషీ నోటీసులూ, బోనెక్కించే ప్రయత్నాలూ, బెదిరింపులూ సాగించాయి. మహా ఘనత వహించిన భారత ప్రభు త్వ వ్యవస్థలు. ఈ తాటాకు చప్పుళ్లకు బెదరని హిండెన్ బర్గ్ తన పరిశోధనలు కొనసాగించి తీగ లాగుతూ డొంకలో ప్రవేశించింది. అసలు కంచెకే దొంగతనంలో భాగం ఉందని సాక్ష్యాధారాలు సంపాదించి, ఈ ఆగస్టో మరొక నివేదిక విడుదల చేసింది. ఈ కొత్త నివేదిక భారత ఆర్థిక వ్యవస్థలో అత్యంత ప్రధానమైన నియంత్రణా యంత్రాంగపు అత్యున్నతాధికారులు ఎట్లా అదానీ ప్రయోజనాలు రక్షించడానికి, పనిలో పనిగా తమ పనులు చక్కబెట్టుకోవడానికి పని చేస్తున్నారో చూపించింది. ఈ క్రమంలో ఏడాదిన్నర కింద బైట పెట్టిన ఆర్థిక అరాచకత్వాన్ని, అవినీతిని, మహా కుంభకోణాన్ని, అంతిమంగా భారత ప్రజల సంపద లూటీని ప్రభుత్వ మూ, ప్రభుత్వ పక్షమూ, దాని పరివారమూ, అధికార వ్యవస్థలూ పెంచి పోషిస్తున్నాయో చూపెట్టింది.

హిందూ ఐక్యత, దేశభక్తి, దేశాన్ని శక్తిమంతం చేయడం అనే ముసుగులతో సంఘ్ పరివార్ అసలు లక్ష్యం దేశ సంపదలను అంతకంతకూ ఎక్కువగా కేంద్రీకృతం చెయ్యడం, పిడికెడు మంది ప్రయోజనాల కోసం నూట నలభై కోట్ల ప్రజల ప్రయోజనాలను బలిపెట్టడం. సమాజం మీద, వనరుల మీద, సంపద మీద కొద్ది మంది అధికారాన్ని స్థాపించే, బలోపేతం చేసే విష విద్వేష విభజన వ్యూహం అది. మనుస్మృతి, వర్ణాశ్రమ ధర్మం, హిందుత్వ బ్రాహ్మణీయఫాసిజం కోరుకునే వ్యవస్థ అది. దానికి సామ్రాజ్యవాద దళారీ షోకులు అద్దుతున్న పాలన ఇది.తెల్లవారి లేస్తే ఈడి, సిబిఐ అంటూ హడావుడి చేసేవారు కన్నంలో దొంగలా దొరికిన అదానీ గ్రూపు అవినీతిని ఎందుకు విస్మరిస్తున్నట్టు? అదానీ గ్రూపు షేర్ల మాయాజాలం చేసినట్టు ఎన్నికల ముందు హిడెన్బర్గ్ నివేదిక వచ్చింది. దానిపై విచారణ జరిపించాలని ఎంతగా కోరినా, పార్లమెంటు స్తంభించిపోయినా మోడీ సర్కారులో చలనం రాలేదు. సుప్రీంకోర్టు కూడా 'సెబి'కి అప్పగించి వారి నివేదికతో సరిపెట్టింది. కానీ ఇప్పటికీ పూర్తి విచారణ జరిపి అన్నీ బయటపెట్టింది లేదు. ఈలోగా అన్నీ సర్దుబాటు చేసుకున్న అదానీ కంపెనీ వ్యాపారాలు వాటాల అమ్మకం మళ్లీ ఊపందుకున్నట్టు కథనాలు వచ్చాయంటే అంతా ఏలినవారి చలవే.

తెలుగు రాష్ట్రాల్లో కూడా ఈమధ్య కాలంలో అదానీ ఆయన ప్రతినిధులు పర్యటించి పలు చర్చలు జరిపి కొత్తగా ఒప్పందాలు చేసుకున్నారు.

గతంలో అదానీ అక్రమంగా రుణాలు సేకరించిందనీ, షేర్ల మాయాజాలం చేసిందనీ ఆరోపణలు వచ్చినపుడు కూడా ఇలాంటి వాదనలతోనూ సాంకేతిక సమర్థనలతోనూ సరిపెట్టారు. ఇప్పుడు ఈ వాదనలన్నీ కూడా అటే నడుస్తున్నట్టు కనిపిస్తుంది. దానివల్ల కూడా దేశానికి నష్టమే, ఎందుకంటే తప్పు చేసిన వాళ్ల పేర్లు బయటపెట్టకుండా కప్పిపుచ్చడమంటే బ్లాక్మెయిల్ చేయడానికి అవకాశం,తద్వారా మన ప్రయోజనాలు బలిపెట్టి తమ స్వార్థం సాగించుకోవడం జరగొచ్చు.కనుకనే దీన్ని ఇంతటితో వదలిపెట్టడం ప్రమాదకరం. సమగ్రమైన దర్యాప్తు జరిపి దోషులను శిక్షించడంతో పాటు వ్యవస్థలో లొసుగులు చక్కదిద్దడం అవసరం.శ్రీలంక, కెనడా, ఆస్ట్రేలియా, బంగ్లాదేశ్ వంటి దేశాల ప్రభుత్వాలు అదానీ ఒప్పందాలు రద్దు చేయడం, తనిఖీ చేయడం చూస్తున్నాం గానీ స్వదేశంలో మాత్రం ఆయన అక్రమాలు నల్లేరుమీద బండిలా నడిచిపోతున్నాయి, అయితే మోడీ సర్కారు కూడా ఎల్లకాలం అవినీతి కొండచిలువలను కాపాడలేదనేది స్పష్టం.దీన్ని అర్థం చేసుకోవడానికి, అశేష ప్రజానీకానికి అర్థం చేయించడానికి ఇంకా ఎన్ని రహస్యాలు బహిరంగం కావాలి.

# రాజ్యాంగంలో హక్కుదారులు, రాజకీయంలో లబ్ధిదారులు



డివివిఎస్ వర్మ
'దారి దీపం' సంపాదకులు
85006 78977

నవంబరు 26 రాజ్యాంగ దినోత్సవం. 1949లో రాజ్యాంగానికి తుదిరూపం ఇచ్చి ఆమోదించిన రోజు. ప్రభుత్వ సంస్థలు ఈ ఉత్సవాలను నిర్వహిస్తున్నాయి. అందులో ప్రజలకి ప్రత్యేకించి పేదలకి ఎలాంటి భాగస్వామ్యం ఉండదు. అవి ఒక తంతుగానే మిగిలిపోతున్నా యి. అందువల్ల రాజ్యాంగ దినోత్సవాన్ని పౌర సంఘాలు ప్రజల భాగస్వామ్యంతో ప్రజా సంఘాలు సమన్వయంతో అర్థవంతంగా నిర్వహించడం తప్పనిసరి అవసరం.

రాజ్యాంగం మన దేశ ప్రజలదని రాజ్యాంగ పీఠిక స్పష్టం చేస్తున్నది. ''భారత ప్రజలమైన మేము'' అన్న వాక్యంతో ప్రారంభమై ఈ రాజ్యాంగాన్ని మనకు మనమే సమర్పించుకుంటున్నాము అన్న వాక్యంతో ముగుస్తుంది. ఈ రాజ్యాంగానికి దేశ ప్రజలే హక్కుదారులు. దానిని అమలు జరిపించుకోవాల్సిందీ, రక్షించుకోవాల్సిందీ ప్రజలే.

రాజ్యాంగ సారాన్ని పీఠిక మనకు సంక్షిప్త రూపంలో అందించింది. అందుకే దానిని రాజ్యాంగానికి ఆత్మ అన్నారు. ఈ దేశాన్ని ఏ పునాదుల మీద నిర్మించాలన్న అంశంతో ప్రారంభం అవుతుంది. సార్వభౌమ, సామ్యవాద, లౌకిక, ప్రజా తంత్ర రిపబ్లిక్‌గా నిర్మించాలని ప్రకటిస్తుంది. ఈ లక్ష్యాలకు విరుద్ధంగా దేశాన్ని నడిపించాలనే భావనలు రాజ్యాంగ విరుద్ధం. హిందూ రాష్ట్ర నినాదం అలాంటిదే. పీఠిక నుండి లౌకిక, సామ్యవాద పదాలను తొలగిస్తామనడం, రాజ్యాంగానికి సవరణలే కాకుండా రాజ్యాంగాన్ని మారుస్తాం అనడం అలాంటివే. ఇలాంటి భావజాలాన్ని ప్రజలు తిరస్కరించాలి. తిప్పికొట్టాలి.


రాజ్యాంగ పీఠిక ప్రజలందరికీ సామాజిక, ఆర్థిక రాజకీయ న్యా యం కల్పించే హామీని ఇచ్చింది. భావ ప్రకటన, మత స్వేచ్ఛ అందరికీ ఉంటుందని, అందరికీ సమాన అవకాశాలు కల్పించాలని స్పష్టం చేసింది. అలాగే కుల, మత, భాషా, ప్రాంతీయపరమైన భిన్న త్వం గల దేశంలో ప్రజలు విద్వేషానికి లోనుకాకుండా సోదర భావాన్ని పెంపొందించుకుని దేశ సమైక్యతను కాపాడుకోవాలని సూచించింది.

ఇప్పటికీ దేశంలో సామాజిక పరంగా కులపరమైన, లింగ పరమైన, వివక్షలు కొనసాగుతున్నా యి. ఆర్థిక న్యాయం జరగకపోగా అంతరాలు పెరుగుతున్నాయి. రాజకీయ రంగంలో సామాన్యులకు స్థానం లేకుండా పోయింది. అది కుబేరుల ఆటగా మారింది. ఈ అంశాలను రాజ్యాంగ దినోత్సవ కార్యక్రమాలలో చర్చించాలి. రాజ్యాంగంలో ప్రజలు పాటించాల్సిన విధులు వున్నా యి. రాజ్యాంగాన్ని, జాతీయ గీతాన్ని, జెండాను గౌరవించాలని, కుల, మత, లింగ వర్ణ భేదాలు లేకుండా అందరినీ గౌరవించాలని, దేశంలోని మిశ్రమ సంస్కృతిని, వారసత్వాన్ని కాపాడుకోవాలని, శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవాలన్న పలు అంశాలను ప్రజల విధులుగా పేర్కొంది. ఇవి స్వచ్ఛంద విధులు. వీటిని పాటించాలనే చైతన్యాన్ని ప్రజలకు కల్పించాలి.

అలాగే ప్రభుత్వాలు అనుసరించాల్సిన కర్తవ్యాలను రాజ్యాంగం ఆదేశిక సూత్రాలుగా ప్రకటించింది. ప్రభుత్వం ప్రజలందరికీ ఆర్థిక, రాజకీయ, సామాజిక న్యాయం కల్పించాలని, దేశ సంపద, సహజ వనరులు ఏ ఒకరిద్దరి వద్ద కేంద్రీకృతం కాకూడదని, వాటిని వికేంద్రీకరించాలని, కార్మికులకు యాజమాన్యంలో భాగం కల్పించాలని, మద్యనిషేధాని కి అడుగులు వెయ్యాలని, పిల్లలకు నిర్బంధ ప్రాథమిక విద్య అందించాలని మార్గదర్శనం చేసింది. ఇవి ప్రభుత్వాలు చేపట్టాల్సిన విధులు.

వీటిని ప్రభుత్వాలు పాటించకపోగా ఆదేశిక సూత్రాలకు విరుద్ధంగా ప్రజలందరికీ చెందాల్సిన సహజ సంపదలు ప్రకృతి వనరులు ప్రైవేటు వ్యక్తుల పరం చేస్తున్నారు. పోగుపడ్డ సంపదను వికేంద్రీకరించాలన్న ఆదేశిక సూత్రాల ప్రకటనకు విరుద్ధంగా దేశంలో ఇప్పుడు ఒక శాతం మంది దగ్గర 46 శాతం దేశ సంపద పోగుపడింది. దానిని ప్రజలకు చెందేలా వికేంద్రీకరించాలి. అప్పుడే దేశ ప్రజలకు ఆర్థిక న్యాయం అందుతుంది.

మద్య నిషేధంవైపు అడుగులు వేయాలని సూచిస్తే దేశంలో మద్యం పెద్ద వ్యాపారం గా మారింది. ప్రభుత్వాలు ఈ మద్యాన్ని ప్రధాన ఆదాయ వనరుగా చేసుకున్నాయి.




రాజ్యాంగమే దేశ పౌరులకు ఓటు హక్కునిచ్చింది. ప్రతి ఐదేళ్లకు పాలకుల్ని ఎన్నుకునే ప్రజాస్వామ్యాన్ని ఇచ్చింది. ప్రజాస్వామ్యంలో ప్రజలే యజమానులయ్యారు. వారి ఓటు తోనే ప్రభుత్వాలు ఏర్పడతాయి. ప్రజల పన్నులతోనే ప్రభుత్వాలు, పాలనా యంత్రాంగం నడుస్తుంది. ఆ సొమ్ముతోనే సంక్షేమం, అభివృద్ధి కార్యకలాపాలు సాగుతాయి. సంక్షేమం, అభివృద్ధి ప్రజల హక్కు. పాలకుల దయాదాక్షిణ్యాల మీద సంక్రమించేవి కావు.

రాజ్యాంగం ప్రజలందరికీ అత్యంత కీలకమైన ప్రాథమిక హక్కులను కల్పించింది. ప్రజలందరికీ భావ ప్రకటనా స్వేచ్ఛనీ, ఆరాధనా స్వేచ్ఛనీ, సమానత్వం, సమాన అవకాశాలు పొందే హక్కుని ప్రసాదించింది.. భావ ప్రకటనా స్వేచ్ఛలో పత్రికా స్వేచ్ఛ అంతర్భాగంగా వుంది. అలాగే జీవించే హక్కు కేవలం ప్రాణ రక్షణ హక్కు మాత్రమే కాదు అందులో గౌరవ ప్రదమైన స్వతంత్ర జీవనం గడిపే హక్కు ఇమిడి వుంది. గౌరవ ప్రదంగా జీవించడం అంటే నివాస వసతి, కనీస ఆదాయం, విద్య వైద్య సేవలను పొందడం వంటివి అని సుప్రీంకోర్టు తీర్పులు స్పష్టం చేస్తున్నాయి. ఇవి ప్రజలు హక్కుగా పొందాల్సిన అంశాలు.

మొత్తం మీద మన రాజ్యాంగంలో ప్రజలే హక్కుదారులు, పాలకులు కాదు. దేశ సహజ వనరుల మీద, పోగుపడ్డ సంపద మీద ప్రజలు హక్కుదారులు, గౌరవ ప్రదమైన స్వతంత్ర జీవనాన్ని పొందే హక్కుదారులు. అందువల్ల ఈ రాజ్యాంగ దినోత్సవాన్ని హక్కుదారుల ఉత్సవంగా నిర్వహించుకోవాలి. మనరాజకీయం రాజ్యాంగ ఆదేశాలకు విరుద్ధంగా నడుస్తున్నది. వక్ర మార్గాలను అనుసరిస్తున్నది. ప్రజలు యజమానులన్న భావన దానికి లేదు. ప్రజా ప్రతినిధులు ప్రజా సేవలకులు అన్న ధ్యాస కనపడదు. పాలకులదే అధికారం అన్నట్లు పెత్తనం చేస్తున్నారు. ప్రజల సొమ్ము తో ప్రజలు ఇచ్చిన అధికారాన్ని తిరిగి ప్రజలకు స్వతంత్ర జీవనానికి, సంక్షేమానికి, అభివృద్ధికి వినియోగించే పవిత్ర కర్తవ్యంగా రాజకీయం లేదు.

ప్రస్తుత రాజకీయానికి అధికార మే ఏకైక లక్ష్యం. దానికి ప్రజల ఓట్లు అవసరం. ప్రజలను ప్రలోభపెట్టి ఓట్లు దండుకునే పద్ధతిని పాటిస్తున్నారు. ప్రజలను లోబర్చుకోవడానికి డబ్బు సంచులను వినియోగిస్తున్నారు. ప్రజల సొమ్ముతో వివిధ పథకాలను ప్రకటిస్తూ ఓటర్లను ఆకర్షించడానికి ప్రయత్నిస్తున్నారు. ఓట్లు కోసం కుల, మత, ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొట్టడానికి వారు వెనకాడడం లేదు. పాలక పక్ష నేతలకు రాజకీయం ఒక వ్యాపారం. గెలుపు కోసం కోట్లు గుమ్మరిస్తున్నారు. అధికారం చేపట్టాక అంతకు పది రెట్లు కూడబెట్టుకుంటున్నారు. ఈ రాజకీయ వ్యాపారంలో ప్రజలు కేవలం ఓటర్లు మాత్రమే. వారికి సంక్షేమం పేరుతో తమ స్వంత డబ్బు ఖర్చు పెడుతున్నట్లు రకరకాల పథకాలను ఉచితాలను ప్రకటిస్తూ హక్కుదారులైన ఓటర్లను లబ్ధిదారులుగా ఈ రాజకీయం దిగజార్చింది. అర చేతిలో స్వర్గా న్ని చూపించే ఈ పథకాలు ప్రజల్ని ఎదుగుబొదుగు లేని త్రిశంకు స్వర్గంలో వుంచుతున్నాయి. రైతులు అప్పుల భారం తరగడం లేదు. యువతకు ఉద్యోగాల ప్రాప్తి కలగడం లేదు. ప్రజలు కేవలం ఓటర్లుగా, లబ్ధిదారులుగా మిగిలిపోతున్నారు. ఇల్లు, ఉపాధి, విద్య, వైద్య సౌకర్యాలు కనీస ఆదాయం, రైతులకు లాభసాటి ధరలు ప్రజలకు హక్కుగా దక్కాలి. సంక్షేమం, ప్రజలకు స్వతంత్ర జీవనం ఇచ్చేదిగా విస్తరించాలి.

అందుకు ప్రభుత్వాలు ఆదేశిక సూత్రాలను అనుసరించి పాలన సాగించాలి. ప్రకృతి వనరులు, సహజ సంపదలను ప్రజల పరం చేయాలి. పోగుపడ్డ సంపదను వివిధ పన్నుల ద్వారా ప్రజలకు పున:పంపిణీ చేయాలి. ఇది జరగాలంటే ప్రస్తుత రాజకీయం మారాలి. హక్కుదారులం అన్న చైతన్యం ప్రజలకు కలిగితే రాజకీయం మారుతుంది. లబ్ధిదారులుగా మార్చబడ్డవారంతా తిరిగి హక్కుదారులవుతారు. ప్రజలు హక్కుదారులు అన్న చైతన్యాన్ని నింపే కార్యకలాపాలతో రాజ్యాంగ దినోత్సవాన్ని పౌరసంస్థలు అర్థవంతంగా నిర్వహించాలి.

# భద్రాద్రిని అన్ని రంగాల్లో తీర్చిదిద్దడమే ఏకైక లక్ష్యం

జిల్లా ప్రత్యేకాభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా ముందడుగు

గ్రంథాలయాలు ప్రత్యక్ష దేవాలయాలు

మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట

కొత్తగూడెంలో తుమ్మల విస్తృత పర్యటన



**ప్రజాపక్షం/భద్రాచలం :** తెలంగాణ రాష్ట్రంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి పరంగా నిలపడమే కాకుండా ధనిక జిల్లాగా తీర్చిదిద్దడమే తన ఏకైక లక్ష్యమని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. సోమవారం కొత్తగూడెం పర్యటనలో భాగంగా కొత్తగూడెం నందా తండా నుండి విశాలాగురు కాలనీ వరకు నిర్మాణం చేపట్టనున్న బిటి రోడ్డు పనులకు కొత్తగూడెం ఎంఎల్ఎ కూనంనేని సాంబశివరావు, భద్రాచలం ఎంఎల్ఎ డా.తెల్లం వెంకట్రావులతో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం రూ.1.50కోట్లతో కొత్తగూడెంలో నిర్మించిన గ్రంథాలయ నూతన భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కొత్తగూడెం ఎంఎల్ఎ కూనంనేని సాంబశివరావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ గ్రంథాలయాలు ప్రత్యక్ష దేవాలయాలని, రాష్ట్రంలో గ్రంథాలయాల అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని తెలిపారు. గ్రంథాలయాల్లో ప్రధానంగా సమకాలిక అంశాలకు సంబంధించిన పుస్తకాలు ఉంచడం వల్ల విద్యార్థులు, అభ్యర్థులకు ప్రయోజనం చేసూరుతుందని, ఆ దిశగా అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా 600 గ్రంథాలయాలు ఉన్నాయని, వాటిని పునరుద్ధరించాలని, వాటిలో అవసరమైన పుస్తకాలతో పాటు ఫర్నీచర్, మౌలిక వసతులను సమకూర్చాల్సిన అవసరం ఉందన్నారు. అన్ని వసతులకు నిలయంగా ఉన్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో విద్యారంగానికి ప్రాధాన్యతనిస్తూనే వైద్యంతో పాటు రహదారుల ఏర్పాటుకు పెద్దపీట వేస్తున్నట్లు చెప్పారు. ఇది ఏజెన్సీ జిల్లా అయినందున ప్రత్యేక దృష్టితో గతంలో రెసిడెన్షియల్ పాఠశాలలు, గురుకుల పాఠశాలలు ఏర్పాటు కోసం తనవంతు కృషి చేసినట్లు చెప్పారు. గతంలో భద్రాద్రికి అమరావతి నుండి భద్రాచలం మీదుగా జగ్దల్పూర్ వరకు జాతీయ రహదారిని ఏర్పాటు చేశామని, మరో జాతీయ రహదారి కొత్తగూడెం నుండి ఇల్లెందు మీదుగా హైదరాబాద్‌కు త్వరలో అందుబాటులోనికి తీసుకొస్తామని చెప్పారు. పాండురంగాపురం నుండి సారపాక వరకు రైలుమార్గం ఏర్పాటు కోసం కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖ దృష్టికి తీసుకెళ్లి ఒత్తిడి తీసుకొస్తున్నామని, అదే కార్యరూపం దాల్చితే ఇక్కడ అయోధ్య భద్రాచలం నుండి ఉత్తర భారత దేశానికి అనుసంధానం ఏర్పడే అవకాశం ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మామునూరు, ఆదిలాబాద్, కొత్తగూడెంలలో ఎయిర్‌పోర్ట్‌ల ఆలోచన చేస్తోందని, దీనికి సంబంధించి కొత్తగూడెంలో ఎయిర్‌పోర్టు నిర్మాణం చేపడితే సింగరేణి, బిటిపిఎస్, నవభారత్, ఐటిసి, హెవీవాటర్ ప్లాంట్ వంటి పరిశ్రమలు ఉన్న ఈ ప్రాంతంలో అధిక ప్రయోజనాలు చేకూరుతాయని చెప్పారు. దీనిపై స్థల పరిశీలన చేసి ప్రతిపాదనలు కేంద్రానికి పంపినట్లు చెప్పారు. అదే విధంగా గోదావరి నదిపై కట్టే పోలవరం ప్రాజెక్టు పూర్తయితే జల రవాణాతోపాటు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని, గోదావరి నదిపై నౌకాయానం అందుబాటులోనికి వస్తే అతి తక్కువధరకే రవాణా సదుపాయం అందుబాటులోనికి వస్తుందన్నారు. కొత్తగూడెం బైపాస్ రోడ్డు విషయంలో కొంత గ్యాప్ ఏర్పడిందని, రోడ్లు, భవనాల శాఖామంత్రితో మాట్లాడుతానని చెప్పారు. కొత్తగూడెం రింగ్ రోడ్డు కోసం రూ.400 కోట్లు మంజూరు అయ్యాని, డిపిఆర్ పూర్తి చేసి టెండర్లు పిలువాలని ఆదేశించినట్లు మంత్రి చెప్పారు. రైతులు ఇతర పంటలు వేయడం ద్వారా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వ్యవసాయ లాభసాటిగా ఉండాలంటే ఆయిల్ ఫామ్ పంటను ఎంచుకోవాలని సూచించారు. ఈ జిల్లాలోనే అధికంగా ఆయిల్‌ఫామ్ పంట సాగు చేస్తూ రైతులు సుఖ సంతోషాలతో ఉన్నారన్నారు. సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఆయిల్ పామ్ ఇనిస్టిట్యూట్‌ను గరిమెళ్లపాడులో ఏర్పాటు చేయాలనే ఆలోచన చేస్తున్నట్లు చెప్పారు. పాల్వంచకు సైతం మరో బైపాస్ రోడ్డు మంజూరైందని, దానికి త్వరలో టెండర్లు పిలిచి పనులు చేపడతామని తెలిపారు. కొత్తగూడెంను తప్పకుండా కార్పోరేషన్ చేస్తామని, దీనిపై ముఖ్యమంత్రి కార్యాలయంలో దీనిపై మాట్లాడామని, ముఖ్యమంత్రి సుముఖత వ్యక్తం చేసినట్లు చెప్పారు. జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారుల సహాయ సహకారాలతో జిల్లాను అభివృద్ధి పథంలో అగ్రభాగాన నిలపాలన్నదే తన ధ్యేయమని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ రియాజ్, ఎస్‌పి రోహిత్ రాజ్, అదనపు కలెక్టర్ వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా, డిసిఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాస్, కొత్తగూడెం మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, గంధాలయ కార్యదర్శి శంకర్, గ్రంధపాలకురాలు జి మణిమృధుల, ఎం నవీన్, మధుబాబుతో పాటు వివిధ శాఖల అధికారులు, మున్సిపల్ కౌన్సిలర్లు,ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## 'వన్ నేషన్.. వన్ సబ్‌స్క్రిప్షన్'కు కేంద్రం ఆమోదం

**న్యూఢిల్లీ:** వివిధ రంగాల్లో ఎంతో కృషి చేసిన ప్రముఖులు, శాస్త్రవేత్తలు, నిపుణుల నివేదికలు, రచనలు, వ్యాసాలాను ఒకే చోట అందుబాటులో తెచ్చేందుకు ఉద్దేశించిన 'వన్ నేషన్.. వన్ సబ్‌స్క్రిప్షన్' ప్రాజెక్టుకు, ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన సమావేశమైన కేంద్ర కేబినెట్ ఆమోద ముద్ర వేసింది. 2025, 2026, 2027 సంవత్సరాలకుగాను ఈ పథకం కోసం రూ. 6,000 కోట్లను సోమవారం సమావేశమైన కేంద్ర కేబినెట్ కేటాయించింది. అధికారికంగా వెలుడిన ప్రకటనను అనుసరించి 'వన్ నేషన్.. వన్ సబ్‌స్క్రిప్షన్' ప్రాజెక్టు విద్యార్థులు, యువతకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ఇప్పటికే అమలవుతున్న ఎఎన్ఆర్ఎఫ్‌కు ఇది అనుబంధ ప్రాజెక్టుగా పని చేస్తుంది. దేశ వ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ యూనివర్శిటీలు, కాలేజీలు, పరిశోధనా సంస్థల నుంచి డాక్యుమెంట్లను పొందుపరుస్తారు. యూనివర్శిటీ గ్రాంట్స్ కమిషన్ (యుజిసి)కి చెందిన స్వతంత్ర సంస్థ ఇన్ఫర్మేషన్ అండ్ లైబ్రరీ నెట్‌వర్క్ (ఐఎన్ఎఫ్ఎల్ఐబిఎన్ఇటి) ఈ పథకాన్ని పర్యవేక్షిస్తుంది. దేశ వ్యాప్తంగా 6,300 సంస్థలు, సుమారు 1.8 కోట్ల మంది విద్యార్థులు ఈ పథకం ద్వారా లాభపడతారు.

**పాన్ 2.0 ప్రాజెక్టుకు రూ.1,433 కోట్లు**

పాన్ 2.0 ప్రాజెక్టుకు కేంద్ర కేబినెట్ 1,433 కోట్ల రూపాయలు కేటాయించింది. పన్ను చెల్లింపుదారులకు మరింత నాణ్యమైన, సత్వర సేవలు అందించడానికి కేంద్రం ఈ ప్రాజెక్టును ప్రారంభించింది. పాన్/టాన్ సేవలను విస్తృతపరచి, అందరికీ అందుబాటులో తెచ్చేందుకు ప్రయత్నం జరుగుతున్నదని ప్రభుత్వం ప్రకటించింది. ఇలావుంటే, అటల్ ఇన్నోవేషన్ మిషన్‌ను 2028 మార్చి 31వ తేదీ వరకూ పొడిగించాలని కూడా కేబినెట్ నిర్ణయించింది. సరికొత్త ఆవిష్కరణలకు, పారిశ్రామికీకరణకు ప్రోత్సాహకారిగా ఈ పథకాన్ని కేంద్రం అమలు చేస్తున్నది.

## నేటి నుండి భారత రాజ్యాంగ వజ్రోత్సవ వేడుకలు

పార్లమెంటు సంయుక్త సమావేశంలో రాష్ట్రపతి ప్రసంగం

**న్యూఢిల్లీ :** చరిత్రాత్మకమైన పార్లమెంటు సెంట్రల్ హాలు సంవిధాన్ సదన్‌లో ఏర్పాటు చేసిన రాజ్యసభ–లోక్‌సభ సభ్యుల సంయుక్త సమావేశంలో మంగళవారంనాడు రాష్ట్రపతి ద్రౌపదీముర్మ ప్రసంగిస్తారు. భారతరాజ్యాంగాన్ని ఆమోదించి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఏడాదికాలంపాటు సుదీర్ఘంగా జరిగే వేడుకలు మంగళవారం ప్రారంభం అవుతాయి. ఈ సందర్భంగా పౌరులు ఈ రాజ్యాంగ వారసత్వ కార్యకలాపాలలో ఇతోధికంగా పాలు పంచుకునేందుకు, అనుసంధాన కార్యకలాపాలు నిర్వహించేందుకు వీలుగా కేంద్ర ప్రభుత్వం సోమవారంనాడు ఒక కొత్త వెబ్‌సైట్ ––https://constitution75.com–ను సృష్టించింది. దేశ రాజ్యాంగ పీఠికను సామూహికంగా ప్రజలు అందరూ చదివి తెలుసుకోవడంకోసం దేశంలోని గ్రామాలు, పట్టణాలు, నగరాలలో స్కూళ్ళల్లో కార్యక్రమాలు ఏర్పాటు చేస్తారు. 1946 డిసెంబరు 9వ తేదీన మొట్టమొదటి దేశ రాజ్యాంగ అసెంబ్లీ సమావేశం న్యూఢిల్లీలోని పాత పార్లమెంటు భవనం సెంట్రల్ హాలులో జరిగింది. ఆనాడు ఈ హాలును ఎంతో సుందరంగా అలంకరించారు. ఇప్పుడు ఈ సందర్భంగా కూడా బ్రహ్మాండమైన అలంకరణలు చేశారు. ఆనాడు సమావేశంలో మొదటి వరుసలో నాటి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ, మౌలానా అబుల్ కలామ్ అజాద్, సర్దార్ వల్లభాయ్ పటేల్, ఆచార్య జె.బి.కృపలానీ తదితరులు కూర్చున్నారు. ఆనాటి ప్రముఖులు నడయాడిన పాత పార్లమెంటు భవనాన్ని ఎంతో సుందరంగా అలంకరించారు. నాటి పాత పార్లమెటు భవనాన్ని సర్ హెర్బర్ట్ బాకెర్ డిజైన్ చేశారు. సుమారు వంద సంత్సరాలపాటు ఈ పాత భవనం దేశానికి మార్గదర్శనం చేసింది. 1927 జనవరి 18న పాత పార్లమెంటు భవనానికి నాటి వైశ్రాయ్ లార్డ్ ఇర్విన్ ప్రారంభోత్సవం చేశారు. ఈనాడు దాని పక్కనే కొత్త పార్లమెంటు భవాన్ని నిర్మించుకున్నాం. ఈ కొత్త పార్లమెంటు భవనాన్ని ప్రధానమంత్రి నరేంద్రమోదీ 2023 జనవరి 18వ తేదీన ప్రారంభించారు. కేంద్ర సాంస్కృతికశాఖ కార్యదర్శి అరునిశ్ ఛావ్లా సోమవారం పాత్రికేయులతో మాట్లాడుతూ, దేశ రాజ్యాంగం, పీఠిక తదితర విషయాలపై భావితరాలకు ఒక అవగాహన తీసుకువచ్చేందుకు ఇదొక మంచి అవకాశమని అన్నారు. ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేసిన వెబ్‌సైటు –https://constitution75.com––ద్వారా ఈ చారిత్రక విషయాలను అధ్యయనం చేయవచ్చు.

## బిజెపి డిఎన్ఎలోనే బిసి,ఎస్‌సి,ఎస్‌టి వ్యతిరేక భావాలు : ఎంఎల్‌సి కవిత

**ప్రజాపక్షం/హైదరాబాద్:** బిజెపి డిఎన్ఎలోనే బిసి,ఎస్‌సి,ఎస్‌టి వ్యతిరేక భావాలు ఉన్నాయని జాగృతి అధ్యక్షురాలు, ఎంఎల్‌సి కల్వకుంట్ల కవిత ఆరోపించారు. అటువంటి పార్టీలను నిలదీసి, హక్కులను సాధించుకునేందుకు ప్రయత్నించాలన్నారు. సమగ్ర కుల గణనను శాస్త్రీయంగా నిర్వహించేలా ప్రభుత్వానికి సూచించాలని,జాతీయ స్థాయిలో జరిగే జనగణనలో బిసిల గణనను కూడా చేపట్టేలా డేడికేషన్ కమిషన్ తన నివేదికలో సిఫారసు చేయాలని కోరారు. తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో రూపొందించిన సమగ్ర నివేదికను హైదరాబాద్‌లో డెడికేటెడ్ కమిషన్ చైర్మన్ బి.వెంకటేశ్వరరావును సోమవారం కవిత నేతృత్వంలోని ప్రతినిధి బృందం కలిసి నివేదికను అందజేసింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్థానిక సంస్థల్లో బిసిలకు జనాభా దామాషా ప్రకారం రాజకీయంగా రిజర్వేషన్లు దక్కేలా రాష్ట్ర ప్రభుత్వానికి కమిషన్ నివేదికను సమర్పించాలన్నారు. విద్యా, ఉద్యోగావకాశాలలో ప్రస్తుతం ఉన్న బిసి రిజర్వేషన్లను బిసిల జానాభా దామాషా ప్రకారం పెంచాలని, అలాగే చట్ట సభల్లో బిసి రిజర్వేషన్లు అమలు చేయాలని, కేంద్రంలో బిసిలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని, మహిళా రిజర్వేషన్ బిల్లులో బిసి మహిళలకు సబ్ కోటా ఉండేలా కేంద్ర ప్రభుత్వానికి కమిషన్ సూచించాలని కవిత అన్నారు. కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి డిక్లరేషన్‌ను యధాతథంగా అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు వి ప్రకాష్ , రవీందర్ సింగ్ , జూలూరి గౌరీ శంకర్ , పల్లె రవి కుమార్‌గౌడ్ , సుమిత్ర ఆనంద్, రాజీవ్ సాగర్, మఠం భిక్షపతి , ఉపేంద్ర చారి , కిషోర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి లీ హెల్త్ 'వి-ఫెరిన్'

**ప్రజాపక్షం/హైదరాబాద్:** సహజ సిద్ధ వనమూలికలు, ఉత్పత్తులతో ఔషధాల తయారీలో హైదరాబాద్ కంపెనీ 'లీ హెల్త్ డొమెయిన్' స్త్రీల జననేంద్రియ ఇన్‌ఫెక్షన్ల చికిత్సకు 'విఫెరిన్' ప్రోబయోటిక్ సప్లిమెంట్‌ను మార్కెట్‌లోకి సోమవారం ప్రవేశపెట్టింది. లాక్టోఫెర్రిన్ పెప్టైడ్, క్రాన్‌బెర్రీ పండ్లతో ప్రీ ప్రోబయోటిక్స్ లాక్టోబాసిల్లస్ అసిడోఫిలస్ మిశ్రమాలతో ఈ మందులను రూపొందించినట్టు లీ హెల్త్ డొమెయిన్ డైరెక్టర్ ఆళ్ల లీలా రాణి తెలిపారు. ఈ మందులు సహజమైన, మాదకద్రవ్యాల రహిత పరిష్కారమని, జాగ్రత్తగా ఎంపిక చేసిన పదార్థాలతో స్త్రీల శరీరానికి స్వంత రక్షణ విధానాలకు అనుగుణంగా విఫెరిన్ పని చేస్తుందని వివరించారు. కృత్రిమ పదార్థాలు, ప్రిజర్వేటివ్స్, కఠిన రసాయనాల లేకుండా తయారు చేశామని, ఇది మహిళలందరికీ సురక్షిత, సున్నితమైన ఎంపిక అని తెలిపారు.

ఫోటో..విరన్ జైన్ నేమ్‌తో ఉంది.

## గొంతులో చపాతీ రోల్ ఇరుక్కొని విద్యార్థి మృతి

**ప్రజాపక్షం/హైదరాబాద్:**పాఠశాలకు వెళ్లిన విద్యార్థి లంచ్ సమయంలో చపాతీ రోల్ తినడంతో అది గొంతులో ఇరుక్కొని మృతి చెందిన విషాదకర సంఘటన సికింద్రాబాద్‌లో చోటుచేసుకుంది. ఈ ఘనటపై బేగంపేట పోలీసులు కేసు నమోదు చేశారు. విరన్ జైన్ అనే బాలుడు సికింద్రాబాద్‌లోని ప్రైవేట్ పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్నాడు. సోమవారం యదావిధిగా స్కూల్‌కు వెళ్లాడు. లంచ్ సమయంలో తల్లి పెట్టించిన లంచ్ బాక్స్‌లో ఉన్న చపాతి రోల్‌ను తిన్నాడు. ఆ వెంటనే కుప్పకూలి పోయాడు. ఇది గమనించిన స్కూల్ యాజమాన్యం హుటాహుటీనా ఆస్పత్రికి తరలిస్తుండా మార్గ మధ్యంలోనే విద్యార్థి ప్రాణాలు కోల్పోయాడు.

## సీతారామ ప్రాజెక్టు టెండర్ల ప్రక్రియను వేగవంతం చేయాలి

* ప్రాజెక్టులలో పూడికతీత పనులు సత్వరమే ప్రారంభించాలి

* యుద్ధ ప్రాతిపదికన భూసేకరణ చేపట్టాలి

* ప్రాధాన్యతా ప్రాజెక్టుల నిర్మాణాలపై దృష్టి సారించాలి

* వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



**ప్రజాపక్షం/ హైదరాబాద్ :** సీతారామ ప్రాజెక్ట్ టెండర్ల ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి నీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించారు. రాష్ట్రప్రభుత్వం ప్రాధాన్యత క్రమంలో ప్రాజెక్టుల నిర్మాణాలకు అంకురార్పణ చుట్టిందని ఇందులో ఎటువంటి జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. బంజారాహిల్స్ నుండి నీటిపారుదల శాఖ అధికారులతో ఆయన సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్ర నీటి పారుదల శాఖ సలహాదారుపు ఆదిత్యానాథ్ దాస్, ఇ. ఎన్.సి జనరల్ అనిల్ కుమార్, ఇ. ఎన్.సి ఓయం నాగేందర్ రావులతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న చీఫ్ ఇంజినీర్లు ఇతర ఉన్నతాధికారులు ఈ వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పెట్టుకున్న ప్రాధాన్యత క్రమంలో ఉన్న ప్రాజెక్టులకు పాలనా పరమైన అనుమతులు సత్వరమే తీసుకోవలన్నారు. మోదీకుంట వాగు ప్రాజెక్టుకు అయ్యే అంచనాలతో పాటు చిన్న కాళేశ్వరం ప్రాజెక్టుకు అవసరమైన భూసేకరణ పురోగతిపై ఆయన అడిగి తెలుసుకున్నారు. ప్రాజెక్టు లకు సంబంధించిన భూసేకరణ విషయమై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనుమతితో ప్రత్యేక ఐఏఎస్ అధికారిని నియమించామని ఎప్పటికప్పుడు ఆర్ఆర్ కమిషనర్ గా నియమితులైన ఐఏ ఎస్ అధికారి వినయ్ కృష్ణా రెడ్డి తో సంప్రదింపులు జరిపి భూసేకరణ నిర్వహించాలని ఆయన సూచించారు. అన్నింటికి మించి ఇసుక మేటలు ,మట్టి నిల్వలతో పుడుకుపోయిన ప్రాజెక్టు లలో పూడిక తీత పనులు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని, ఈ పనులను వేగవంతం చేసి ప్రాజెక్టు లలో నీటి సామర్థ్యం పెంపొందించేలా చర్యలు చేపట్టాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సింగూరు ప్రాజెక్టు పై నవం బర్ 27 న ప్రత్యేక సమీక్ష సమావేశం ఉంటుందని ఆ సమీక్ష లో రాష్ట్ర ఆరోగ్య వైద్య శాఖ మంత్రి దామోదర్ రాజ నరసింహ పాల్గొంటారని అందుకు సంబంధించిన సమగ్ర సమాచారంతో అధికారులు హాజరు కావాలని తెలిపారు. నల్లగొండ జిల్లా సాగునీటి ప్రాజెక్టు స్థితిగతులపై డిసెంబర్ మొదటి వారంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నల్లగొండ జిల్లాలో పర్యటించనున్నారని అందుకు సంబంధించిన పూర్తి స్థాయి నివేదికలు రూపొందించాలని ఆయన అధికారులను ఆదేశించారు.


## దొడ్ల డైరీ యాజమాన్యం రూ.4కోట్ల విరాళం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** పిపి నరసింహా రావు తెలంగాణా పశువైద్య విశ్వవిద్యాలయ పరిధిలోని కామారెడ్డి డెయిరీ టెక్నాలజీ కళాశాలకు దొడ్ల డెయిరీ భారీ విరాళం ప్రకటించింది. కళాశాల అభివృద్ధికి దొడ్ల డైరీ యాజమాన్యంరూ. 4 కోట్ల విరాళాన్ని అందించింది. ఇందుకు సంబంధించిన దొడ్ల డెయిరీ బోర్డు ఆమోద పత్రాన్ని సంస్థ సిఇఒ బివికె రెడ్డి విశ్వవిద్యాలయ ఉప కులపతి, రాష్ట్ర పశు సంవర్ధక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యాసాచి ఘోష్‌కు సోమవారం డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో అందించారు. ఈ విరాళం ద్వారా కామారెడ్డి డెయిరీ టెక్నాలజీ కళాశాల భవన మొదటి అంతస్తు నిర్మాణం, ఎన్ హెచ్ 44 నుండి కళాశాల వరకు సిమెంట్ రోడ్ నిర్మాణం, కళాశాల నుండి బాలుర , బాలికల వసతి గృహాల వరకు సిమెంట్ రోడ్ నిర్మాణం, కళాశాల భవనానికి మరమ్మత్తులు, రంగులు వెయ్యటం కళాశాల ప్రాంగణం లో సుందరీకరణ, మినీ డెయిరీ ప్లాంట్ ఏర్పాటు , ఇతర అవసరమైన పరికారాలను ఏర్పాటు చేస్తామని దొడ్ల డెయిరీ సిఇఓ బివికె రెడ్డి తెలిపారు. ఈ పనులకు సంబంధించిన అనుమతులను తక్షణమే ఆమోదంఇవ్వాల్సిందిగా ఉప కులపతి సబ్యాసాచి ఘోష్, విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డా. శరత్ చంద్రను ఆదేశించారు . ఈ సందర్భం గా విశ్వవిద్యాలయ ఉప కులపతి సబ్యాసాచి ఘోష్ మాట్లాడుతూ కళశాల అభివృద్ధికి ముందుకు వచ్చిన దొడ్ల డైరీ యాజమాన్యం ను, చైర్మన్ సునీల్ రెడ్డి , సంస్థ సిఇఒ బివికె రెడ్డి లను అభినందించారు.ఈ వసతుల కల్పనతో రాబోయే కాలంలో కళాశాలలో ఎంటెక్ కోర్సును ప్రారంభించే అవకాశం ఉంటుందని విద్యా ప్రమాణాలు మెరుగుపడి విద్యార్థుల నైపుణ్యము కూడా పెరుగుతుందని విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డా. శరత్ చంద్ర తెలిపారు.



## 60ఏళ్ల రావి చెట్టును వేరే చోటికి తరలించిన ద.మ రైల్వే

**ప్రజాపక్షం / హైదరాబాద్ :** దక్షిణ మధ్య రైల్వే పర్యావరణ అనుకూల కార్యక్రమాలను చేపట్టడంలో పచ్చని పరిశుభ్రమైన వాతావరణాన్ని ప్రోత్సహించడంలో ఎల్లప్పుడూ ముందంజలో నిలుస్తుంది. ఈ దిశలో భాగంగా దక్షిణ మధ్య రైల్వే ఇటీవల సికింద్రాబాద్‌లోని దక్షిణ మధ్య రైల్వేప్రధాన కార్యాలయమైన రైలు నిలయం ప్రాంగణంలో సుమారు 40 అడుగుల ఎత్తు ,3 మీటర్ల చుట్టుకొలత విస్తీరణం గల 60 సంవత్సరాల పురాతన రావి చెట్టును వేరేచోటికి విజయవంతంగా తరలించింది. కొత్త కాన్ఫరెన్స్ హాల్ నిర్మాణ పనుల దృష్ట్యా, ఈ రావి చెట్టు వేరులకు ఎటువంటి నష్టం వాటిల్లకుండా ఖచ్చితమైన ప్రణాళికతో వేరొక చోటికి తరలించింది. కర్నూలుకు చెందిన ప్రకృతి ఆరాధకులు, ఈ రంగంలో నిపుణులైన ఎ.చంద్రమౌళి ని ఈ పనులు జాగ్రత్తగా ఖచ్చితంగా అమలు చేయడానికి పిలిచారు. వారి మార్గదర్శకత్వంలో నూతన వాతావరణంలో ఈ చెట్టు పెరుగుదల కోసం ప్రత్యేక పరికరాలు, సాంకేతికతలు ఉపయోగించారు. రైలు నిలయం వద్ద చెట్టు స్థలమార్పిడి ప్రక్రియలో భాగంగా చెట్టు కొమ్మల శాఖలను నరికి వేసే ముందు, తరువాత నూనెతో కూడిన 50 కిలోల వేప పిండి కేక్‌ను ఉపయోగించారు. నిపుణుల అభిప్రాయం ప్రకారం కొత్త చెట్టు రెమ్మలు 3 నుండి 6 నెలల కాలంలో పెరగడం ప్రారంభిస్తాయని చెబుతున్నారు. గతంలో కూడా చంద్రమౌళి తన పునరుజ్జీవన ప్రణాళికల్లో భాగంగా మహబూబ్‌నగర్ జిల్లాలోని ప్రసిద్ధ పిల్లలమర్రి చారిత్రాత్మక మర్రిచెట్టుకు విజయవంతంగా చికిత్స చేశారు. నిపుణుల సలహాతో దక్షిణ మధ్య రైల్వే 2021 సంవత్సరంలో ఇదే విధమైన చొరవతో కాచిగూడలోని రైల్వే కోచింగ్ డిపోలో నున్న మూడు చెట్లను విజయవంతంగా వేరే చోటికి తరలించారు. పర్యావరణ పరిరక్షణ కోసం ఈ మంచి కార్యాన్ని చేపట్టినందుకుగాను దక్షిణ మధ్య రైల్వే ఇంజినీరింగ్ బృందాన్ని జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ అభినందించారు. పర్యావరణ పరిరక్షణతో మౌళిక సదుపాయాల అభివృద్ధిని సమతుల్యం చేస్తూ దక్షిణ మధ్య రైల్వే కార్యకలాపాలలో స్థిరమైన పద్ధతులను ఏకీకృతం చేయడానికి చేస్తున్న విస్తృత ప్రయత్నాలలో ఈ చొరవ ఒక మైలు రాయిగా నిలుస్తుందని పేర్కొన్నారు.



## కోటి 8 లక్షల 89 వేల 758 నివాసాలలో సర్వే పూర్తి

రాష్ట్రంలో 92 శాతం సర్వే పూర్తి

**ప్రజాపక్షం / హైదరాబాద్ :** సామాజిక, ఆర్థిక, విద్యా,ఉద్యోగ, రాజకీయ, కుల గణన రాష్ట్రంలో ముమ్మరంగా కొనసాగుతోంది. ఈ సమగ్ర ఇంటింటి సర్వేలో మొత్తం కోటి 17 లక్షల 58 వేల 491 నివాసాలు గుర్తించగా, నేటి వరకు 1 కోటి 8 లక్షల 89 వేల 758 నివాసాలలో సర్వే పూర్తి చేసి 92.6 శాతానికి చేరుకుంది. రాష్ట్రంలో 13 జిల్లాలలో వంద శాతం సర్వే పూర్తయింది. సంగారెడ్డి జిల్లాలో 88.1 శాతం , మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో 82.3 శాతం సర్వే పూర్తయింది. మిగత 17 జిల్లాలలో 90 శాతానికి పైగ సర్వే పూర్తయింది . జి.హెచ్.ఎంసి పరిధిలో కూడా సర్వే ముమ్మరంగా కొనసాగుతోంది. జిహెచ్ ఎంసి పరిధిలో 25 లక్షల 5 వేల 517 నివాసాలకు సర్వే చేయాల్సి ఉండగా నేటి వరకు 19 లక్షల 4 వేల 977 సర్వే పూర్తిచేసి 76 శాతానికి చేరుకుంది . సర్వే పూర్తి అయిన జిల్లాలో డాటా నమోదు ప్రక్రియ కూడ ముమ్మరంగా కొనసాగుతోంది. ఇప్పటి వరకు 12 లక్షల 85 వేల 871 నివాసాలకు సంబంధించి కంప్యూటరీకరణ పూర్తి అయింది. డేటా ఎంట్రీ ఆపరేటర్, ఎన్యుమరేటర్ కలిసి సర్వే వివరాలను ఎలాంటి పొరపాట్లు లేకుండా జాగ్రత్తగా నమోదు చేయాలన్ని జిల్లా ఇన్ చార్జ్ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. సర్వే పత్రాలను భద్రంగా ఉంచాలని అధికారులు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

## ఎస్‌టిపిలను సందర్శించిన ఫ్రెంచ్ బృందం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఫ్రాన్స్ దేశానికి చెందిన బృందం అత్తాపూర్‌లోని జలమండలి నిర్మించిన ఎస్‌టిపిలను సందర్శించింది. మూసీ రివర్ డెవలప్‌మెంట్‌పై చేస్తున్న వర్క్‌షాప్‌లో భాగంగా వారు అక్కడి ఎస్‌టిపిలను సందర్శించారు. ఎస్‌టిపిల పనితీరు, మురుగు నీటి శుద్ధి ప్రక్రియలో దశలు, అవలంభించే పద్ధతులు, ఉపయోగించే సీక్వెన్సియల్ బ్యాచ్ రియాక్టర్ సాంకేతికత తదితర వివరాల గురించి జలమండలి జనరల్ మేనేజర్ వాస సత్యనారాయణ వారికి తెలిపారు. బృందం వెలిబుచ్చిన సందేహాలను నివృతి చేశారు. అత్తాపూర్‌లో ఇప్పటికే రెండు ఎస్‌టిపిలు (51 ఎంఎల్‌డి, 23 ఎంఎల్‌డి) వినియోగంలో ఉండగా, మరో రెండు ఎస్‌టిపిల (64 ఎంఎల్‌డి, 40 ఎంఎల్‌డి) నిర్మాణం జరుగుతోంది. లెస్ అటెలియర్స్ డి సెర్జీ అనే ఇంటర్నేషన్ అర్బన్ ప్లానింగ్ అసోసియేషన్ వాటర్ అండ్ మెట్రోపాలిటైజేషన్ ఏ బయో క్లైమాటిక్ సిటీ ఆఫ్ లేక్స్ అనే అంశం మీద అంతర్జాతీయ వర్క్ షాప్ నిర్వహిస్తోంది. ఇది నేటి నుంచి వచ్చే నెల 6 వరకు జరగనుంది. దీనికి మూసీ రివర్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ ఆతిథ్యమిస్తోంది. వేగంగా జరుగుతున్న పట్టణికరణ, హైదరాబాద్ నగరంలో నీటి నిర్వహణ, అందులోని సవాళ్లు అనే అంశాలపై దృష్టి సారించనుంది. ఎస్‌టిపిల పరిశీలనకు వచ్చే బృందం కోసం జలమండలి పలువురు నోడల్ అధికారులను నియమించింది. ఈ నెల 28న జలమండలిని విదేశీ బృందం సందర్శించనుంది. ఈ పర్యటనలో రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్, జిహెచ్ఎంసి అదనపు కమిషనర్, మూసీ రివర్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ ఎస్.ఈ, నీటిపారుదల శాఖ ఈ.ఈ, జలమండలి, ఎన్ఐయూఎం అధికారులు పాల్గొన్నారు.

## నిబంధనలకు విరుద్ధంగా ఉన్న షాపుల కేటాయింపు రద్దు చేయాలి

అక్రమాలపై జిహెచ్ఎంసి ఉన్నతాధికారులు విచారణ జరపాలి

బిఆర్ఎస్ గోషామహల్ సీనియర్ నేత ఆనంద్ కుమార్ గౌడ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్ నగరంలోనే ప్రముఖ వాణిజ్య కేంద్రంగా పేరుపొందిన కోఠిలో అతి తక్కువ మొత్తం అద్దెకు నిబంధనలకు విరుద్ధంగా జరిపిన షాపుల కేటాయింపును రద్దు చేయాలని జిహెచ్ఎంసిని బిఆర్ఎస్ గోషామహల్ సీనియర్ నాయకుడు ఎం.ఆనంద్ కుమార్ గౌడ్ డిమాండ్ చేశారు. నగరంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కోఠి కమత్ హోటల్ సమీపంలోని జిహెచ్ఎంసికి చెందిన 14 షాపులు ఉన్నాయని, వాటిని నిబంధనలకు విరుద్ధంగా టెండర్లలో గోల్‌మాల్ చేసి, పాతవారికే కేటాయించారని తెలిపారు. 14 షాపులలో ఇద్దరు మాత్రనే ప్రస్తుతం దుకాణాలు నడిస్తున్నారని తెలిపారు. మిగిలిన వాళ్ళు నెలకు రూ. 80 వేల చొప్పున సబ్ లీజుకు షాపులను ఇచ్చారని తెలిపారు. జిహెచ్ఎంసికి కేవలం రూ. 18 వేలు మాత్రమే చెల్లిస్తున్నారన్నారు. దీంతో జిహెచ్ఎంసి ఖజానాకు చేరాల్సిన అద్దె డబ్బులు ప్రైవేట్ వ్యక్తుల జెబులలోకి పోతున్నాయని చెప్పారు. గతంలో రెండుసార్లు టెండర్‌లు పిలిచినప్పుడు నగర వ్యాప్తంగా చాలామంది టెండర్ ప్రక్రియలో పాల్గొనేందుకు వచ్చారని, షాపులు నడుపుతున్న వారు గొడవ చేయడంతో నిలిపేశారన్నారు. తరువాత కొంతమంది అధికారులకు లంచాలు ముట్టచెప్పి, వారి వారి కుటుంబ సభ్యుల పేర్లతో నామమాత్రపు అద్దెను పెంచి షాపులను దక్కించుకున్నారని వివరించారు. షాపుల కేటాయింపులో నిర్వహించిన టెండర్ ప్రక్రియలో అనేక అక్రమాలు చోటు చేసుకున్నాయన్నారు. నిబంధనలకు విరుద్ధంగా షాపుల కేటాయింపు జరిపారన్నారు. ఈ విషయంపై ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన అధికారులు నిమ్మకునీరేత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆనంద్ కుమార్ గౌడ్ విమర్శించారు. షాపుల కేటాయింపులో చోటు చేసుకున్న అక్రమాలపై నగర మేయర్ విజయలక్ష్మి స్పందించి విచారణ జరిపించాలని కోరారు. ఇప్పటికైన జిహెచ్ఎంసి ఉన్నతాధికారులు స్పందించి, షాపుల కేటాయింపు టెండర్‌లను రద్దు చేసి, నిబంధనల ప్రకారం మరోసారి టెండర్లను ఆహ్వానించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో బిఆర్ఎస్ పక్షాన కార్యాచరణ ప్రకటిస్తామని ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు విజయ్ ముదిరాజ్, మహేశ్ గౌడ్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.




## బైక్ నడిపితే హెల్మెట్ తప్పనిసరి

* ఘనంగా స్మార్ట్ లివింగ్ కార్యక్రమం

* నిర్వహించిన శ్రీ చైతన్య పాఠశాల ఈస్ట్ మారేడ్ పల్లి బ్రాంచ్

**ప్రజాపక్షం / హైదరాబాద్ :** శ్రీ చైతన్య పాఠశాల ఈస్ట్ మారేడ్‌పల్లి బ్రాంచ్‌లో స్మార్ట్ లివింగ్ కార్యక్రమంలో భాగంగా సోమవారం రోజున ' హెల్మెట్ నిబంధన, ప్రజల్లో అవగాహన' అనే కార్యక్రమాన్ని పాఠశాల ప్రిన్సిపాల్ రమ్య విద్యార్థిని విద్యార్థుల చేత ఘనంగా నిర్వహింపజేశారు. దీనిలో భాగంగా వెస్ట్ మారెడ్‌పల్లి పోలిస్ స్టేషన్ ట్రాఫిక్ కానిస్టేబుల్ దేవిని లోకేష్‌ను ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ విద్యార్థులను రోడ్డు ప్రమాదాల్లో వాహనదారులు మృత్యువాతపడకుండా పోలిస్ శాఖ ప్రత్యేక చర్యలు చేపడుతున్నారని తెలిపారు. ప్రమాదాల నివారణకు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని అన్నారు. 18 సంవత్సరాల లోపు పిల్లలు వాహనాలు నడపకూడదని సూచించారు. అనంతరం ప్రిన్సిపాల్ రమ్య మాట్లాడుతూ రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. వాహనదారులు హెల్మెట్ తప్పని సరిగా ధరించి వారి కుటుంబాలను సంతోషంగా ఉంచాలని ట్రాఫిక్ నిబంధలను పాటించాలని తెలియజేశారు. కాగా హెల్మెట్ ధరించిన వాహనదారులకు ఈ సందర్భంగా విద్యార్థులు పుష్పాలు ఇచ్చి అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రమ్యతో పాటు డీన్ భిక్షపతి , మిగిలిన అధ్యాపక బృందం పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



## సర్వే డేటా ఎంట్రీ పరిశీలన

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి :** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే సందర్భంగా సేకరించిన వివరాలను ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేసే విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. సోమవారం జడ్చర్లలో డా.బి.ఆర్.ఆర్.డిగ్రీ కళాశాల, శ్లోక పాఠశాలలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో సేకరించిన వివరాలు డేటా ఎంట్రీ కలెక్టర్ పరిశీలించారు. సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ద్వారా సేకరించిన వివరాలను ఆపరేటర్లు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్న తీరును పరిశీలించారు. నిబంధనలను పక్కాగా పాటిస్తూ, అన్ని వివరాలను ఆన్‌లైన్‌లో జాగ్రత్తగా నమోదు చేయాలని కలెక్టర్ సూచించారు. త్వరితగతిన ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ పూర్తయ్యేలా చూడాలని, ఎలాంటి పొరపాట్లు, తప్పిదాలకు ఆస్కారం లేకుండా చిత్తశుద్ధితో విధులు నిర్వర్తించాలని సూచించారు. ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు సందర్భంగా క్షేత్రస్థాయిలో ఇబ్బందులు ఎదురైనా, సాంకేతికపరమైన సమస్యలు ఏవైనా ఉత్పన్నం అయితే, వెంటనే అధికారులు దృష్టికి తేవాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, శ్లోక పాఠశాల సిబ్బంది విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఆన్‌లైన్ విషయంలో జాగ్రత్త

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి :** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే సందర్భంగా సేకరించిన వివరాలను ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేసే విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. సోమవారం జడ్చర్లలో డా.బి.ఆర్.ఆర్ డిగ్రీ కళాశాల, శ్లోక పాఠశాలలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో సేకరించిన వివరాలు డేటా ఎంట్రీ కలెక్టర్ పరిశీలించారు. సమగ్ర ఇంటింటి కుటంబ సర్వే ద్వారా సేకరించిన వివరాలను ఆపరేటర్లు ఆన్‌లైన్లో నమోదు చేస్తున్న తీరును పరిశీలించారు. నిబంధనలను పక్కాగా పాటిస్తూ, అన్ని వివరాలను ఆన్‌లైన్‌లో జాగ్రత్తగా నమోదు చేయాలని కలెక్టర్ సూచించారు. త్వరితగతిన ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ పూర్తయ్యేలా చూడాలని, ఎలాంటి పొరపాట్లు, తప్పిదాలకు ఆస్కారం లేకుండా చిత్తశుద్ధితో విధులు నిర్వర్తించాలని సూచించారు. ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు సందర్భంగా క్షేత్రస్థాయిలో ఇబ్బందులు ఎదురైనా, సాంకేతికపరమైన సమస్యలు ఏవైనా ఉత్పన్నం అయితే, వెంటనే అధికారులు దృష్టికి తేవాలన్నారు.



## గురుకులాలను సందర్శించిన కాంగ్రెస్ మైనారిటీ నాయకులు

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి :** జిల్లా కేంద్రంలోని మైనార్టీ బాలికల గురుకుల పాఠశాలలు, కళాశాలలను కాంగ్రెస్ పార్టీ మైనార్టీ విభాగం నాయకులు సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా వంటగదులను, తరగతి గదులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీల విద్యాభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఇటీవలే పలు పాఠశాలలో అన్నంలో పురుగులు వచ్చిన సంఘటనలు జరిగాయని అన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని కోరారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో విద్య అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ఇటీవలే ఇంటిగ్రేటెడ్ పాఠశాలలకు రాష్ట్ర వ్యాప్తంగా శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. ఇంటిగ్రేటెడ్ పాఠశాలల్లో అన్ని వర్గాల విద్యార్థులకు విద్యతో పాటు అధునాతమైన వసతులు లభ్యమవుతాయని అన్నారు. హాస్టల్ విద్యార్థులు మెస్ చార్జీలను కూడా పెంచడం జరిగింది అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న విద్య వసతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. గురుకులాలను సందర్శించిన వారిలో కాంగ్రెస్ మైనార్టీ విభాగం అసెంబ్లీ కోఆర్డినేటర్ షా ఫైసల్, చైర్మన్ ఫకృద్దీన్ ఖురేషి, పట్టణ అధ్యక్షులు గులాం అహ్మద్ జహీర్, నాయకులు షేక్ ఫక్రు, మహ్మద్ అక్బర్, మహ్మద్ బాసిత్, మొయిజ్, మహ్మద్ ఫహీం ఖుర్షిద్ అలీ, అబ్రార్ హుస్సేన్ ఉన్నారు.

## ప్రజావాణిలో 80 అర్జీలు

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి :** ప్రజల సమస్యలపై ప్రజావాణిలో వచ్చిన అర్జీలను పరిశీలించి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల సమస్యలపై అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారులు పరిశీలించి చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రజావాణిలో 80 అర్జీలు రావడం జరిగాయని తెలిపారు. ఆయా దరఖాస్తులపై ఆయా శాఖాధికారులు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ ప్రజావాణిలో అదనపు కలెక్టర్లు శివేంద్ర ప్రతాప్, మోహన్‌రావు, జడ్పీసీఈఓ వెంకటరెడ్డి, డిఆర్‌డిఓ నర్సింహులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మద్దిగట్ల మోజెర్లకు వైజ్ఞానిక ప్రదర్శనలో అవార్డు

**ప్రజాపక్షం / పెద్దమందడి :** వనపర్తి పట్టణంలో ఈ నెల 21,22,23 తేదీల్లో 3 రోజుల పాటు జరిగిన బాలల వైజ్ఞానిక ప్రదర్శన ఎంతో పగడ్బందీగా వైభవంగా కన్నుల పండుగగా నిర్వహించి విజయవంతం చేశారు. వైజ్ఞానిక ప్రదర్శ తో పాటుగా అదే వేదికగా సాంస్కృతిక పాటుగా ఇదే వేదికగా సాంస్కృతిక కార్యక్రమాలను కూడా నిర్వహించడం జరిగింది. ఈ వైజ్ఞానిక ప్రదర్శనలో వనపర్తి జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు పాల్గొన్నారు. అలాగే పెద్దమందడి మండలంలోని జడ్పిహెచ్ఎస్ మద్దిగట్ల, మోజెర్ల పాఠశాల విద్యార్థులు కరెంటు ఆదా అనే అంశం గల వై జ్ఞానిక నమూనాను ప్రదర్శించడంతో పాటు సాంస్కృతిక జానపద నృత్య ప్రదర్శనలో పాల్గొన్నారు. ఆకట్టుకునే వస్త్రాలంకరణతో విద్యార్థినులు ఎంతో చక్కని జానపద నృత్యం ప్రదర్శించి చూపరుల అంతా ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాదాయులు డి. రణధీరు, పి. వెంకటస్వామి, గద్వాల కృష్ణ, వెంకటస్వామి, మధుసూదన్ , వెంకటస్వామి, చిన్నారెడ్డి పాల్గొన్నారు.



## వృద్ధులకు దుప్పట్లు పంపిణీ

**ప్రజాపక్షం / వీపనగండ్ల :** సత్యసాయి పుట్టిన రోజు సందర్భంగా మండల పరిధిలోని వల్లభాపూర్‌లో వృద్ధులకు దుప్పట్లను పంపిణీ చేశారు. రోజురోజుకు చలి తీవ్రత ఎక్కువ కావడంతో బాబా పుట్టిన రోజును పురస్కరించుకొని గ్రామంలోని నిరుపేద వృద్ధులకు దుప్పట్లను ఉచితంగా అందించారు. ఈ కార్యక్రమంలోరైతు బంధు సమతి ఇఇ మండల మాజీ అధ్యక్షులు రావుల నారాయణరెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

# బిజెపి ప్రజావ్యతిరేక విధానాలపై నేడు నిరసన




**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** కేంద్ర బిజెపి ప్రభుత్వ రైతు, ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల26న జిల్లాకేంద్రాలలో నిర్వహించే నిరసనలను విజయవంతంచేయాలని ఎఐకెఎస్, బికెఎంయు, ఎఐటియూసి సంఘాలు పిలుపునిచ్చాయి. సోమవారం జిల్లా కేంద్రంలోని కామ్రేడ్ లక్ష్మణాచారిభవనంలో సిపిఐ అనుబంధ ప్రజాసంఘాల రైతు, వ్యవసాయ, వ్యవసాయ రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా తెలంగాణరాష్ట్ర రైతు ఎఐకెఎస్ రాష్ట్ర సహాయకార్యదర్శి వార్లవెంకటయ్య , తెలంగాణరాష్ట్ర వ్యవసాయకార్మిక సంఘం బికెఎంయు రాష్ట్ర సహాయ కార్యదర్శి కోళ్ల ఏసయ్య , ఎఐటియుసి జిల్లాప్రధాన కార్యదర్శి శివశంకర్ సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ ప్రజావ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న మతోన్మాదశక్తులను అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. 2024–2025 బడ్జెట్‌లో ప్రకటించిన కార్పొరేట్లు పంటలు కోతకురాకముందే ముందస్తు వ్యాపార లావాదేవిలతో పంటలను తమస్వాధీనంలో ఉంచుకొనే వీలును కల్పిస్తుంది. దీంతోపాటు సహకారరంగంలోని రుణాలను కార్పొరేట్లకు మళ్లించడానికి తోడ్పాటునందిస్తుందన్నారు. ఇండియన్ కౌన్సిల్‌ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్(ఐసిఎఆర్) పలు మల్టీనేషనల్ కార్పొరేట్లతో వ్యవసాయ పరిశోధనలకోసం అనేక ఒప్పందాలు కుదుర్చుకుందన్నారు. ప్రభుత్వరంగంలో ఎఫ్‌సిఐ సెంట్రల్‌వేర్‌హౌస్, కార్పొరేషన్, మార్కెట్ యార్డులను బడాకార్పొరేట్ కంపెనీలకు అద్దెకిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన కార్మికుల చట్టాలను కేంద్రపాలకులు నాలుగుకోడ్‌లుగా విభజించి అమలుచేయడానికి పూనుకుంది. వేతనాలకోడ్ చట్టంతో కనీస వేతనాలు నిర్ణయించే మౌలిక విధానాన్ని తుంగల్లో తొక్కిందన్నారు. పారిశ్రామిక సంబంధాలకోడ్ చట్టంతో సమ్మె హక్కును కాలరాస్తున్నది. సామాజిక భద్రతకోడ్, వృత్తిసంబంధిత రక్షణ, ఆరోగ్యం పని పరిస్థితుల కోడల్‌లతో పిఎఫ్, ఈఎస్‌ఐ,వెల్ఫేర్‌బోర్డులపై గొడ్డలిపెట్టు వేస్తున్నారు. ఆహారం, ఆరోగ్యం, విద్య, ఉపాధి, ఉద్యోగం వంటి ప్రధానహక్కులను కేంద్రప్రభుత్వం తొలగిస్తుందని ఆవేదన వ్యక్తంచేశారు. కార్యక్రమంలో సిపిఐ ఈర్లచంద్రమౌళి, ప్రజాసంఘాల రైతు, వ్యవసాయ, ట్రేడ్‌యూనియన్ ఎఐటియూసి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు, రైతుసంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పి.కృష్ణాజి, డి.బాలమురళికృష్ణ, వ్యవసాయ కార్మికసంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రవీందర్, కోళ్ల యేసయ్య, ఎఐటియూసి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు తప్పెటకిరణ్‌కుమార్, నాయకులు మంగంపేట శ్రీనివాసులు, బొల్లెద్దులశ్రీనివాసులు, బాలపీరు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

# మోదీ పాలనలో రైతులు దివాలా

### రైతు కూలీల సంక్షేమంపై శ్వేత పత్రం విడుదల చేయాలి

### సిపిఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు సురేశ్



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి :** దేశ ప్రధాని నరేంద్రమోడీ అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలతో దేశరైతాంగం దివాలా తీసిందని సిపిఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పి.సురేష్ ధ్వజమెత్తారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల రైతు పక్షపాత విధానాలను నిరసిస్తూ తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఆర్.అల్వాల్ రెడ్డి నేతృత్వంలో గత ఐదు రోజులగా జిల్లా వ్యాప్తంగా కొనసాగుతున్న రైతు రక్షణ యాత్ర మహమ్మదాబాద్ మండల కేంద్రానికి చేరుకుని బస్టాండ్ కూడలిలో సభ జరిగింది. ముందుగా కళాకారులు ప్రదర్శించిన నృత్యాలు, రైతు చైతన్య గీతాలు ప్రజలను ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా పి.సురేష్ మాట్లాడుతూ రైతు ఓట్ల లబ్ధి కోసం పాలకులు ఎన్నికల ముందు పొగడ్తలతో రైతు సంక్షేమ హామీలతో ఉదరగొట్టి గద్దెనెక్కిన తర్వాత రైతుల సంక్షేమానికి ఉరితాళ్లు పైనే మోసపూరిత పాలసీలు అమలు చేస్తున్నారని మండిపడ్డారు. మోడీ ప్రభుత్వం తెచ్చిన నూతన రైతు చట్టాలు రైతుల అస్తిత్వాన్ని దెబ్బతీసే విధంగా ఉన్నాయని దెబ్బతీసే విధంగా ఉన్నాయని దెబ్బతీసే ఉన్నాయని ఆరోపించారు. స్వామినాథన్ కమిషన్ సిఫారసులు అమలు చేయాలని దేశవ్యాప్తంగా రైతులు గగ్గోలు పెడుతున్న కేంద్ర ప్రభుత్వం చోద్యం చూస్తుందన్నారు. స్వామినాథన్ కమిషన్ సిఫారసులు అమలు జరుగుతేనే రైతులకు కొంతనైన న్యాయం జరుగుతుందని అన్నారు. రైతు కూలీల సంక్షేమం పై ప్రభుత్వం తక్షణమే శ్వేత పత్రం విడుదల చేయాలని అన్నారు. మార్పు పేరుతో అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన లేకుండా రైతు రుణ మాఫీ, పెట్టుబడి రుణం విడుదల చేయాలని, వలసలకు నిరక్షరాస్యతకు పేదరికానికి నిలయమైన ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పెండింగు ప్రాజెక్టులను, పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించాలని డిమాండు చేశారు. అసైన్మెంట్ చట్టం, ఆర్ఓఆర్‌చట్టం, సీలింగ్ యాక్టులను పకడ్బందీ అమలు చేయాలని, ప్రభుత్వం మిగులు భూములను పేదలకు పంచాలని, పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, ప్రకృతి వైపరీత్యాలలో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని డిమాండు చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఆర్.అల్వాల్ రెడ్డి, సంతోష్, గోపాల్, తుపాకుల వెంకటేశ్, నరసింహ, భీమయ్య, రాములు, హనుమయ్య, కృష్ణయ్య, యాదయ్య, రాజు, సవరన్న, తదితరులు ఉన్నారు.



## వరి కొనుగోలు కేంద్రం ప్రారంభం

**ప్రజాపక్షం/వంగూర్ :** మండలపరిధిలోని సర్వరెడ్డిపల్లి గ్రామంలో సోమవారం ఐకెపి ఆధ్వర్యంలో వరికొనుగోలుకేంద్రాన్ని కల్వకుర్తి మార్కెట్‌వైస్ చైర్మన్ పండిత్‌రావు ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సిఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రైతులతోపాటు బడుగు బలహీనవర్గాల అభివృద్ధికోసం నిరంతరం కృషిచేస్తుందని ఆయన పేర్కొన్నారు. రైతాంగ అభివృద్ధికోసం పలు సంక్షేమ కార్యక్రమాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని ఆయన గుర్తుచేశారు. సన్నరకంవడ్లు రూ.2350 ప్రభుత్వంద్వారా నిర్ణయించిందని అన్నారు. ఈఅవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మురళిమోహన్, ఎంపిడిఓ విజయభాస్కర్, ఆర్ఐ వసీంఅక్రమ్, ఏపిఎం చంద్రయ్య, మాజీసర్పంచ్ సరిత జంగయ్య, కాంగ్రెస్‌పార్టీ నాయకులురమేష్‌గౌడ్, జనార్ధన్, వివో విమల, సిసిలు రామస్వామి, గ్రామస్తులు పాల్గొన్నారు.




## చెడు వ్యసనాలపై విద్యార్థులకు అవగాహన

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌టౌన్ :** ప్రతి విద్యార్థికూడా చెడువ్యసనాలకు దూరంగా ఉండాలని ప్రధానోపాధ్యాయుడు ఎం.నాగరాజు అన్నారు. సోమవారం గగ్గలపల్లి జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల ఆవరణలో పొగాకు ఉత్పత్తులైన సిగరెట్లు, గుట్కా మొదలైనవి ఉపయోగించడంవలన కలిగే దుష్పరిణామాలు అంశంపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. పొగాకు వాడటంవలన 200రకాల రసాయనాలు మానవశరీరం పైన నోరు, పంటి,గొంతు, ఊపిరితిత్తులు, రక్తపు క్యాన్సర్ వ్యాధిసోకుతుందని చెడుఅలవాట్లకులోనై తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని అన్నారు. ప్రభుత్వంచే నిషేధించబడిన పొగాకు ఉత్పత్తులను ఉపయోగించడంవల్ల చదువుపట్ల శ్రద్ధకోల్పోతారన్నారు. నిషేధిత పదార్థాలను ఉపయోగించుకొని జీవితాలను నాశనం చేసుకోవద్దని విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకట్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, దేవరాజు, శేఖర్, సంధ్య, జ్యోతి,స్వరూపారాణి, హెల్త్ సూపర్‌వైజర్ జ్యోతి,వనజ, ఎఎన్ఎం రమాదేవి, ఆశవర్కర్ పాల్గొన్నారు.

## కేంద్ర బిజెపి ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటిద్దాం

**ప్రజాపక్షం / పెబ్బేరు :** పెబ్బేరు మండల కమిటీ ఆధ్వర్యంలో నవంబర్ 26న వనపర్తి జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు జరిగే ధర్నా విజయవంతం చేయాలని కరపత్రాలను మున్సిపల్ హమాలీ ట్రాన్స్పోర్ట్ కార్మికులతో కలిసి పెబ్బేరు మండల కేంద్రంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా సిఐటియూ వనపర్తి జిల్లా అధ్యక్షులు మండ్ల రాజు మాట్లాడుతూ అనేక త్యాగాలు రక్త తరపునతో పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మారుస్తూ పార్లమెంట్ లో ఇలాంటి చర్చ జరగకుండా ఏకపక్షంగా బీజేపీ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ అధ్యక్షులు రాములు , కృష్ణ, బాలయ్య, ఆయూబ్ , ఆంజనేయులు, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.


## ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

**ప్రజాపక్షం / చిన్నంబావి :** ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రామచంద్ర రెడ్డి అన్నారు. మండలం పరిధిలోని వెలగొండ గ్రామంలో ఐకెపి ఆధ్వర్యంలో నిర్వహించిన వరి కొనుగోలు కేంద్రాన్ని సింగిల్ విండో చైర్మన్ బగ్గారి నర్సింహరెడ్డి మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రామచంద్రరెడ్డి ఏపిఎం మద్దిలేటి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయంగా సీఎం రేవంత్ రెడ్డి పని చేస్తున్నారని ఎన్నికల సమయంలో ఇచ్చిన ప రతి హామీని నెరవేర్చేందుకు కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తుందన్నారు. రాష్ట్రంలో మహిళా సంక్షేమం కోసం అనేక పథకాలను తీసుకొచ్చి మహిళలను ఆర్థిక అభివృద్ధి చెందటానికి సీఎం కృషి చేస్తున్నారన్నారు. రైతులకు రూ. 500 బోనస్ ఇస్తున్నామన్నారు. ఈ నెల 28వ తేదీన కొల్లాపూర్ లో నిర్వహించే సీఎం బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. మొట్ట మొదటిసారిగా కొల్లాపూర్ కి వస్తున్నందుకు ఆయనకు నియోజకవర్గ ప్రజలు భారీగా స్వాగతం పలకాలని సూచించారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చంద్రశేఖర్ ఆదవ్ , బీచుపల్లి యాదవ్ , మండల నాయకులు కోటీశ్వర్ రెడ్డి, యూత్ నాయకులు తేజరెడ్డి, హరికిషన్ రెడ్డి, గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు మహదేవగౌడ్ , నాగరాజు పుల్లయ్య శెట్టి, వెంకటకృష్ణరెడ్డి, పసుల నాగరాజు, ఆంజనేయులు, ఆశోక్ నాయుడు మహిళా సంఘం అధ్యక్షులు అరుణ , ప్రశాంతి పాల్గొన్నారు.

## సిఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

**ప్రజాపక్షం / పెద్దమందడి :** వనపర్తి జిల్లా కేంద్రంలో సోమవారం వనపర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పెద్దమందడి మండలం చీకరు చెట్టు తండా గ్రామానికి చెందిన లబ్ధిదారు అయినా వంకడవత్ సక్రి వైఫాప్ గౌడ్ కళ్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ రమేష్ గౌడ్ , మాజీ జడ్పీటీసీ వెంకటస్వామి, మాజీ ఎంపీటీసి రామచంద్రయ్య గౌడ్ , చీకరు చెట్టు తండా , స్థానిక మాజీ సర్పంచ్ రాధాకృష్ణ, మండలకాంగ్రెస్ నాయకులు జగత్ పల్లి , గట్టు యాదవ్ ,వెల్టూర్ మహేష్ , వివేక్ ,టైలర్ రవన్న, అల్వాల గ్రామం మాజీ ఉప సర్పంచ్ సుదర్శన్ రెడ్డి పాల్గొన్నారు.

## కరెంటు స్తంభాన్ని ఢీ కొట్టిన ట్రాక్టర్



**ప్రజాపక్షం / పెద్దమం-దడి :** మండల కేంద్రంలో సోమవారం ఉదయం అపశ్రుతి చోటు చేసుకుంది. కంట్రోలర్ బాబా ఇంటి సమీపంలో ఒక ట్రాక్టర్ అదుపు తప్పి కరెంటు స్తంభాన్ని ఢీ కొట్టింది. ఈ సంఘటనలో కరెంటు స్తంభం విరిగి ట్రాక్టర్ పై పడటంతో పాటు, కంట్రోలర్ బాబు ఇంటిపై కూడా పడింది. అదృష్టవశాత్తు ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. ఇంటికి ట్రాక్టర్ కి స్వల్ప నష్టం జరిగింది. సంఘటన జరిగిన వెంటనే స్థానికులు అప్రమత్తమై కరెంటు శాఖ అధికారులకు సమాచారమిచ్చారు. కరెంటు స్తంభాన్ని త్వరగా పునర్నిర్మించి విద్యుత్ సరఫరాను పునరుద్దరించాల్సిందిగా స్థానికులు కోరుతున్నారు.

## సర్వే నమోదులో తప్పులు చేయొద్దు

### కలెక్టర్ సిక్తా పట్నాయక్

**ప్రజాపక్షం / నారాయణపేట ప్రతినిధి :** ప్రజల సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ , కుల స్థితిగతులను విశ్లేషించేందుకు వీలుగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఇంటింటి సమగ్ర సర్వే సందర్భంగా సేకరించిన వివరాలను ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేసే విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ సూచించారు. ధన్వాడ మండల పరిషత్ కార్యాలయం తహసీల్దార్ కార్యాలయం మండల మహిళా సమాఖ్య కార్యాలయంను కలెక్టర్ సోమవారం సందర్శించి, ఇంటింటి సర్వే ద్వారా సేకరించిన వివరాలను ఆపరేటర్లు ఆన్‌లైన్లో నమోదు చేస్తున్న తీరును పరిశీలించారు. ఒక్కో దరఖాస్తు వివరాలను ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేసేందుకు ఎంతసమయం పడుతోందని కలెక్టర్ ప్రశ్నించగా సుమారు 15 నిమిషాల వ్యవధి అవుతోందని ఆపరేటర్లు తెలిపారు. పాఠశాలలో 300 మంది విద్యార్థులు ఉన్నట్లు ఉపాధ్యాయులు కలెక్టర్ తెలిపారు. ఉపాధ్యాయుల తీరుపై జిల్లా కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. వంట ఏజెన్సీని టర్మినేట్ చేసి ఇతరులను నియమించాలని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ వెంట డిఎస్ఓ , డిఎం సివిల్ సప్లై అధికారి తహసీల్దార్ , అధికారులు ఉన్నారు.



## బిసిలకు 50శాతం రిజర్వేషన్లు

### బిసి సంక్షేమసంఘం డిమాండ్

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌టౌన్ :** పార్లమెంటులో బిల్లుపెట్టి చట్టసభలో బిసిలకు 50శాతం రిజర్వేషన్లు కల్పించాలని బిసి సంక్షేమసంఘం ఉమ్మడి పాలమూరు జిల్లా అధ్యక్షులు డాక్టర్ కాళ్లనిరంజన్ అన్నారు. సోమవారం బిసి కార్యాలయంలో బిసి సంఘం నాయకులు ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఒకేరోజులో బిల్లుపెట్టి ఆగమేఘాలపై 10శాతం ఈడబ్ల్యుఎస్ రిజర్వేషన్లు కల్పించిన బిజెపిసర్కార్ బిసిలు ఏళ్లుగా పోరాడుతున్న పట్టించుకోవడంలేదన్నారు. బిసిలకోసం కేంద్రస్థాయిలో ఒక పథకాన్నికూడా అమలుచేయడంలేదని ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు. చట్టసభల్లో, ఉద్యోగ ప్రమోషన్లలో బిసిలకు రిజర్వేషన్లు కల్పించాలని, క్రిమిలేయర్ తొలగించాలని, బిసిలకు ప్రత్యేక మంత్రిత్వశాఖను ఏర్పాటుచేయాలని డిమాండ్‌చేశారు. ఈ సమావేశంలోబిసి పొలిటికల్ జేఏసి అధ్యక్షులు అరవింద్‌చారి, జిల్లావర్కింగ్ ప్రెసిడెంట్ కుంభంమల్లేష్‌గౌడ్, లక్ష్మయ్య, తీగలభాస్కర్, శ్రీనివాసులు, నిరంజన్‌యాదవ్, రాము, నవీన్ పాల్గొన్నారు.



## ప్రజావాణికి 43 ఫిర్యాదులు

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** నాగర్‌కర్నూల్ జిల్లాలోని వివిధ ప్రాంతాలనుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్ , అదనపు కలెక్టర్ దేవసహాయంకి విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల సత్వరపరిష్కారంకోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను సంబంధితశాఖల జిల్లా అధికారులు తక్షణమే స్పందిస్తూ వాటిని వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. వినతులపై చేపట్టిన చర్యలను వివరిస్తూ ఆన్‌లైన్‌పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో స్వీకరించిన దరఖాస్తులకు ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని, అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో చంద్రశేఖర్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



## పత్తికొనుగోలు కేంద్రాలలో ఇబ్బందులు

### మాజీ ఎమ్మెల్యే మర్రిజనార్దన్‌రెడ్డి

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** కాంగ్రెస్ ప్రభుత్వం సిసిఐ పత్తికొనుగోలు కేంద్రాలలో రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నదని నాగర్‌కర్నూల్ మాజీ ఎమ్మెల్యే మర్రిజనార్ధన్‌రెడ్డి ఆరోపించారు. సోమవారం తాడూరు మండలంలోని ఇంద్రకల్ గ్రామంనుండి నాగర్‌కర్నూల్‌కు వెళుతున్న సమయంలో ఇంద్రకల్ గ్రామశివారులోగల మణికంఠజిన్నింగ్‌మిల్‌దగ్గర రైతులు మర్రిజనార్ధన్‌రెడ్డికారు ఆపివారు గతకొన్నిరోజులుగా పడుతున్న ఇబ్బందులను ఆయనదృష్టికి తీసుకెళ్లారు. వెంటనే ఆయన సిసిఐ అధికారులతో మాట్లాడి ఎలాంటి కొర్రిలులేకుండా రైతులుతెచ్చిన పత్తిని కొనుగోలుచేసి వెంటనే అన్‌లోడ్ చేయాలని సిసిఐ అధికారులకు సూచించారు. రైతులకు సరైన గిట్టుబాటుధర ఇవ్వకుండా కొర్రిలుపెట్టి పత్తికొనుగోలు చేయకుంటే బిఆర్ఎస్‌పార్టీ ఆధ్వర్యంలో రైతులకు న్యాయం జరిగేవరకు వారి తరపున పోరాటం చేస్తామని హెచ్చరించారు. జిల్లా కలెక్టర్ వెంటనే సిసిఐ కొనుగోలు కేంద్రాలు సందర్శించి రైతులకు ఇబ్బందులులేకుండా చూడాలన్నారు. ఒక వైపు రైతులు పండించిన పంటలను అమ్ముకోలేక తీవ్ర ఇబ్బందులుపడుతున్న పట్టించుకోకుండా గాలికివదిలేసిన ప్రభుత్వం విజయోత్సవ సంబరాలు జరుపుకోవడం విడ్డూరమన్నారు. కాంగ్రెస్‌ప్రభుత్వంపాలనలో సబ్బండ వర్గాలప్రజలు అవస్థలు పడుతున్నారని అన్నారు. ప్రభుత్వం వెంటనే సమీక్షచేసి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్‌చేశారు.



## 27న భారీ ఆటోర్యాలీ

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** ఈనెల 27న నాగర్‌కర్నూల్ జిల్లాకేంద్రంలో నిర్వహించే భారీ ఆటోర్యాలీని విజయవంతంచేయాలని ఎఐటియూసి జిల్లా ప్రధాన కార్యదర్శి శివశంకర్ కోరారు. సోమవారం పట్టణంలోని ఎఐటియూసి అనుబంధ కుమ్మెర ఆటోస్టాండుదగ్గర ఆటోడ్రైవర్ కార్మికుల సమావేశంలో పాల్గొని ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్‌ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుకై ఆటోమోటార్ రవాణ కార్మికులకు సంక్షేమబోర్డును వెంటనే అమలుచేయాలని , ఆటోడ్రైవర్లకు రూ.12వేలు ఇస్తానన్న హామీని నెరవేర్చాలన్నారు. మహిళలకు ఉచితబస్సు సౌకర్యం కల్పించడంవలన ఆటో కార్మికులు చాలా ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. ఈనెల 27న జిల్లాకేంద్రంలో నిర్వహించే భారీ ఆటోర్యాలీని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఆటోడ్రైవర్ కార్మికులపక్షాన ముందుండి పోరాటంచేసి హక్కులు సాధించేవరకు పోరాటాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఎఐటియూసి జిల్లా సహాయ కార్యదర్శి చినపాగశ్రీనివాసులు, కుమ్మెర ఆటోస్టాండ్‌యూనియన్ అధ్యక్షులు ఎండి.రజాక్, నాగేంద్రగౌడ్, బాలస్వామి, రామచంద్రి,విష్ణు, శివ, ఆటోడ్రైవర్ కార్మికులు పాల్గొన్నారు.

## విత్తన షాపుల తనిఖీ

**ప్రజాపక్షం / పెబ్బేరు :** పెబ్బేరు మండలంలో ఎలాంటి విత్తన ధృవీకరణ లేని విత్తనాలను ప్లాస్టిక్ కవర్లో ప్యాక్ చేసి అమ్ముతున్నారన్న కథనం సోమవారం ప్రజాపక్షం దినపత్రికలో ప్రచురితం కావడంతో పెబ్బేరు మండల వ్యవసాయ అధికారి మున్నా మండల కేంద్రంలో షాపులను తనిఖీ చేపట్టారు. అనుమతులు లేని విత్తనాలను రైతులకు అమ్మితే లైసెన్స్ రద్దు చేసి క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు. పెబ్బేరులోని గ్రోమోర్ , మల్లికార్జున ట్రేడర్స్ , సంకల్ప్ రైతు సేవ కేంద్రాలను తనిఖీ చేసి రికార్డులను విత్తన ఇన్వాయిసులను పరిశీలించారు. నిద్ర అవస్థలో ఉన్న విత్తనాలను రెండు రోజులు ఆరబెట్టి వెతుకోవాలని రైతులకు సూచనలు ఇచ్చారు.

## విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

**ప్రజాపక్షం / ఊట్కూర్ :** పాఠశాలలోని విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని లేదంటే కఠిన చర్యలు తప్పవని ఎంపీడీఓ ధనుంజయ అన్నారు. సోమవారం ఊట్కూర్ మండలం కేంద్రంలోని శ్రీరాంనగర్ ఉర్దూ మీడియం పాఠసాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి అనంతరం విద్యార్థులకు పండించి విద్యార్థులతో సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

## కార్మికులకు అండగా సిపిఐ : పోటు



**ప్రజాపక్షం/కల్లూరుః** సిపిఐ అనుబంధంగా ఉన్న ఎఐటియుసి కార్మిక సంఘాలు, మధ్యాహ్న భోజనం, గ్రామపంచాయతీ, స్వీపర్లు, హమాలీలు, అంగన్‌వాడి, ఆశ, వివో ఏలు, ఆసుపత్రి కార్మికులు తదితర రంగాలలో పనిచేస్తున్న కార్మికులందరికీ అండగా ఉంటుందని సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ పేర్కొన్నారు. వంద సంవత్సరాలుగా అనేక రంగాలలో పని చేస్తున్న కార్మికులకు అండగా ఉంటూ వారి హక్కులు విధులు బాధ్యతలు అమలుకు కృషిచేసి వారిని ఆదుకుంటుందని వివరించారు. కల్లూరు లోని మార్కెట్ కమిటీ ఆవరణలో సిపిఐ, ఎఐటియుసి అనుబంధ సంఘాల జనరల్ బాడీ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. పలు రంగాలలో పనిచేస్తున్న కార్మిక సంఘాల వారు సిపిఐ మరియు ఏఐటియుసి నిరంతరం సమస్యల పరిష్కారం కోసం పోరాడుతూ ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి సింగి నరసింహారావు, జిల్లా కార్యదర్శి రామాంజనేయులు, వర్కింగ్ ప్రెసిడెంట్ శివరామకృష్ణ, దండు ఆదినారాయణ, నిమ్మటూరు రామకృష్ణ, గాదే లక్ష్మి నారాయణ, వేము రాంబాబు, దామాల దయాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## 51 సంవత్సరాలుగా సిపిఐతో గోర్కి అనుబంధం



**ప్రజాపక్షం/ఖమ్మం :** ఖమ్మంజిల్లాలో తొలు త కమ్యూనిస్టు పార్టీ సభ్యులుగా మారిన అతి కొద్ది మందిలో పారుపల్లి రామయ్య ఒకరు. బోనకల్ మండలం రాయన్నపేట గ్రామానికి చెందిన పారుపల్లి రామయ్య, సర్వదేవభట్ల రామనాథం, రావెళ్ల జానకిరామయ్య తదితరులతో కలిసి తొలి దశలోనే కమ్యూనిస్టు పార్టీ సభ్యునిగా చేరారు. తుది శ్వాస వరకు కమ్యూనిస్టుగా జీవించడమే గాక చుట్టు పక్కల గ్రామాల్లో బలమైన కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాణానికి కృషి చేశారు. ఆయన వారసుడే డాక్టర్ పారుపల్లి గోర్కి. వైద్య వృత్తిలో ఉన్న గోర్కి 1971లో భారత కమ్యూనిస్టు పార్టీ సభ్యులుగా చేరారు. అప్పటి నుండి ప్రతి ఏడాది సభ్యత్వాన్ని పునరుద్దరించుకుంటూ కమ్యూనిస్టు ఉద్యమానికి బాసటగా నిలిచారు. సోమవారం సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ నుంచి పార్టీ సభ్యత్వం స్వీకరించారు. శాఖ సభ్యులందరూ పార్టీ సభ్యత్వాన్ని స్వీకరించారు. ఈసందర్భం గా పోటు ప్రసాద్ మాట్లాడుతూ కమ్యూనిస్టు ఉద్యమానికి దన్నుగా నిలుస్తున్న డాక్టర్ గోర్కిలాంటి వారి మద్దతు పార్టీ బలోపేతానికి ఆవశ్యమన్నారు.

**సభ్యత్వాన్ని పునరుద్దరించుకున్న డాక్టర్ వై. ప్రసాద్...**ఖమ్మం నగరానికి





చెందిన ప్రముఖ వైద్యులు, భారత కమ్యూనిస్టు పార్టీ సభ్యులు డాక్టర్ వై. ప్రసాద్ భారత కమ్యూనిస్టు పార్టీ 100 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా సోమవారం పార్టీ సభ్యత్వాన్ని స్వీకరించారు. వై. ప్రసాద్ తండ్రి యరమల వెంకటనర్సయ్య , తల్లి యరమల రాజమ్మ సాయుధ తెలంగాణ పోరాట యోధులు, భారత కమ్యూనిస్టు పార్టీ పక్షాన బహుముఖ పోరాటాలు నిర్వహించిన నాయకులు. ఆయన వారసుడిగా విద్యార్థి దశ నుంచే ప్రజా ఉద్యమంలో పని చేసిన డాక్టర్ వై. ప్రసాద్ కమ్యూనిస్టు పార్టీ సభ్యత్వాన్ని పునరుద్దరించుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు మేకల శ్రీనివాసరావు, ప్రజా సంఘాల బాధ్యులు మద్దోజు శ్రావణ్ పాల్గొన్నారు.

## నూరేళ్ల చరిత్రగల పార్టీ సిపిఐ : సురేష్



**ప్రజాపక్షం/ఖమ్మం రూరల్ :** తాడిత, పీడిత, కార్మిక, కర్షక, బడుగు, బలహీన వర్గాల పక్షాన సంవత్సరాలుగా అండగా నిలుస్తున్న పార్టీ సిపిఐ అని పార్టీ ఖమ్మం జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ అన్నారు. ఆదివారం ఖమ్మం రూరల్ మండలంలోని కామంచికల్లు గ్రామంలో ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు.కామంచికల్లు, ముత్యాల గూడెం, పడమటి తండా గ్రామాల్లో 134 మంది సభ్యుల నుంచి స్వీకరించిన సభ్యత్వాలను ఆ శాఖల ఆధ్వర్యంలో దండి సురేష్‌కు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు మిడకంటి చిన్న వెంకటరెడ్డి, జిల్లా సమితి సభ్యులు చెరుకుపల్లి భాస్కర్, మండల కార్యదర్శి పుచ్చకాయల సుధాకర్, మండల సమితి సభ్యులు వెంపటి సురేందర్, కే అశోక్ రెడ్డి, బొప్పి గాంధీ, ఎస్ కే షాహిని, కాలంగి ఉపేందర్, కొప్పుల వెంకటరమణ, అనంతుల శారద, జంగాల ఉపేందర్ ,చెరుకూరి ఉపేందర్, సత్తి నరేష్, యాట కొండయ్య, రాగం పుల్లారావు, వెంకటకృష్ణ, లింగనబోయిన నాగేశ్వరరావు, యాట సైదులు, మాలోతి శంకర్, మాలోతు రాజు పాల్గొన్నారు.

## 'బ్లూమింగ్ మైండ్స్'కు అవార్డు



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలోని బ్లూమింగ్ మైండ్స్ సెంట్రల్ స్కూల్, జూనియర్ కళాశాలకు రాష్ట్ర స్థాయిలో ఉత్తమ పాఠశాల అవార్డు లభించింది. ఎన్‌సిసి 76వ దినోత్సవ సందర్భంగా జెడి మరియు జెడబ్ల్యూ విభాగాల్లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఎన్‌సిసి డైరెక్టరేట్ ప్రకటించిన వివిధ విభాగాలలో తెలంగాణ రాష్ట్రంలోని ఉత్తమ విద్యా సంస్థగా ఖమ్మం నగరంలోని బ్లూమింగ్ మైండ్స్ సెంట్రల్ స్కూల్, జూనియర్ కళాశాల కైవసం చేసుకుంది. ఎన్‌సిసి 76వ దినోత్సవ సందర్భంగా సోమవారం హైదరాబాద్‌లోని మెహిదిపట్నం మిలటరీ గ్యారిసన్ గ్రౌండ్‌లో జరిగిన కార్యక్రమంలో ఎన్‌సిసి ఎపి, తెలంగాణ డిప్యూటీ డైరెక్టరేట్ ఎయిర్ కమాండర్ వివిఎన్ రెడ్డి నుంచి పాఠశాల కరస్పాండెంట్ పి.అశోక్‌రెడ్డి అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా వివిఎన్ రెడ్డి, పాఠశాల కరస్పాండెంట్ అశోక్‌రెడ్డి మాట్లాడుతూ తమ పాఠశాలలో గల ఎన్‌సిసి, వ్యాయామ ఉపాధ్యాయులు చూపిస్తున్న చొరవ, విద్యార్థులు చూపిస్తున్న ప్రతిభ, ప్రత్యేక కార్యక్రమాల నిర్వహణ, శిక్షణా శిబిరాలు నిర్వహించడం వల్లే ఈ అవార్డును పొందడం జరిగిందన్నారు. ఇంతటి ప్రతిష్టాత్మకమైన అవార్డు తమ పాఠశాలకు దక్కడం ఎంతో గౌరవంగా భావిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్, ఎన్‌సిసి బాధ్యులు పి. వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం అమ్మండి

### కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని



**ప్రజాపక్షం/పాల్వంచ :** రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే అమ్మి మద్దతు ధర పొందాలని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. సోమవారం పాల్వంచ మండల పరిధిలోని సంగం గ్రామంలో పాల్వంచ సహకార సంఘం ద్వారా ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని డిసిఎంఎస్ ఛైర్మన్, రాష్ట్ర మార్కెఫెడ్ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావుతో కలిసి కూనంనేని ప్రారంభించారు. ఈసందర్భంగా కూనంనేని మాట్లాడుతూ రైతులు దళారుల మాటలు నమ్మి, వారికి ధాన్యాన్ని అమ్మి మోసపోవద్దన్నారు. ప్రభుత్వం సన్నరకం ధాన్యంపై క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తున్నదని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డిసిఒ ఖుర్షిద్, తహసీల్దార్ జి.వివేక్, సొసైటీ వైస్‌చైర్మన్ కాంపెల్లి కనకేష్, ఇంచార్జి ఎంపిడిఒ నారాయణ, వ్యవసాయ శాఖాధికారి శంబోశంకర్, పిఆర్ డిఇ రామకృష్ణ, సొసైటీ డైరెక్టర్లు బుడగం రామమోహనరావు, కనగాల నారాయణ, చౌగాని పాపారావు, మైనేని వెంకటేశ్వరరావు, భూక్యా కిషన్, సిపిఐ నాయకులు ముత్యాల విశ్వనాథం, పూర్ణచందర్‌రావు, కాంగ్రెస్ నాయకులు నూకల రంగారావు, వై వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### ఆర్థిక ప్రగతికి చేయుతనివ్వాలి

**పాల్వంచ టౌన్ :** గాయత్రి బ్యాంకు అభివృద్ధి పథంలో ముందుకు సాగుతూ, వినియోగదారుల ఆర్థిక ప్రగతికి చేయుతనివ్వాలని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. పాల్వంచలో ది గాయత్రి కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకు 49వ శాఖను ముఖ్యఅతిథిగా కూనంనేని హాజరై ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో కూనంనేని మాట్లాడుతూ 2000 సంవత్సరంలో ప్రారంభించిన గాయత్రి బ్యాంకు నేడు మల్టీ స్టేట్ బ్యాంకుగా రూ.2939.45కోట్ల వ్యాపారాన్ని సాధించి 50 బ్రాంచీలతో తెలంగాణలో కోఆపరేటివ్ బ్యాంకులలో అతిపెద్ద బ్యాంకుగా అవతరించడం అభినందనీయమన్నారు. పాల్వంచ ప్రాంత ప్రజలు బ్యాంకు సేవలను వినియోగించుకోవాలని కోరా



రు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషన్ కోడూరు సుజాత, బ్యాంకు ముఖ్యకార్యనిర్వహణాధికారి వనమాల శ్రీనివాస్, రీజనల్ మేనేజర్ చిట్టబొట్ల వంశీకృష్ణ, బ్యాంకుపాలకవర్గ సభ్యులు ముత్యాల లక్ష్మణ్‌రెడ్డి, ఎం.సౌజన్య, ఎ.రాజిరెడ్డి, ఎ.సత్యం, వై.అశోక్, కె.శ్రీనాథ్, బి.విజయ్, జి.గంగాధర్, వి.మాధవి, ఆర్.సతీష్, ఎస్.రవికుమార్, సభ్యులు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

## న్యాయవాదుల నిరసన

**ప్రజాపక్షం/ఖమ్మం లీగల్ :** ఖమ్మం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం న్యాయవాదులు నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎన్. శ్రీనివాసరావు మాట్లాడుతూ నాన్ క్యాడర్ పిపి పోస్టులను క్యాడర్ పోస్టులుగా మార్చవద్దని జీవో 16, 12ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సుప్రీం కోర్టు జడ్జిమెంట్ ప్రకారం క్యాడర్ పోస్టులు 50 శాతం, నాన్ క్యాడర్ పోస్టులు 50 శాతం ఉండాలని తీర్పునిచ్చారని క్యాడర్‌కు సంబంధించిన వారు ప్రమోషన్ల కోసం ఉద్యోగ సంఘాలతో ఒత్తిడి చేసి జీవో నెం.16, 12ను తీసుకురావడం జరిగిందన్నారు. నాన్ క్యాడర్ పోస్టు లేకుండా చేయాలని కుట్ర జరుగుతుందని ఇలా జరిగితే ఇబ్బందికర పరిస్థితులు ఎదురవుతాయన్నారు. కక్షి దారులకు న్యాయం జరిగేవిధంగా ప్రభుత్వం న్యాయ నిపుణులను నియమించే అవకాశం ఉందని దీని వల్ల కక్షిదారులకు సత్వర న్యాయం అందుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ కౌన్సిల్ సభ్యులు కొల్లి సత్యనారాయణ, ఐఏఎల్ జిల్లా కార్యదర్శి ఓరుగంటి శేషగిరిరావు, సీనియర్ న్యాయవాదులు నిరంజన్‌రెడ్డి, బిచ్చాల తిరుమలరావు, కె. వెంకటేశ్వరరావు, చింతనిప్పు వెంకట్, దిలీప్ చౌదరి, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.



## ప్రజావాణి అర్జీలకు పరిష్కారం

### అదనపు కలెక్టర్లు శ్రీజ, శ్రీనివాసరెడ్డి



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ప్రజావాణి అర్జీలను పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని అదనపు కలెక్టర్లు డా. పి.శ్రీజ, పి.శ్రీనివాసరెడ్డిలు సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు శ్రీజ, శ్రీనివాసరెడ్డిలు పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో డిఆర్‌డిఒ రాజేశ్వరి, కలెక్టరేట్ పరిపాలన అధికారి అరుణ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ప్రజల అవసరాల మేరకు అభివృద్ధి

### మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ప్రజల అవసరాల మేరకు అభివృద్ధి పనులు చేపట్టాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. సోమవారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డితో కలిసి ఖమ్మం నగరంలోని నాల్గవ డివిజన్‌లో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.1.43 కోట్ల వ్యయంతో నిర్మించనున్న పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి నిధులు వచ్చిన ప్రతిసారి అన్ని ప్రాంతాల ప్రజల అవసరాల మేరకు పనులు చేస్తున్నామన్నారు. అభివృద్ధి పనుల్లో ఎటువంటి రాజకీయ వివక్ష లేకుండా చేపడుతున్నామని మంత్రి తెలిపారు. ఖమ్మం నగర అభివృద్ధికి పెద్దపీట వేస్తూ అధిక నిధులు కేటాయిస్తున్నట్లు తెలిపారు. కలెక్టరేట్ వరకు మొక్కలు పెంచి పచ్చదనాన్ని పెంపొందించాలన్నారు. మేయర్ పునుకొల్లు నీరజ మాట్లాడుతూ నాల్గవ డివిజన్‌లో అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేయడం ఎంతో ఉపయోగకరమన్నారు. ఇక్కడ చాలా మంది ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి పరిశ్రమలలో పని చేస్తున్నారని వారికి ఈ హెల్త్ సెంటర్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పనులు నాణ్యతతో చేపట్టి సకాలంలో పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు జ్యోతిరెడ్డి, కమర్తపు మురళి, డిఎంహెచ్ఒ కళావతిబాయి, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# త్వరతగతిన అభివృద్ధి పనులు పూర్తి

### పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు



**ప్రజాపక్షం/అశ్వాపురం :** త్వరతగతిన అభివృద్ధి పనులు పూర్తి చేయాలని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అధికారులకు సూచించారు. సోమవారం అశ్వాపురం మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా పలు సిసి రోడ్లకు శంకుస్థాపన చేశారు. మల్లెల మడుగు, సత్యనారాయణపురం, రామచంద్రపురం గ్రామాలలో ఆయనకు గ్రామస్తులు, నాయకులు ఘనంగా ప్రజలు ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. సత్యనారాయణపురంలోని పలు సిసి రోడ్లను ప్రారంభించారు. కడియాలబుడ్డి వాగును పరిశీలించి, అక్కడ చెక్ డ్యామ్ ఏర్పాటు ప్రతిపాదిత ప్రాంతాన్ని పరిశీలించి అధికారులను అడిగి తెలుసుకుని వాటిని త్వరతగతిన పూర్తి చేయాలన్నారు. గరిబడ్డు గ్రామంలో ఎమ్మెల్యే పాయంకు గ్రామ ప్రజలు స్వాగతం పలికి సత్కరించారు. ఈసందర్భంగా ప్రజలతో మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి రావాల్సిన పథకకాలు వస్తున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. రామచంద్రాపురంలోని నూతన పంచాయతీ భవనానికి, ఐటిసి స్వచ్ఛందంగా నిర్మిస్తున్న బస్సుషెల్టర్‌కు శంకుస్థాపన చేశారు. గ్రామస్తుల విజ్ఞప్తులను స్వీరించి వాటిని త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అశ్వాపురంలోని పినపాక నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గాదె కేశవరెడ్డి నూతన గృహాన్ని సందర్శించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఓరుగంటి బిక్షమయ్య, నాయకులు గాదే కేశవరెడ్డి, ఓరుగంటి రమేష్, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, బురెడ్డి వెంకట్‌రెడ్డి, తూము రాఘవులు, గొల్లపల్లి నరేష్, బిసి సెల్ నాయకులు బచ్చు వెంకటరమణ, బేత రామకృష్ణ, తహసీల్దార్, ఎంపిడిఒ, అధికారులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అన్నివర్గాల సంక్షేమానికి పథకాలు

### వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్



**ప్రజాపక్షం/వైరా :** అన్ని వర్గాల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పథకాలు అందిస్తుందని వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ అన్నారు. సోమవారం వైరా మండలంలోని స్నానాల లక్ష్మీపురం గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే రాందాస్ నాయక్ ప్రారంభించారు. అనంతరం కల్యాణలక్ష్మి , శాదీముబారక్, సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్దిదారులకు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజా సంక్షేమం దిశగా పాలన నడుస్తుందన్నారు. రైతుల కోసం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటుచేసి క్వింటాకు 500 రూపాయలు బోనస్‌గా ఇస్తూ రైతుసంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోందని తెలిపారు. రైతు ఎప్పుడు కన్నీరు పెట్టకూడదని ఆలోచించి ఇచ్చిన ప్రతీ హామీని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి , ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క నాయకత్వంలో అమలే చేస్తున్నట్లు తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యాన్ని ఏర్పాటు చేయడమే కాకుండా ఎల్లవేళలా అందుబాటులో ఉండే విధంగా రవాణ వ్యవస్థను మెరుగుపరిచినట్లు తెలిపారు. ప్రతి ఇంటికి 200 యూనిట్లు ఉచిత విద్యుత్ పాటు 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్ అందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు శీలం వెంకటనర్సిరెడ్డి, పిసిసి కార్యదర్శి కట్ల రంగారావు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఏదునూరి సీతారాములు, దొడ్డా పుల్లయ్య, యడ్లపల్లి వీరయ్యచౌదరి , బోళ్ల రంగారావు, పమ్మి అశోక్, బిడికె రత్నం, మల్లు రామకృష్ణ, మట్టూరి కృష్ణారావు, పొట్లపల్లి శ్రీను, మచ్చ వెంకటేశ్వరరావు, దర్శి చెన్నారావు, చింతనిప్పు మాధవరావు, కట్ల సంతోష్, జివ్వాజి నాగరాజు, తహసీల్దార్ శ్రీనివాసరావు, వ్యవసాయశాఖ అధికారి కరుణశ్రీ, ఎఒ మంజుఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

### సర్వేలో ఏ ఒక్క ఇంటినీ వదలొద్దు

### భద్రాచలం కలెక్టర్ జితేష్ వి పాటిల్



**ప్రజాపక్షం/భద్రాచలం :** విద్యార్థులకు నాణ్యమైన, పరిశుభ్రమైన భోజనాన్ని అందించాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ సంబంధిత అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. సోమవారం జిల్లాలోని ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ , ట్రైబల్, మధ్యాహ్న భోజనం అమలులో ఉన్న పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చేపట్టాల్సిన చర్యలపై అదనపు కలెక్టర్ వేణుగోపాల్, విద్యాచందన, ట్రైబల్ వెల్ఫేర్ డిడి మణెమ్మతో కలిసి జిల్లా అధికారులు, మున్సిపల్ కమీషనర్లు, తహసీల్దార్లు, ఎంపిడిఒలు, ఎంఇఒలతో ఆయన వీడియో కాన్ఫిరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని హాస్టళ్లు, మండల స్థాయి అధికారులు తమ పరిధిలోని హాస్టళ్లను వ్యక్తిగతంగా పరిశీలించి పరిస్థితులు, సమస్యలపై ఫొటోలతో కూడిన నివేదికను అందించాలన్నారు. సరఫరా చేసే బియ్యం నాణ్యతను ఎప్పటికప్పుడు పరిశీలించి రిజిష్టర్‌లో సంతకం చేయాలని ఆదేశించారు. మధ్యాహ్న భోజనం బియ్యంలో నాణ్యత ఉండాలని పౌరసరఫరాల అధికారులను ఆదేశించారు. పరిసరాలతో పాటు వంట గదులు, స్టోర్ రూంలలో పరిశుభ్రత పాటించాలని, పాఠశాలల్లో ఉత్సాహ వంతులైన విద్యార్థినీ విద్యార్థులలో ఒకరిని లీడర్‌గా నియమించి పరిశుభ్రత పాటించే విధంగా చూడాలన్నారు. విద్యార్థులు తామే తమ ప్లేట్లను శుభ్ర పరుచుకోకుండా హాస్టల్ వర్కర్లు ప్లేట్లు శుభ్రం చేసి ఇవ్వాలన్నారు. హాస్టళ్లలో సోలార్ వాటర్ హీటర్లు ఎన్ని ఉన్నాయి. ఇంకా ఎన్ని అవసరం ఉందనే విషయాన్ని అధికారులు స్వయంగా పరిశీలించాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలోని బాలికల హాస్టళ్లలో మరుగుదొడ్లు సదుపాయాలపై నివేదికలు అందించాలని అధికారులను కోరారు. అందికారులంతా సమన్వయంతో పనిచేసి విద్యార్థులకు మేలురకమైన ఆహారం అందించడంతో పాటు పరిశుభ్రమైన వాతావరణాన్ని కల్పించాలని ఆదేశించారు. నవంబర్ 26 రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని అంతా ప్రతిజ్ఞ చేయాలన్నారు. అదే విదంగా ప్రభుత్వం చేపడుతున్న సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వేలో ఏ ఒక్క గృహాన్ని వదలకుండా సర్వే పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. డేటా ఎంట్రీ వేగవంతం చేయాలని, ఇందుకు అనుగుణంగా కంప్యూటర్ ఆపరేటర్లను ఎక్కువ సంఖ్యలో ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.

# రైతులతో కలెక్టర్ 'మాటామంతి'





**ప్రజాపక్షం/తల్లాడ :** సోమవారం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తల్లాడ మండలంలో పర్యటించారు. పొలం గట్టుపై కూర్చుని రైతులతో మాటామంతి చేపట్టారు. మంగాపురంలో తమ్మిశెట్టి లక్ష్మి నర్సయ్య రైతు పొలంలో జరుగుతున్న వరి పంట కోతను పరిశీలించారు రైతులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. వరి కోత మిషన్‌పై కూర్చుని కోతలను పరిశీలించారు. సాగునీటి వసతి ఎలా ఉంది, విద్యుత్ సమస్యలు ఉన్నాయా, తాగునీటి సరఫరా జరుగుతుందా వంటి అంశాలను ఆరా తీశారు. ధరణికి సంబంధించి సమస్యలు ఉన్నాయా అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పాఠశాలలో జరిగే విద్యార్థుల కోసం ప్రభుత్వం అవసరమైన వసతులు కల్పిస్తుందని తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపించాలని కలెక్టర్ సూచించారు. ధాన్యం పంట విస్తీర్ణం, వస్తున్న దిగుబడి, కొనుగోలు ప్రక్రియ ఎలా జరుగుతుంది, వరి కోత యంత్రం గంట సమయానికి ఎంత విస్తీర్ణంలో పంట కోత జరుగుతుంది. ఎంత డబ్బులు అవుతాయి వంటి వివరాలను రైతులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎఒ ఎండి తాజుద్దీన్, ఎఇఒలు మురళికృష్ణ, సాయికుమార్, శివకుమార్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### వ్యాపారవేత్తలుగా ఆలోచించాలి

స్వయం సహాయక సంఘాల మహిళలు వ్యాపారవేత్తలుగా ఆలోచన చేసి యూనిట్లను లాభదాయకం చేయడానికి చర్చించుకోవాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ తెలిపారు. సోమవారం తల్లాడ మండల కేంద్రంలో ఇందిరా మహిళా శక్తి క్రింద ఏర్పాటు చేసిన దేవహత్రేయ ఫ్యాన్సీ, జనరల్ స్టోర్‌ను కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ప్రారంభించారు. జనరల్ స్టోర్ నిర్వహకులు దేవసుధాని స్టోర్‌లో ఏమేమి వస్తువులు అందుబాటులో ఉంచారు. ఎంత రుణం తీసుకున్నారు, వ్యాపార అనుభవం తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ ప్రాంతంలో డిమాండ్ ఉన్న వస్తువులను విక్రయించాలని, వినియోగదారులకు అందుబాటులో ఉండేలా చూడాలని కలెక్టర్ సూచించారు. అనంతరం అంజనాపురం గ్రామాన్ని కలెక్టర్ సందర్శించి స్వయం సహాయక సంఘాల మహిళలతో మాట్లాడారు. వెదురుతో చాటలు, బుట్టలు, చేతి విసనకర్ర, అలంకరణ సామగ్రి తయారీని పరిశీలించారు. ఖమ్మం టిటిడిసి సమీపంలో డ్వాక్రా బజార్ త్వరలో ఏర్పాటు చేయనున్నట్లు ఇట్టి ఉత్పత్తులను డ్వాక్రా బజారులో నేరుగా విక్రయిస్తే లాభసాటిగా ఉంటుందని కలెక్టర్ తెలిపారు.

### మండల స్థాయిలోనే సమస్యలు పరిష్కారమవ్వాలి

మండల స్థాయిలో పరిష్కారమయ్యే సమస్యలు మండలాల్లోనే పరిష్కారమయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ తెలిపారు. కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తల్లాడ తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలను అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ చంద్రమౌళి, ఇంచార్జి తహసీల్దార్ వనజ పాల్గొన్నారు.

### యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అంబులెన్స్ వితరణ

**ఖమ్మం అర్బన్ :** యూనియన్ బ్యాంక్ సోషల్ ఫౌండేషన్ ద్వారా ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి అంబులెన్స్‌ను అందించారు. అంబులెన్స్‌ను ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల అత్యవసర సేవల కొరకు అంబులెన్స్‌ను అందజేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో బ్యాంక్ రీజినల్ మేనేజర్ హన్మంతరెడ్డి, ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ రాజేశ్వరరావు, సూపరింటెండెంట్ కిరణ్ కుమార్, బ్యాంక్ అధికారులు సర్వేష్, సుధాకర్‌రావు, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## వివాహ వేడుకకు హాజరైన ఎంఎల్ఎ

ప్రజాపక్షం/తాండూరు:కర్నాటక రాష్ట్రం యాద్గిర్ జిల్లాలోని ప్రముఖ స్వామి అప్పాజీ ముత్య సోదరుని వివాహ వేడుకలకు తాండూరు ఎంఎల్ఎ బుయ్యని మనోహర్‌రెడ్డి హాజరైన వధువరులను ఆశీర్వదించారు. సోమవారం జరిగిన యాద్గీర్ జిల్లాలోని మాల్ రోజలో స్వామి అప్పజీ ముత్య సోదరుడు పరుఉరామ్ ముత్య వివాహ్ వేడుకలకు తాండూరు ఎంఎల్ఎ బుయ్యని మనోహర్‌రెడ్డి హాజరైనారు.ఈ సందర్భంగా నూతన వధువరులను ఎంఎల్ఎ శుభాకాంక్షలు తెలియజేశారు. ఎంఎల్ఎ మనోహర్‌రెడ్డితో పాటు చేవెళ్ళ ఎంఎల్ఎ కాలే యాదయ్య, తాండూరుకు చెందిన పలువురు నేతలు హాజరైనారు.

# మహానగరి

## ప్రజావాణిలో 67 ఫిర్యాదులు

ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి: జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి పరిష్కారానికి తీసుకొని వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిశీలించి న్యాయం చేకూర్చాలని జిల్లా కలెక్టర్ గౌతం, జిల్లా అధికారి చంద్రావతి, ఇతర విభాగాల అధికారులతో కల్సి అర్జీలను స్వీకరించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో వచ్చిన 67 ఫిర్యాదులను స్వీకరించిన కలెక్టర్ అర్జీలను వెంటనే పరిష్కరిస్తూ, పూర్తి వివరాలను ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయటంతో పాటు వాటి వివరాలను సంబంధిత ఫిర్యాదస్తులకు తెలియచేయాలని, పరిష్కరించలేకపోతే కారణాలను సైతం తెలియచేయాలని అధికారులను ఆదేశించారు.

## ఏడాది వేడుకల్లో పాటలతో కళాయాత్ర

ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి: తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తైన సందర్భంగా జిల్లాలో కొనసాగునతున్న ప్రజా పాలనప్రజా విజయోత్సవాల్లో భాగంగా సోమవారం కళాయాత్ర జరిగింది. తెలంగాణా సాంస్కృతిక సారధి కళాకారుల బృందాలు జిల్లాలోని మూడు చింతలపల్లి మండలంలోని నాగిశెట్టిపల్లి, కేశవరం, కొల్తూరు గ్రామ పచాయతి ప్రాంతాలు, మేడ్చల్ మున్సిపాలిటి పరిధిలోని రాయిలాపూర్, మేడ్చల్, అద్వెల్లిప్రాంతాల్లో ప్రభుత్వ సంక్షేమ పథకాలపై పాటలతో ప్రచారం చేసారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



## ఎంఎల్ఆర్ఐటిఎమ్‌లో 'ఇ–సమ్మిట్'

ప్రజాపక్షం/దుండిగల్ : దుండిగల్ లోని మర్రి లక్ష్మణ రెడ్డి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్‌లో ఇ సమ్మిట్ కార్యక్రమాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిధిగా తెలంగాణ కాస్టూమర్ ఎఫైర్ ప్రిన్సిపాల్ సెక్రెటరీ డీఎస్ చౌహాన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సాంకేతికత, ఆవిష్కరణ, పారిశ్రామికతకు ఈ వేదిక విద్యార్థులు, పారిశ్రామిక నిపుణులికి ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమానికి ఎంఎల్ఆర్ఐటిఎమ్ డైరెక్టర్ డాక్టర్ పి.శ్రీధర్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. మురళీ ప్రసాద్, కన్వీనర్ డాక్టర్ జి.అమర్నాథ్ సమీక్ష నిర్వహించారు. విద్యార్థుల సంఘ అధ్యక్షులు మాధవ్, ప్రశాంత్, బ్రిగేడియర్ పి.గణేష్ తదితరులు పాల్గొన్నారు.



## క్రైస్తవ విశిష్ట సేవలకు సత్కారాలు... అర్హులు దరఖాస్తు చేసుకోవాలి

ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి : రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న క్రిస్మస్ వేడుకలు–2024 కార్యక్రమాల్లో భాగంగా వివిధ రంగాల్లో క్రైస్తవుల విశిష్ట సేవలకు గాను సత్కరించాలని నిర్ణయించిందని, దీనికిగాను ఆయా రంగాల్లో అర్హులైన అభ్యర్థులు ధరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనారిటీస్ సంక్షేమ శాఖాధికారి ఓ ప్రకటనలో తెలిపారు. సామాజిక సేవారంగం, వైద్య రంగం, విద్యారంగం, సాహిత్యం, కళలు, క్రీడా రంగాల్లో గత పదేళ్లుగా సేవ చేస్తూ 30 సంవత్సరాలు పైబడి వయస్సున్న అభ్యర్థులు అర్హులని తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు డిసెంబరు 5 లోగా అంతాయిపల్లి, శామీర్‌పేటలోని కలెక్టరేట్ కార్యాలయ ప్రాంగణంలో ఉన్న జిల్లా మైనారిటీస్ కార్యాలయంలో ధరఖాస్తులను అందచేయాలన్నారు. ధరఖాస్తు ఫారాలను www. tscmfc.in వెబ్‌సైట్ ద్వారా కానీ, తెలంగాణా రాష్ట్ర క్రైస్తవుల అల్ప సంఖ్యాక వర్గాల ఆర్థిక సహాయ సంస్థలో నేరుగా కానీ తీసుకోవచ్చని, మరే ఇతర వివరాల కోసం తమను 04023391067ను సంప్రదించవచ్చన్నారు.



## ప్రగతినగర్‌లో మానసాదేవి హోమం

### పాల్గొన్న సినీ హీరో సుమన్, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్

ప్రజాపక్షం/ నిజాంపేట్ : కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రగతినగర్‌లో మానసాదేవీ హోమం కార్యక్రమం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ప్రగతినగర్‌లోని పట్టాభి రామాంజనే య స్వామి ఆలయ ప్రాంగణంలో గౌరీ శంకర స్వామి ఆలయంలో కార్తిక మాసాన్ని పురస్కరించుకుని మానసా దేవీ హోమం కార్యక్రమం ఘనంగా జరిపారు. ఈ కార్యక్రమానికి సినీహీరో సుమన్, స్థానిక మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరి పై ఉండాలని, ప్రతిఒక్కరు సుఖఃసంతోషాలతో జీవించాలని వేడుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నర్సారెడ్డి భూపతిరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు సుధీర్ రెడ్డి, ధన్‌రాజ్ యాదవ్, వెంకట్ రెడ్డి, రంగారెడ్డి, రాములు, రవీందర్, తులసీదాస్, ఉమా, జయ, వెంకటేశ్వరమ్మలు పాల్గొన్నారు.

## షాపుకెళ్లిన బాలిక మిస్సింగ్...

ప్రజాపక్షం/తాండూరు:షాపుకు వెళ్ళిన బాలిక తిరిగి ఇంటికి చేరుకోని ఘటన తాండూరు మండల పరిధి కరణ్‌కోట్ గ్రామంలో చోటు చేసుకుంది. ఆలస్యంగా వెలుగు లోకి వచ్చిన ఈ ఘటన వికారాబాద్ జిల్లా తాండూరు మండల పరిధి కరణ్‌కోట్ గ్రామానికి చెందిన లక్క బాలమ్మ మనువరాలు స్వాతి(9) అనే విద్యార్థిని జెడ్‌పిహెచ్ఎస్ కరణ్‌కోట్ పాఠశాలలో 4వ తరగతి చదువుతుంది. శుక్రవారం సాయంత్రం సమయంలో ఉప్పు ప్యాకెట్ కోసమని కిరాణ్ షాపుకు వెళ్ళిన స్వాతి తిరిగి ఇంటికి రాలేదని వారు ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు.కుటుంబ సభ్యులు చుట్టు పక్కల వెతికిన ఫలితం లేదని వారు వాపోయ్యారు. మరికొందరు సమాచారం మేరకు గుర్తు తెలియని వ్యక్తులు బాలికను బైక్‌పై తీసుకెళ్ళారని సమాచారం అందించినప్పటికి ఆచూకి లభించలేదు. దీంతో బాలిక మిస్సింగ్ విషయమై కరణ్‌కోట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టామని తెలిపారు.



### ఫుడ్‌పాయిజన్ ఉదంతాల నేపథ్యంలో

# యంత్రాంగం అలర్ట్

### మేడ్చల్ జిల్లా హాస్టళ్లు, విద్యాసంస్థల్లో అధికారుల తనిఖీలు

ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి: ఇటీవల రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ హాస్టళ్లు, విద్యాసంస్థల్లో చోటు చేసుకొన్న ఫుడ్ పాయిజన్ ఉదంతాల నేపథ్యంలో మేడ్చల్ జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ ఉదంతాలను సీరియస్‌గా తీసుకొని ఇలాంటి సంఘటనలు మరెక్కడా పునరావృతం అయితే కఠినంగా వ్యవహరిస్తామంటూ హెచ్చరించారు. మరో పక్క అధికారులు ఈ విషయంలో పకడ్బందీ ఏర్పాట్లు చేయటంతో పాటు తరచు జిల్లా అధికారులు క్షేత్ర స్థాయిలో తనిఖీలు చేయాలంటూ ఝూర్ఖండ్ రాష్ట్ర పర్యటన చేస్తున్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అక్కడి నుండే నేరుగా రాష్ట్రంలోని జిల్లా కలెక్టర్లలతో ఆదివారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆదేశాలు జారీ చేసారు. ఈ క్రమంలో మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతం ఆదేశాలతో అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి ఆదివారం కీసర మండలంలోని ప్రభుత్వ బిసి, ఎస్సీ, ఎస్టీ రెసిడెన్షియల్ వెల్ఫేర్ హాస్టళ్లు, సోమవారం ఘట్‌కేసర్ మండలంలోని ప్రభుత్వ బిసి కాలేజి బాలుర హాస్టల్, బాలికల హాస్టల్, ప్రభుత్వ గిరిజన బాలికల పోస్ట్ మెట్రిక్ హాస్టల్, మేడిపల్లి మండలంలోని మహాత్మా జ్యోతిబా పూలే బిసి వెల్ఫేర్ బాలుర రెసిడెన్షియల్, టిఎంఆర్ఎస్ మల్కాజిగిరి బాలికల పాఠశాలలను ఆకస్మిక తనిఖీలు చేసారు. నేరుగా ఆయన వంట గదులు, వంట సామగ్రి, కూరగాయలు, వంటకు వినియోగించే నూనె, పప్పు దినుసులు తదితర సామగ్రి ఏ పరిస్థితుల్లో ఉన్నాయన్న విషయాలను చూసా రు. వంటశాలల్లో వంట చేస్తున్న తీరు, అక్కడి పారిశుద్యం, వంట పదార్థాలకు వినియోగించే గిన్నెలు, గరిటెలు శుభ్రం గా ఉంటున్నాయా లేదా అని చూసిన అదనపు కలెక్టర్ విద్యార్థులకు వడ్డించే స్థలా ల్లో పరిస్థితులు, వడ్డించే తీరును చూడటంతో పాటు విద్యార్థులతో కల్సి వారి కోసం చేసిన వంట పదార్థాలను తిని చూసారు.







విద్యార్థినీ విద్యార్థులను ప్రతిరోజూ వంట పదార్థాలు వేడి గా, రుచిగా, పరిశుభ్రంగా ఉంటున్నాయా లేదా, కడుపునిండా పెడుతున్నారా లేదా అని అడిగి తెలుసుకొంటున్నారు. విద్యార్థులకు భోజనం వడ్డించే విషయంలో ఎక్కడా ఎలాంటి పొరపాట్లు చోటు చేసుకొన్నా కఠినంగా వ్యవహరిస్తామని, హాస్టళ్లల్లో వార్డెన్లు ఉదయం, రాత్రి వేళల్లో, పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు విద్యార్థులకు అందిం చే మధ్యాహ్న భోజనాన్ని ముందుగా తిని చూసి వడ్డించాలని, ఎలాంటి పొరపాట్లు జరిగినా వారే బాధ్యులన్న విషయం మరువద్దని హెచ్చరించారు. ఆయన వెంట జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి వినోద్‌కుమార్ సైతం తనిఖీల్లో పాల్గొన్నారు.

## జిహెచ్ఎంసి మల్కాజిగిరి సర్కిల్ అధికారులపై చర్యలు : కార్పొరేటర్ల ఫిర్యాదు

ప్రజాపక్షం/మల్కాజిగిరి : జిహెచ్ఎంసి మల్కాజిగిరి సర్కిల్ అధికారులు కనీసం పాటించాల్సిన ప్రొటోకాల్ నిబంధనలను ఏ మాత్రం పాటించటం లేదంటూ నియోజకవర్గంలోని కార్పొరేటర్లు గ్రేటర్ మేయర్ విజయలక్ష్మి కి ఫిర్యాదు చేసారు. సోమవారం నియోజకవర్గానికి చెందిన కార్పొరేటర్లు మేకల సునీతా రాము యాదవ్, మీనా ఉపేందర్ రెడ్డి, సబితా కిషోర్, శాంతి శ్రీనివాసరెడ్డిలు మేయర్‌ను జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో కలిసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మల్కాజిగిరి నియోజకవర్గంలో ప్రభుత్వ నిధులతో చేపట్టే ప్రతి అభివృద్ధి పని ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో ప్రొటోకాల్‌కు విరుద్ధంగా సర్కిల్ కార్యాలయ అధికారులు వ్యవహరిస్తున్నారని, అధికార పార్టీ ప్రతినిధులకు తొత్తులుగా ఉంటూ వారు చెప్పినట్లే నిబంధనలకు విరుద్ధంగా చేస్తున్నారన్నారు. ఇలా వ్యవహరించే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలంటూ మేయర్‌ను కోరారు.




## 27న అల్వాల్ ప్రభుత్వ ఐటిఐలో జాబ్‌మేళా

ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి: జిల్లా ఉపాధి కల్పన కార్యాలయ ఆధ్వర్యంలో బుధవారం (27వ తేది) ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు లోతుకుంటలోని ఆల్వాల్ ప్రభుత్వ ఐటిఐ సంస్థలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని జిల్లా ఉపాధి కల్పనాధికారి ఎం.రాధిక తెలిపారు. అపోలో ఫార్మసీలో డి.ఫార్మా, బి.ఫార్మా, ఎంఫార్మా చేసిన వారికి నెలవారీ రూ.16,300 నుండి రూ.25వేల వరకు ఫార్మసిస్టులుగా, అదే విద్యార్హతలున్న వారికి నెలవారీ రూ.14,800 నుండి రూ. 20వేల వరకు ట్రైనీ ఫార్మసిస్టులుగా, ఎస్ఎస్‌సి, ఇంటర్, డిగ్రీ విద్యార్హతలున్న వారికి రూ.14,700 నుండి రూ. 20 వేల వరకుఫార్మసీ అసిస్టెంట్‌లుగా నియామకాలు చేస్తారని తెలిపారు. ఆసక్తి, అర్హత ఉన్న అభ్యర్థులు www.nic/gov/in ద్వారా రిజిస్టర్ చేసుకోవాలని, మరిన్ని వివరాలకుగాను 9866465024, 7386809422 ల ద్వారా సంప్రదించవచ్చన్నారు.

## కుంటలను చెరబడుతున్న త్రిపుర నిర్మాణ సంస్థ... అధికారుల చోద్యం

ప్రజాపక్షం/దుండిగల్ : దుండిగల్ గండి మైసమ్మ మండల పరిధిలో కుంటలు, చెరువులు కబ్జాలు గురవుతున్న ఉన్నత అధికారులు చోద్యం చూస్తున్నారు ఇటీవల బోరంపేట్ పరిధిలోనీ చెరువులు, కుంటల భూములే లక్ష్యంగా చేసుకొని త్రిపుర ల్యాండ్ మార్క్ నిర్మాణాలను కొనసాగిస్తుంది. ఎఫ్టిఎల్, బఫర్ జోన్ల ఉన్న భూముల తో త్రిపుర ల్యాండ్ మార్క్5 పేరిట విల్లాలు నిర్మిస్తున్నారు. ఈ ప్రాజెక్టులో కోట్లకుపైగా విలువైన చెరువులు, కుంటల భూములు కబ్జా చేసినట్టు ఆరోపణలతో రెవె న్యూ, ఇరిగేషన్, ఉన్నతాధికారులు ల్యాండ్ మార్క్ నిర్మాణాలను పరిశీలించారు. నిర్మాణదారులు సమీపంలోని చెరువుల పరిధిలో ఉన్న ఎఫ్టిఎల్, బఫర్ జోన్ ప్రాంతాలను సైతం కలిపేసుకుంటూ నిర్మాణాలు చేపడుతున్నారని ఆరోపణలు ఉన్నాయి. సర్వే నంబర్ 181, 182, 199 లో ఆరున్నర ఎకరాలకు పైగా విస్తీర్ణంలో పడగే సముద్రం కుంట ఉంది. 90 శాతం చెరువు సర్వే నంబర్ 181లోనే విస్తరించి ఉండగా, మిగిలింది 182, 199 సర్వే నంబర్లలో బఫర్ జోన్ ప్రాంతాలున్నాయి. అయితే ఈ చెరువుకు ఆనుకొని సర్వే నంబర్ 183 ఉండగా, త్రిపుర ల్యాండ్ మార్క్ 5 నిర్మాణాల కోసం ఈ సర్వే నంబర్లో అను మతులు తీసుకుంది. పక్కనే ఉన్న చెరువు, సర్వే నంబర్ 181 పడగే సముద్రం ఎఫ్టిఎల్ బఫర్ జోన్ ప్రాంతాలను కలుపుకుంటూ త్రిపుర ల్యాండ్ మార్క్ 5 పేరుతో విల్లాలు నిర్మిస్తున్నారు. బోరంపేట గ్రామ రెవెన్యూ పరిధిలోని మొండికుంట చెరువు ఎఫ్టీఎల్, బఫర్ జోన్ ప్రాంతాలను సైతం త్రిపుర ల్యాండ్ మార్క్ ఆక్ర మించుకున్నదనీ, ఈ ప్రాజెక్టుకు వెనుక వైపుగా వచ్చే ఏరియాలో సుమారు పదిహేను వందల గజాల చెరువు ల్యాండ్ ఎల్టీఎల్, బఫర్ ప్రాంతంలోకి వస్తున్నట్లు రికార్డుల్లో స్పష్టంగా కనిపిస్తున్న నిర్మాణాలు చేపడుతున్నారు. చెరువుల అన్యాక్రాంతంపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధికారులతో సమావేశం నిర్వహించారు. ఇందులో అధికారులు ఇచ్చిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ లో దొమ్మర పోచంపల్లి, గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 188లో ఎకరం విస్తీర్ణంలో వాటర్ బాడీ ఉండేదని స్పష్టం చేశారు. ఎకరం ఒక గుంట విస్తీర్ణంలో ఉన్న ఈ వాటర్ బాడీ 2014కు ముందు అన్యాక్రాంతానికి గురి కాలేదని, 2023లో 43 శాతం కబ్జాకు గురైనట్లు స్పష్టం చేశారు. సమీక్షలో అధికారులు పేర్కొన్న ప్రాంతంలోనే ఇప్పుడు త్రిపుర ల్యాండ్ మార్క్ 5 పేరిట విల్లాలు నిర్మిస్తున్నా రు. 41 గుంటల విస్తీర్ణంలో ఉన్న ఈ వాటర్ బాడీ ప్రస్తుతం త్రిపుర ల్యాండ్ మార్క్ ఆధీనంలోనె ఉంది.అదేవిధంగా డిపోచంపల్లి లో స్మశాన వాటిక వెళ్లేదారిలో ప్రభుత్వ భూమి లో ఇటీవల అక్రమంగా విల్లాల కోసం అప్రో చ్ రోడ్డు త్రిపుర ల్యాండ్ మార్క్ సంస్థ వారు అనుమతులు లేకుండా సిసి రోడ్డు నిర్మించారు. వెంటనే అప్రమత్తమైన దుండిగల్ మున్సిపల్ రెవెన్యూ అధికారులు ప్రభుత్వ స్థలంలో నిబంధనలకు విరుద్ధంగా రోడ్లు వేశారని కూల్చివేతలు చేపట్టారు.







**హైడ్రా ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలి**

కుంటలు, చెరువులు, నాలాలు కబ్జాలకు పాల్పడితే చర్యలు చేపడుతున్న హైడ్రా అధికారులు బౌరంపేట్ ల్యాండ్ మార్క్ నిర్మాణ సంస్థ పై చర్యలు చేపట్టాలని ఎఫ్టఎల్ఎల్, బఫర్ జోన్ నిర్మాణాలపై తక్షణమే హైడ్రా కమీషనర్ ఏ.వి రంగనాథ్ చర్యలు తీసుకోవాలని, అన్యాక్రాంతం అవుతున్న భూములను కాపాడాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

## సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే డేటా ఎంట్రీని వేగవంతం చేయాలి : ప్రతీక్‌జైన్

ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధిః వికారాబాద్ జిల్లా వ్యాప్తంగా సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే డాటా ఎంట్రీని వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ అధికారులకు సూచించారు. సోమవారం నాడు వికారాబాద్ మున్సిపల్ ,వికారాబాద్ ఎంపిడీఓ కార్యాలయంలో డాటా ఎంట్రీకి సంబంధించిన ఆపరేటర్లను అధికాంగా నియమించుకొని డాటా ఎంట్రీకి అదనంగా కాలెక్టర్ కార్యాలయం నుంఇ కంప్యూటర్లును పోందలని కలెక్టర్ తెలిపారు. డాటా ఎంట్రీ ప్రక్రియ ఒకే గదిలో నిర్వహించే విధంగా ఏర్పాట్లు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్‌ను కలెక్టర్ అదేశించారు. వికారాబాద్ కస్తూరిబా గాంధీ బాలికల విద్యాయాన్ని సందర్శించి వంటగది , భోజన వాలలో విద్యార్థినిలకు విడ్డించే భోజనాన్ని కలెక్టర్ పరిశీలించారు. వికారాబాద్ జిల్లా లోని 1007 ప్రభుత్వ స్థానిక సంస్థల ,ఆదర్శ పాఠశాలల పరిశుద్య కార్యక్రమలకు మూడు నేలలకు గాను రూ.1,68,93,000 నిధులు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఖాతాల్లో జమ చేయడం జరిగింది అని కలెక్టర్ ఒక ప్రకటనలో తెలియజేశారు.



**ప్రజావాణి దరఖాస్తులు సకాలంలో పరిష్కరించాలి :** వికారాబాద్ కలెక్టర్ కార్యాలయంలో ప్రజావాణి కార్యాలయంలో ప్రజావాణికి వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదులను జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ ,సుధీర్ , ఉమహారతితో కలసి అర్జీలను స్వీకరించారు. ప్రజావాణికి మొత్తం 113 దరఖాస్తులు రాగా వివిధ శాఖలకు చెందిన అర్జీలను సంబంధిత శాఖ అధికారులకు పంపించి పరిష్కరించాలని అధికారులకు అదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఓ వాసు చంద్ర ,జిల్లా అధికారులు పాల్గోన్నారు.

## విద్యార్థులు ప్రతీ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి

### ఎల్టీఐ మైండ్ ట్రి అధ్యక్షులు సుధీర్ చతుర్వేది

ప్రజాపక్షం/ నిజాంపేట్ : విద్యార్థులు ప్రపంచంలో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఎల్టీఐ మైండ్‌ట్రీ అధ్యక్షులు సుధీర్ చతుర్వేది అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని బాచుపల్లి విజ్ఞాన జ్యోతి ఇన్స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (వీజేఐఎం)30వ స్నాతకోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎల్టీఐ మైండ్‌ట్రీ అధ్యక్షులు సుధీర్ చతుర్వేది జ్యోతి ప్రజ్వళన గావించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భౌగోళిక, వాతావర ణ, జనాభా, శక్తి సంక్షోభంలో ఉన్నామని, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత మార్పులను ఎదుర్కొంటున్నామని వివరించారు. ప్రతి సంక్షోభం ఒక ప్రమాదాన్ని, ఒక అవకాశాన్ని అందిస్తుందని తెలిపారు. ఈ అవకాశాలను అందిపుచ్చుకోవడం సులభంకాదని అన్నారు. దీనికోసం పోరాడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ అవకాశాలను చేజిక్కించుకోవడానికి కొన్ని విషయాలలో జాగ్రత్తగా నడుచుకోవాలని, ఉత్సుకతతో ఉంలని చెప్పారు. మనలోని ప్రత్యేకతను తెలుసుకోవాలని, దానిని సమర్థవంతంగా ఉపయోగించుకోవాలని పేర్కొన్నారు. ధైర్యంగా, శక్తివంతంగా ఉం టూ పాజిటీవ్ దృక్పథంతో ముందుకువెళ్లాలని సూచించారు. శాంతిదూతగా ప్రతిఒక్కరు పేరు తెచ్చుకోవాలని అన్నారు. విజ్ఞాన జ్యోతి ఇన్స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ డైరెక్టర్ ప్రొఫెసర్ భరత్ భూషణ్ సింగ్ మాట్లాడుతూ నాణ్యత, నిజాయితీ విజ్ఞాన ఇన్స్టిట్యూట్ ప్రధాన విలువలని, ఈ విలువలను కొనసాగించడానికి నిబద్ధతతో ఉన్నామని చెప్పారు. ఏషియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, థాయ్‌లాండ్, హార్వర్డ్ బిజినెస్ పబ్లికేషన్‌తో విద్యాపరమైన సహకారాలు ఉన్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో విజ్ఞాన జ్యోతి వైస్ ప్రెసిడెంట్ వీ.రాజశేఖర్, జనరల్ సెక్రటరీ కోడె దుర్గా ప్రసాద్, ఇన్స్టిట్యూట్ చైర్మన్ కే.హరిశ్చంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.



## 'కడ' వెంకట్‌రెడ్డిని విచారించిన జాతీయ మానవ హక్కుల కమిషన్

ప్రజాపక్షం / కొడంగల్ః ఈ నెల 11వ తేదిన జరిగిన కలెక్టర్‌ల దాడి ఘటనపై కొడంగల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటి (కడ) వెంకట్‌రెడ్డిని సోమవారం కడ కార్యాలయంలో దాదాపు 2 గంటల పాటు జాతీయ మానవ హక్కుల కమిషన్ డిప్యూటి రిజిస్ట్రార్ ముఖేష్ తన బృందంతో కలిసి విచారణ చేపట్టారు. తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం లగచర్ల గ్రామంలో ఫార్మ సిటి అంటు గెజిట్ విడుదల చేయడంతో అక్కడ భూసేకరణ ఏ విధంగా చేస్తున్నారు, ప్రజలకు ఎలాంటి అవగాహన కల్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు, భూ సేకరణపై ఎలాంటి నిబంధనలు అమలు చేస్తున్నారో అలు కీలక అంశాలపై చర్చించారు. అనంతరం ఆ రోజు ఉదయం దాడి జరిగిన ఘటనపై ఆరా తీశారు. దాడి ఘటనకు ముందు రైతులు మీ వద్దకు ఎలాంటి పిర్యాదులు తీసుకువచ్చారు. వచ్చిన పిర్యాదులను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారానికి ఎలాంటి కృషి చేశారో అనే కోణంలో వెంకట్‌రెడ్డిని విచారించినట్లు విశ్వసనీయ సమాచారం. దీంతో పాటు పోలీసువర్గాలను కూడా సమగ్ర విచారణ చేసినట్లు తెలుస్తోంది. విచారణ చేపట్టిన వారిలో ఇన్స్పెక్టర్ యోతిప్రకాశ్ శర్మ, ఇన్‌స్పెక్టర్ రోహిత్‌లతో పాటు ఆయా శాఖల అధికారులు, పోలీసులు సిబ్బంది తదితరులున్నారు.



**అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి : కడ వెంకట్‌రెడ్డి**

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోంత నియోజకవర్గంలో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని కొడంగల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటి(కడ) అధికారి వెంకట్‌రెడ్డి అన్నారు. సోమవారం కడ కార్యాలయంలో వారు మాట్లాడుతు దాడి జరిగిన ఘటన తీవ్ర మనోవేదనతో పాటు గాయాలు కూడా కావడం జరిగిందని ఇది సరైన పద్ధతి కాదంటు అవేదన వ్యక్తం చేశారు. తీవ్రగాయాలతో కార్యాలయానికి వచ్చిన అధికారిని పరామర్శించేందుకు నియోజకవర్గ ప్రజలు భారీగా తరలిరావడంతో వారందరిని కలిసి మనోధైర్యాన్ని కల్పించారు. నేటి నుంచి యాదావిధిగా విధులకు హజరుఅవుతానని ఇక అభివృద్ధి విషయంలో రాజీపడాల్సిన అవసరం లేదన్నారు. ఇప్పటి వరకు టెండర్లు పూర్తి అయిన వాటిలో పురోగతిని తీసుకురావాల్సిన అవసరం ఎంతైన ఉందన్నారు. నన్ను కలిసేందుకు హైద్రాబాద్ వరకు ఎవ్వరు రావద్దని నేనే మీ దగ్గరకు వస్తానంటు ప్రజల అభిమానం ఆత్మీయత ఉన్నన్ని రోజులు మీ తో నే ఉంటానని సంచలన వాఖ్యాలు చేశారు.



## భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకల్లో వికారాబాద్ ఎస్‌సిసెల్ జిల్లా అధ్యక్షులు కోటపల్లి రాజు

ప్రజాపక్షం/బంట్వారం : నేడు భారత రాజ్యాంగ దినోత్సవం పురస్కరించుకొని న్యూఢిల్లీలో ప్రతి సంవత్సరం నవంబర్ 26 న రాజ్యాంగ దినోత్సవ వేడుకలు జరుపుకుంటారు. అట్టి కార్యక్రమం ఎఐసిసి ఎస్సీ సెల్ అధ్యక్షులు రాజేష్ లిలోటియా గారి ఆధ్వర్యంలో నిర్వహించే రాజ్యాంగ దినోత్సవాన్ని విజయవంతం చేసేందు కు, తెలంగాణ ఎస్సీ సెల్ చెర్మన్ ప్రీతం రాజు నాయకత్వంలో నేడు జరుగబోయే కార్యక్రమానికి వికారాబాద్ జిల్లా అధ్యక్షులు కోటపల్లి రాజు, మెద్చల్ జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్, రంగారెడ్డి జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ , వికారాబాద్ జిల్లా ఎస్సీ సెల్ ఉపధ్యక్షులు బుగ్గప్ప , ముఖ్య నాయకులు న్యూఢిల్లీ వెళ్ళారు.



## సర్వే పూర్తికి సహకరించండి

**ప్రజాపక్షం/కేశంపేట :** కేశంపేట మండలంలోని గ్రామాల కుటుంబాలు ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే పూర్తికి సహకరించి, ఈనెల 26 లోగా చేయించుకోవాలని ఎంపిడిఒ రవిచంద్రకుమార్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో కోరారు. మండలంలో ఇప్పటికే 97 శాతం సమగ్ర కుటుంబ సర్వే పూర్తైందని, సర్వే సమయంలో అందుబాటులో లేక మిగిలిన కుటుంబాలు మంగళవారంలోగా ఎన్యూమరేటర్ల ద్వారా సర్వేను పూర్తి చేయించుకోవాలని కోరారు. ఏమైనా సందేహాలు ఉన్న కుటుంబాలు హెల్ప్ లైన్ నెంబర్లకు 9160389309 (మండల స్టాటిస్టికల్ అధికారి) మరియు 8125209849 (మండల పంచాయితి అధికారి) ఫోన్ చేయాలని ఆయన కోరారు.

# మహానగరి

## నేడు పార్టీల ప్రతినిధులతో సమావేశం

**ప్రజాపక్షం/కొందుర్గు:** మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలోని సమావేశపు మందిరంలో మంగళవారం అన్ని రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించడం జరుగుతుందని ఎంపిడిఒ అనురాధ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ఎన్నికల సంఘం గత నెల 28న అన్ని గ్రామ పంచాయితీల వార్డుల వారీగా ఓటరు లిస్టులను విడుదల చేసి ప్రకటించారని, అందులో భాగంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా సమావేశాన్ని నిర్వహించడం జరుగుతుందని, ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులకు సమావేశానికి మండలంలోని అన్ని పార్టీల నాయకులు హాజరు కావాలని ఎంపిడిఒ ఆ ప్రకటనలో కోరారు.

## మల్లికార్జున భక్త సమాజ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్:** శివ దీక్ష మాధారణ స్వాములతో పాటు ప్రజలకు ఉచితంగా మల్లికార్జున భక్త సమాజం ఆధ్వర్యంలో సోమవారం బిఎన్ రెడ్డి నగర్ డివిజన్‌లోని శివాలయంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీమల్లికార్జున భక్త సమాజం అధ్యక్షులు ముద్దగౌని సతీష్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ శివ స్వాములకు ప్రతి సంవత్సరం ఉచిత మాలధారణతో పాటు ఉచిత సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. కొనేళ్లుగా మల్లికార్జున భక్త సమాజం ఆధ్వర్యంలో అనేక ఉచిత సేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. మాలధరణ స్వాములకు ఉన్నంత రోజులుగా అన్నదాన కార్యక్రమం చేపడుతున్నామన్నారు. స్వాములకు ఉచితంగా వస్త్రాలు, మాలలు, భోజనం, వసతి కార్యక్రమాలు సమకూరుస్తున్నార న్నారు. కార్యక్రమంలో శివ స్వాములు ప్రవీణ్, నిఖిల్, సంజయ్, సురేష్, హర్షిత్, అంజనేయులు, సైదులు, వెంకటరావు, అంజి పాల్గొన్నారు.

## నాణ్యమైన సేవలతోనే గుర్తింపు




**ప్రజాపక్షం/షాబాద్ :** కల్తీ లేకుండా నాణ్యమైన ఆహారం అందించేందుకు కృషి చేయాలని చేవెళ్ల నియోజకవర్గ ఇంచార్జ్ పామెన భీంభరత్ అన్నారు. సోమవారం చేవెళ్ల మండల పరిధిలోని దామరగిద్ద చౌరస్తాలో ఎం.కే రెస్టారెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఉపాధి కోసం ఇతర రాష్టల నుండి మన రాష్టానికి వస్తున్న ప్రయాణికులు, మన రాష్టం నుండి ఇతర రాష్టాలకు వెళుతున్న ప్రయాణికులకు సరైన సమయంలో నాణ్యమైన ఆహారం అందించాలని తెలిపారు. ప్రజలకు మంచి ఆహారం అందించినప్పుడే రెస్టారెంట్ అభివృద్ధి చెందుతుందన్నారు. వ్యాపారం కోసం రెస్టారెంట్ కాకుండ ప్రజల ఆరోగ్యం పై దృష్టి పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మద్దెల శ్రీనివాస్, ప్రసాద్, రెస్టారెంట్ నిర్వహకులు తదితరులు ఉన్నారు.

## 27న భక్త ఐక్యవేదిక సమావేశం

**ప్రజాపక్షం/సరూర్ నగర్:** నాగోల్ లోని దేవకి కన్వెన్షన్ హాల్ లో ఈ నెల 27న జరిగే షిరిడీ సాయి భక్త ఐక్యవేదిక సమావేశాన్ని జయప్రదం చేయాలని దిల్ షుఖ్ నగర్ సాయిబాబా దేవాలయ మాజీ చైర్మన్ గుండ మల్లయ్య పిలుపునిచ్చారు. సోమవారం చింతపల్లి సాయి సన్నిధి చైర్మన్ మంచికంటి ధనుంజయ, డిడి కాలనీ, బాగ్ అంబర్ పేట్ సాయిబాబా గుడి సెక్రటరీ పి.వి.సాయి తో కలిసి ఆయన మాట్లాడుతూ శ్రీ షిరిడీ సాయిబాబా పై గత కొద్దికాలంగా సోషల్ మీడియాలో జరుగుతు న్న అసత్య ప్రచారాలను తిప్పికొట్టేందుకు బుధవారం నాగోల్ లోని "దేవకి కన్వెన్షన్ హాల్" లో షిరిడీ సాయి భక్త ఐక్యవేదిక" ఆధ్వర్యంలో తెలంగాణలోని అన్ని షిరిడీ సాయి మందిరాల నిర్వాహకుల సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశానికి తెలంగాణాలోని అన్ని షిరిడీ సాయి మందిర నిర్వాహకులు హాజరు కావాలని కోరారు. వివరాలకు 8885003535కు ఫోన్ చేయాలని ఆయన వెల్లడించారు.

## ఎంఆర్‌పిఎస్ మండల అధ్యక్షుడిగా ఆనంద్



**ప్రజాపక్షం/కొందుర్గు:** ఎంఆర్‌పిఎస్ కొందుర్గు మండల నూతన అధ్యక్షుడిగా అనేగళ్ల ఆనంద్‌ను సోమవారం ఏకగ్రీవంగా ఎన్నిక చేసినట్లు ఎంఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు పి నరసింహ తెలిపారు. ఉపాధ్యక్షులుగా కె వెంకటేశ్, సాయిలు, బాలయ్య, ప్రధాన కార్యదర్శిగా రమేష్, కార్యదర్శులుగా బి నరసింహులు, బాలాంజనేయులు, సిబి చంద్రయ్య, కె శ్రీను, బి శేఖర్, ఆర్గనైజ్ సెక్రటరిగా ఎ నరసింహ, చింతకింది సిద్ధు, ప్రచార కార్యదర్శిగా పి కృష్ణ, వి సుదర్శన్, ఎ యాదయ్య, అధికార ప్రతినిధిగా దుర్గని శ్రీను, సలహాదారులుగా మీరాపురం వెంకటయ్య, గూడెం చెన్నయ్యలను ఏకగ్రీవంగా ఎన్నిక చేసినట్లు ఆయన వివరించారు. కార్యక్రమంలో కె అంజనేయులు, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

## వాంకిడి విద్యార్థిని కుటుంబానికి రూ.50లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి

### మాజీ మంత్రి హరీశ్‌రావు డిమాండ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** నిమ్స్ ఆస్పత్రిలో మృతి చెందిన వాంకిడి గురుకుల విద్యార్థిని శైలజ కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం రూ. 50 లక్షల ఎక్స్‌గ్రేషియాను చెల్లించాలని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిర్లక్ష్యం గిరిజన బిడ్డకు శాపంగా మారిందని, ఆ విద్యార్థి తల్లిదండ్రులకు తీరని శోకాన్ని మిగిల్చిందని ఆయన సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 25 రోజులుగా గురుకుల విద్యార్థి వెంటిలేటర్‌పైన అనుభవించిన నరకానికి ప్రభుత్వమే జవాబుదారీ అని చెప్పారు.

### అధికారుల నిర్లక్ష్యంతోనే శైలజ మృతి : పిడిఎస్‌యు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండల కేంద్రంలోని ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న 9వ తరగతి విద్యార్థిని చౌదరి శైలజ ఫుడ్ పాయిజన్ కారణంగా నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిందని, ఇందుకు అధికారుల నిర్లక్ష్యమే కారణమని పిడిఎస్‌యూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆవుల నాగరాజు, ఎ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. శైలజ లాంటి విద్యార్థులు కనీస సౌకర్యాలు అందక హాస్టల్లో మరణించడం బాధాకరమన్నారు. చనిపోయిన విద్యార్థిని శైలజ కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియోతో పాటు ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని ఎస్‌సి, ఎస్‌టి, బిసి మైనార్టీ హాస్టళ్ళల్లో నెలకొన్న దుస్థితిని విద్యార్థిని శైలజ మరణం తెలియపరుస్తున్నదని, ఇకనైనా సరైన చర్యలు తీసుకోవాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## ప్రజావాణిలో 52 దరఖాస్తులు

### రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి



**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి :** ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సకాలంలో పరిష్కరించాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశం మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ సమస్యలపై 52 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. వీటిలో రెవెన్యూ శాఖకు వచ్చిన దరఖాస్తులు 42 కాగా మిగతా పది దరఖాస్తులు వివిధ శాఖలపై అర్జీలు అందజేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులు త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. అనంతరం జరిగిన జిల్లా అధికారులతో సమన్వయ సమావేశం కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సిఎం ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను వారంలోగా పరిష్కరించేలా చూడాలని, డిసెంబర్ 9న దీనిపై సమీక్ష ఉంటుందన్నారు. సమగ్ర కుటుంబ సర్వే డాటాను ఆన్లైన్‌లో ఆప్‌లోడ్ చేసేటప్పుడు ఎవరైతే ఎన్యూమారేటర్లు సర్వేచేశారో వారి దగ్గర ఉండి ఎలాంటి తప్పులు దొర్లకుండా సరైన సమాచారాన్ని ఆన్లైన్ చేయాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాలలో సమగ్ర సర్వే డాటా ఎంట్రీని ఈనెల 30 వరకు పూర్తి చేయాలని తెలిపారు. డాటా ఎంట్రీని ఎక్స్ పర్ట్ టీమ్ చెక్ చేసిన పిదపనే ఆన్లైన్ చేయాలని స్పష్టం చేశారు.

**పాఠశాలలో ఫుడ్ సేఫ్టీ కమిటీలు...**మధ్యాహ్నం భోజన పథకం, వసతి గృహాల్లో విద్యార్థులకు అందిస్తున్న ఫలహారం, భోజనం ఇతర సౌకర్యాలను అధికారులు పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. పర్యవేక్షణకు జిల్లా, మండల స్థాయిలో హాస్టల్స్, పాఠశాలలో ఫుడ్ సేఫ్టీ కమిటీని నియమించాలని, జిల్లా స్థాయి కమిటీలో డిఇఒ, జిల్లా పౌరసరఫరాల అధికారి, డిఎంసిఎస్ కమిటీలోఉంటారని, అలాగే మండల స్థాయిలో ఎంపిడిఒ చైర్మన్‌గా ఇద్దరు సభ్యులు ఉంటారని, మున్సిపల్ లెవెల్లో కూడా ఫుడ్ సేఫ్టీ కమిటీలు ఉంటాయని కలెక్టర్ తెలిపారు. ప్రతి హాస్టల్, పాఠశాలలో జిల్లాలో ఎక్కడ ఏ వసతి గృహాలలోనైనా భోజనంలో నిర్లక్ష్యం వహిస్తే వారిపై చర్యలు తప్పనివని కలెక్టర్ హెచ్చరించారు. ఇటీవల తాము తనిఖీ చేసిన వసతిగృహాల్లో వంటసామాగ్రి నేలపై ఉన్నాయని, వాటి భద్రతను ప్లాస్టిక్ డబ్బాలు, పై ఉంచే విధంగా కొత్త సామగ్రిని అందజేయడం జరుగుతుందని, వీటి కొనుగోలుకు దాతల ద్వారా విరాళాలు సేకరించాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. హాస్టల్స్, కస్తూరిబా వసతి గృహాలు, పాఠశాల నిర్వహణలో మార్పు తీసుకురావాలని, దీనికి అధికారులు తోడ్పాటు అందించాలని జిల్లా కలెక్టర్ కోరారు. ఆయా కమిటీలు వారంలో ఏర్పాటు చేయాలని, అధికారులను ఆదేశించారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్,జిల్లా రెవెన్యూ అధికారి సంగీత,వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్యసాధనకు వైకల్యం అడ్డుకాదు

### రంగారెడ్డి జిల్లా సంక్షేమ శాఖ అధికారి సంధ్యారాణి

**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి :** వైకల్యం లక్ష్య సాధనకు అడ్డుకాదని జిల్లా సంక్షేమ శాఖ అధికారి సంధ్యారాణి అన్నారు. సోమవారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని దివ్యాంగుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడానికి రంగారెడ్డి జిల్లా సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో రంగారెడ్డి జిల్లా సంక్షేమ అధికారి సంధ్యారాణి ఆధ్వర్యంలో ఆటల పోటీలు నిర్వహించారు. ఇందులో భాగంగా జూనియర్ విభాగం(10 నుండి 17 సంవత్సరాలు) సీనియర్ విభాగం (18 నుండి 54 సం.లు)లో దివ్యాంగులకి రన్నింగ్ రేస్ 50,200 మీటర్స్, షాట్ పుట్, చెస్, క్యారమ్స్, వీల్ చైర్ తోపాటు ట్రై సైకిల్ రేస్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సంక్షేమ శాఖ అధికారి సంధ్యారాణి మాట్లాడుతూ వైకల్యం లక్ష్యసాధనలో అడ్డుకాదని, దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో, పట్టుదలతో ముందుకు వెళ్లాలని తెలిపారు. దివ్యాంగులతో అన్ని ఆటల పోటీల్లో పాల్గొని ఉత్సాహ పరిచారు. జిల్లా స్థాయి పోటీల్లో గెలుపొందిన మొదటి బహుమతి విజేతలను రాష్ట్రస్థాయి ఆటల పోటీలకు పంపడం జరుగుతుందన్నారు. ఆటల పోటీల్లో మొత్తం జిల్లా నుండి దాదాపు 500 మంది దివ్యాంగులు పాల్గొన్నారు. కార్యక్రమంలో జిహెచ్‌ఎంసి సరూర్నగర్ కార్పొరేటర్ వాణి దేవి, జిల్లా యూత్ అండ్ స్పోర్ట్స్ ఆఫీసర్ వెంకటేశ్వర రావు, సిడిపిఒ లు, ఐసిడిఎస్ స్టాఫ్, ఐసిపిఎస్ స్టాఫ్, డిసెబుల్డ్, డి.హెచ్.ఈ.డబ్ల్యూ, సఖి, స్వచ్ఛంద సంస్థలు (డిడిఆర్సి) ప్రతినిధి రమేష్ పాల్గొని విజయవంతం చేశారు. అనంతరం గెలుపొందిన దివ్యాంగులకు బహుమతులు అందజేశారు.





## నాణ్యత ప్రమాణాలతో అభివృద్ధి పనులు

### హయత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి

**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని హయత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి సంబంధిత అధికారులకు సూచించారు. సోమవారం డివిజన్‌లోని సూర్య నగర్ కాలనీలో నూతనంగా చేపడుతున్న సిసి రోడ్డు పనులను జిహెచ్ఎంసి డిఇ దామోదర్ రావు, ఎఇ రమావత్ హేము నాయక్‌లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి మాట్లాడుతూ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ, అధికారుల పరివేక్షణ ఉండాలని సూచించారు. కాలనీ వాసులకు ఇబ్బందులు లేకుండా, లోలెవల్స్ చూసుకోని పనులు చేయాలని సంబంధిత కాంట్రాక్టర్‌ను కోరారు. అభివృద్ధి పనులను కాలనీ సంక్షేమ వాసులు సహకారం ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.



## తప్పుల్లేకుండా సర్వే డేటా ఎంట్రీ నమోదు





### బిజెఎంసి కమిషనర్ శరత్‌చంద్ర

**ప్రజాపక్షం/రాజేంద్ర నగర్ :** సేకరించిన సమగ్ర సర్వే కుటుంబ వివరాల డేటా ఎంట్రీ నమోదులో తప్పుల్లేకుండా చూడాలని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్ చంద్ర అన్నారు. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 22 డివిజన్‌లలో చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వేలో ఎన్యుమరేటర్లు చేసిన సర్వే ఫామ్స్‌ను సూపర్‌వైజర్లే దగ్గరుండి అన్‌లైన్‌లో నమోదు చేయించాలని ఆయన సూచించారు. సోమవారం రంగారెడ్డి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేపై ఎన్యూమరేటర్లకు, సూపర్‌వైజర్ ఆఫీసర్లతో కాళీమందిర్‌లోని వీరభద్ర ఫంక్షన్ హాల్‌లో సమీక్ష సమావేశం జరిగింది. ఎన్యూమరేటర్లు సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో భాగంగా గుర్తించిన కుటుంబాల సంఖ్య, ఎన్యుమరేషన్ సర్వే ప్రక్రియ పూర్తి చేసిన కుటుంబాల సంఖ్య, వివిధ కారణాల వల్ల ఎన్యూమరేటర్లకు సమాచారం ఇవ్వకుండా నిరాకరించిన కుటుంబ యాజమానులు వివరాలపైన సమావేశంలో చర్చించారు. సర్వే పూర్తయిన ఫామ్‌ను సంఖ్య ఎంట్రీ చేసేందుకుగాను 168 మంది డేటా ఎంట్రీ అఫరేటర్లు రెండు షిఫ్టుల్లో 84 కంప్యూటర్లపై పని చేస్తున్నారన్నారు. డేటా ఎంట్రీ చేసే సమయంలో ఏలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్తగా డేటా ఎంట్రీ చేయాలని శరత్ చంద్ర తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ ఇఇ జి.యాదయ్య, మేనేజర్ మంజులత, సూపర్‌వైజర్ అఫీసర్లు, ఎన్యూమరేటర్లు పాల్గొన్నారు.

### సర్వే నమోదుకు టోల్ ఫ్రీ నెంబర్‌కు కాల్ చేయండి

రంగారెడ్డి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు బండ్లగూడ నగర పాలక సంస్థ పరిధిలో నివాసం ఉంటున్న ప్రజలకు, కుటుంబ యాజమానులు ఇప్పటి వరకు సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో నమోదు చేసుకొని వారి కోసం బిజెఎంసి ప్రధాన కార్యాలయంలో కంట్రోల్ రూంను ఏర్పాటు చేశారని కమిషనర్ శరత్‌చంద్ర తెలిపారు. ప్రజలు, కుటుంబ యాజమానులు 7981235771 లేదా 8500449269 నెంబర్లకు ఫోన్ చేసి తమ కుటుంట సర్వే వివరాలను నమోదు చేసుకోవచ్చని కమిషనర్ తెలిపారు. సర్వేలో ఇప్పటి వరకు సమాచారం నమోదు చేసుకొని వారు ఈనెల 26వ తేదీ నుంచి మీ ఇంటికి వచ్చే ఎన్యూరేటర్లకుగాను లేదా బిజెఎంసీ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నెంబర్లకు ఫోన్ చేసి వివరాలు తెలియజేయాలని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## కష్టపడే కార్యకర్తలకు తప్పక గుర్తింపు

### అమన్‌గల్ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ గీత



**ప్రజాపక్షం/కడ్తాల్ :** ఆమన్‌గల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన చైర్‌పర్సన్‌గా ఎన్నికైన యాట గీత నరసింహ ముదిరాజ్ ఆధ్వర్యంలో వైస్‌చైర్మన్, డైరెక్టర్‌లు కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. సోమవారం హైదరాబాద్ తిరుమలహిల్స్‌లోని ఎమ్మెల్యే స్వగృహంలో ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ నియోజకవర్గంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులుగా యాట నరసింహ్మ ముదిరాజ్‌కు వెన్నంటి ఉంటూ ఆయన సతీమణి గీత పార్టీకి చేసిన సేవలను గుర్తించి మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పదవి అప్పగించడం అభినందనీయమన్నారు. పార్టీ నాయకులు కార్యకర్తలను ఎమ్మెల్యేతో పాటు పార్టీ నాయకత్వం గుర్తించడంపై కృతజ్ఞతలు తెలిపారు. మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ గీత మాట్లాడుతూ ఆమన్‌గల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా నన్ను ఎంపిక చేయడం సంతోషమన్నారు. కాంగ్రెస్ పార్టీలో కష్టపడ్డ కార్యకర్తను పార్టీ ఏ రోజైనా గుర్తించి న్యాయం చేస్తది అనడానికి నేనే నిదర్శనమన్నారు. కష్టపడ్డ కార్యకర్తలను గుర్తించిన కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి కృతజ్ఞతలు చెప్పారు. ప్రతి కార్యకర్తలను వెన్నంటి ముందుకు నడిపించే మృదు స్వభావి కసిరెడ్డి నారాయణరెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపించుకోవడం నియోజకవర్గ ప్రజల అదృష్టమని, ఇంతటి అవకాశాన్ని తమ ప్రాంతానికి అవకాశం ఇచ్చినందుకు తమ ప్రాంత ప్రజల తరపున, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల తరపున ఎమ్మెల్యేకు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ యాట గీత నరసింహ్మా ముదిరాజ్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు యాట నరసింహ్మా ముదిరాజ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్‌రెడ్డి, డైరక్టర్లు అజీమ్, వెంకట్‌రెడ్డి, శ్రీశైలం, రవీందర్, నరేష్, రమేష్, శామ్, జగదీష్, యాదయ్య, సంపత్, పాండు రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

## మృతురాలి కుటుంబానికి ఆర్థికసాయం



**ప్రజాపక్షం/కేశంపేట :** కేశంపేట మండల కేంద్రంలో ఆదివారం మృతి చెందిన సిరిగిరి జంబులమ్మ కుటుంబానికి దాతలు ఆర్థిక సహాయం అందజేశారు. మాజీ జడ్పిటిసి తాండ్ర విశాలశ్రావణ్‌రెడ్డి రూ.5వేలు, కేశంపేటకు చెందిన సీనియర్ జర్నలిస్టు గుండ్రాతి రమణగౌడ్ రూ.5 వేలు, తలసాని పవన్‌కుమార్‌రెడ్డి రూ.3 వేలు అందజేసి కుటుంబసభ్యులను ఓదార్చి సానుభూతిని తెలిపారు. ఈకార్యక్రమంలో మాజి ఉపసర్పంచ్ గంజాయి ధశరథం, మంచె కృష్ణయ్య, మారం వెంకటయ్య, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

## సమగ్ర సర్వేకు సహకరించండి

**ప్రజాపక్షం/సరూర్ నగర్ :** సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే కార్యక్రమాన్ని ప్రజలంతా సహకరించాలని రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి వక్కలంక శ్రీనివాసరావు కోరారు. సోమవారం ఆయన సర్వేకు విచ్చేసిన అధికారికి వివారాలు వెల్లడించారు. అనంతరం. ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇప్పటికీ అనేక ప్రాంతాలలో అనేక అవసరాల నిమిత్తం బయటకు వెళ్లిన వ్యక్తులు వారిని కలుసుకోలేకపోయిన సిబ్బంది ఉన్న సంగతి తెలియ వచ్చింది. ఎవరింటికైనా సిబ్బంది రానట్లయితే తమకు తెలియజేసినట్లయితే ఆయా ఇండ్లకు సిబ్బందిని పంపించే ఏర్పాట్లు పూర్తి చేసేందుకు సిద్ధంగా ఉన్నామని శ్రీనివాసరావు తెలిపారు. డిసెంబర్ 10వ తేదీలోగా అన్ని జిల్లాలలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే వివరాలు కంప్యూటరీకరణ చేస్తారని కొన్నిచోట్ల సర్వే పూర్తి కాకపోతే ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి కుటుంబాల వివరాలను సేకరిస్తున్నామని ఇప్పటికే అన్ని జిల్లాలలో 90 సర్వే పూర్తి అయిందని రంగారెడ్డి జిల్లా అందులో ముందు ఉందని శ్రీనివాసరావు పేర్కొన్నారు.

## ఆధ్యాత్మిక కార్యక్రమాలతో మానసిక ప్రశాంతత



### ఎంపి ఈటల రాజేందర్



**ప్రజాపక్షం/యాచారం :** ఆధ్యాత్మిక కార్యక్రమాలతో మానసిక ప్రశాంతంత లభిస్తుందని ఎంపి ఈటల రాజేంధర్ అన్నారు. సోమవారం యాచారం మండల కేంద్రంలో అయ్యప్ప స్వామి పడి పూజ కొప్పు భాష ఆధ్వర్యంలో జరిగింది. గురుస్వాములు చందర్‌నాయర్, నారాయణస్వామి, పురుషోత్తం ఆధ్వర్యంలో అయప్ప పడి పూజ కార్యక్రమం జరిగింది. దాదాపు 2 వేల మంది అయ్యప్ప స్వాములు పడిపూజలో పాల్గొన్నారు. అయ్యప్ప పాటలు ఆటలతో పడి పూజ కార్యక్రమం కనుల పండుగగా జరిగింది. తాడేపల్లి ఎమ్మెల్యే వెవకటరమణారెడ్డి, జాతీయ నాయకులు మురళీధర్‌రావు, బోక్క నర్సింహ్మారెడ్డి, బోసుపల్లి ప్రతాప్, అందెల శ్రీరాములు, అచారి పాల్గొన్నారు. అయ్యప్ప స్వాములు రంగారెడ్డి, నల్లగొండ జిల్లాల నుండి పెద్ద ఎత్తున హాజరయ్యారు. కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షులు తాండ్ర రవీందర్, బిజెపి మండల ప్రధానకార్యదర్శి నడికుడి కృష్ణ, గోగికార్ రమేశ్, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

## బాలికపై అత్యాచారానికి యత్నించిన వ్యక్తికి 20సంవత్సరాలు జైలు

**ప్రజాపక్షం/యాచారం :** ఐదేళ్ళ బాలికపై అత్యాచార యత్నానికి పాల్పడిన వ్యక్తికి రంగారెడ్డి జిల్లా స్పెషల్ సెషన్ కోర్టు జడ్జి అరిష 20 సంవత్సరాల జైలు, 25 వేల రూపాయల జరిమాన విధించారు. సంఘటనకు సంబంధించి యాచారం సిఐ నర్సింహ్మారావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని గడ్డమల్లాయగూడ గ్రామానికి చెందిన వరికుప్పల మహేశ్ (25) గ్రామ పంచాయతీ కార్మికుడు. ఈనెల 13న పక్కింట్లో ఉన్న ఐదేళ్ళ బాలికకు మాయమాటలు చెప్పి ఇంటిపైకి తీసుకెల్లి అత్యాచారం చేయడానికి ప్రయత్నించాడు. ఈవిషయంలో బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి కేసు వివరాలు కోర్టుకు అందజేశామన్నారు. కార్యక్రమంలో అడిషినల్ పిపి అరుణ్‌కుమార్, ఎన్‌శంకర్‌కుమార్, మహేశ్వరం ట్రాఫిక్ సిఐ,యం రాజు పిసి, విద్యాసాగర్ సమాన్ డ్యూటి,జి. మహేంధర్ హెచ్‌జి ఉన్నారు.

## క్రీడ

# దుమ్మురేపిన టీమిండియా



### ఆస్ట్రేలియాపై ఘన విజయం

అయిదు టెస్టుల బోర్డర్ గవాస్కర్ ట్రోఫీని భారత్ ఘనంగా ఆరంభించింది. పెర్త్ వేదికగా జరిగిన తొలి టెస్టులో ఆస్ట్రేలియాపై 295 పరుగుల తేడాతో భారీ విజయం సాధించింది. వరల్డ్ టెస్టు ఛాంపియన్‌షిప్ రేసులో నిలవాలంటే ఈ సిరీస్‌ను తప్పక గెలవాల్సిన పరిస్థితిలో ఆరంభ పోరులో దుమ్మురేపింది. ఆలౌండ్ షోతో కంగారూలను కంగారు పెట్టించింది. న్యూజిలాండ్ చేతిలో వైట్‌వాష్ పరాజయాన్ని మరిచి విరుస్తూ జీయ విజయాన్ని అందుకుంది. 534 పరుగుల కొండంత లక్ష్యంతో ఛేదనకు దిగిన ఆస్ట్రేలియా 58.4 ఓవర్లలో 238 పరుగులకు కుప్పకూలింది. ట్రావిస్ హెడ్ (89: 101 బంతుల్లో, 8 ఫోర్లు), మిచెల్ మార్ష్ (47: 67 బంతుల్లో, 3ఫోర్లు, 2సిక్సర్లు), అలెక్స్ కేరీ (36:58బంతుల్లో, 2ఫోర్లు) పోరాటంతో ఆసీస్ గౌరవంగా ఓడింది. లేదంటే రికార్డు ఓటములు చవిచూసేది. భారత బౌలర్లలో మహ్మద్ సిరాజ్, జస్ప్రీత్ బుమ్రా మూడు వికెట్లతో విజృంభించారు. వాషింగ్టన్ సుందర్ రెండు, నితీశ్ రెడ్డి, హర్షిత్ రాణా ఒక్కో వికెట్ పడగొట్టారు. ఓవర్ నైట్ స్కోరు 12/3తో నాలుగో రోజు ఆట ఆరంభించిన ఆస్ట్రేలియాను సిరాజ్ ఆదిలోనే దెబ్బకొట్టాడు. ఉస్మాన్ ఖవాజా (4:13బంతుల్లో)ను పెవిలియన్‌కు చేర్చాడు. తన తొలిఓవర్ మూడో బంతికే ఉస్మాన్ ఖవాజా(4:13 బంతుల్లో) బోల్తా కొట్టించాడు. టెస్టుల్లో ఖవాజాను సిరాజ్ ఔట్ చేయడం ఇది మూడోసారి. ఆసీస్ ఓపెనర్ ఖవాజాకు 81బంతులు సంధించిన సిరాజ్ 31పరుగులిచ్చి మూడు సార్లు పెవిలియన్‌కు చేర్చాడు. ఆ తర్వాత డేంజర్ బ్యాటర్ స్టీవ్ స్మిత్ (17:60 బంతుల్లో)ను సిరాజ్ ఔట్ చేశాడు. స్వింగ్ డెలివరీతో కుదురుకున్న స్మిత్‌ను సిరాజ్ బోల్తాకొట్టించాడు. దీంతో ట్రావిస్ హెడ్-స్మిత్ 62పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది.భారత్ విజయాన్ని ట్రావిస్ హెడ్-మిచెల్ మార్ష్ కాస్త ఆలస్యం చేశారు. వీరి ద్వయం ఆరో వికెట్‌కు 87 బంతుల్లో 82 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. హెడ్‌ని బుమ్రా, మార్ష్‌ని నితీశ్ రెడ్డి ఔట్ చేయడంతో ఆసీస్ పతనం ఖరారైంది. అలెక్స్ కేరీ పోరాటం ఓటమి అంతరాన్ని మాత్రమే తగ్గించింది. యశస్వీ జైస్వాల్ (161: 297 బంతుల్లో, 15 ఫోర్లు, 3 సిక్సర్లు), విరాట్ కోహ్లి (100 నాటౌట్: 143 బంతుల్లో, 8 ఫోర్లు, 2 సిక్సర్లు) శతకాల మోత మోగించడంతో రెండో ఇన్నింగ్స్‌ని భారత్ 487/6 స్కోరు వద్ద డిక్లేర్ చేసిన సంగతి తెలిసిందే. తొలి ఇన్నింగ్స్‌లో భారత్150,ఆసీస్ 104 పరుగులకే పరిమితమైంది.

### పిచ్‌లో కాస్త ఘాటు తగ్గింది: బుమ్రా



అయిదు టెస్టుల బోర్డర్ గవాస్కర్ ట్రోఫీని భారత్ విజయంతో ప్రారంభించింది. 534 పరుగులను అధిగమించడానికి దిగిన ఆస్ట్రేలియా 58.4 ఓవర్లలో 238 పరుగులకు కుప్పకూలింది. 'సిరీస్ చక్కగా ఆరంభించడం సంతోషంగా ఉంది. తొలి ఇన్నింగ్ ఒత్తిడికి గురై, తర్వాత గొప్పగా పుంజుకున్న తీరు పట్ల గర్వపడుతున్నాను.2018లో పెర్త్ ఆడినప్పుడు వికెట్ తొలుత సాఫ్ట్‌గా ఉంది. ఆ తర్వాత వేగంగా మారిపోయింది. ఆ అనుభవంతో పోలిస్తే ఈ వికెట్ కాస్త ఘాటు తగ్గింది. ఇక జైస్వాల్ టెస్టు కెరీర్‌ను గొప్పగా ఆరంభించాడు. అతని కెరీర్‌లో ఇదే అత్యుత్తమ ఇన్నింగ్‌గా భావిస్తున్నా.

# గెలవాల్సిన మ్యాచ్‌లో ఓడాం

**ప్రణాళికలకు తగ్గట్లు ఆడకపోవడమే తమ ఓటమికి కారణం ఆస్ట్రేలియా కెప్టెన్ ప్యాట్ కమిన్స్**

బ్యాటింగ్ వైఫల్యంతో పాటు ప్రణాళికలకు తగ్గట్లు ఆడకపోవడమే తమ ఓటమిని శాసించిందని ఆస్ట్రేలియా కెప్టెన్ ప్యాట్ కమిన్స్ అన్నాడు. ఈ ఓటమి తీవ్ర నిరాశకు గురిచేసిందని చెప్పాడు. ఏదో ఒక మ్యాచ్ ఏది కలిసి రాదని, ఈ మ్యాచ్ కూడా అలాంటిదేనని తెలిపాడు. ఆస్ట్రేలియాతో ఐదు టెస్టుల బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో భారత్ శుభారంభం చేసింది. పెర్త్ వేదికగా సోమవారం ముగిసిన తొలి టెస్టులో భారత్ 295 పరుగుల భారీ తేడాతో విజయం సాధించింది. ఆసీస్ గడ్డపై భారత్కు ఇదే అతిపెద్ద విజయం. 534 పరుగుల భారీ లక్ష్యఛేదనతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఆస్ట్రేలియా 238 పరుగులకే కుప్పకూలింది. భారత బౌలర్లలో బుమ్రా, సిరాజ్ మూడేసి వికెట్లు తీయగా.. వాషింగ్టన్ సుందర్ రెండు వికెట్లు పడగొట్టాడు. నితీష్ కుమార్ రెడ్డి, హర్షిత్ రాణాకు తలో వికెట్ దక్కింది. ఈ మ్యాచ్ అనంతరం తమ ఓటమిపై స్పందించిన ప్యాట్ కమిన్స్.. తప్పిదాలపై ఫోకస్ పెట్టి అడిలైడ్ వేదికగా జరిగే రెండో టెస్టుకు సిద్ధమవుతామని తెలిపాడు. తమ వ్యూహాలను సరిగ్గా అమలు చేయలేకపోయామని అన్నాడు. 'ఈ ఓటమి తీవ్ర నిరాశకు గురి చేసింది. ఈ మ్యాచ్ కోసం మేం బాగానే సన్నద్ధమయ్యాం. జట్టులోని ప్రతీ ఒక్కరు ఉత్సాహంగా కనిపించారు. కానీ వ్యూహాలను సరిగ్గా అమలు చేయలేకపోయాం. ఇదే మా ఓటమిని శాసించింది. రెండు రోజులు విశ్రాంతి తీసుకొని అడిలైడ్ లో ప్రాక్టీస్ మొదలు పెడతాం. ఓటమి నుంచి పాఠాలు నేర్చుకుంటాం. తొలి టెస్టు చేసిన తప్పిదాలపై చర్చిస్తాం. ఈ మ్యాచ్‌లో మాకు ఏది కలిసి రాలేదు. రెండో రోజు నుంచి పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. ముఖ్యంగా తొలి రోజు ఆటలో మా బ్యాటింగ్ వైఫల్యం తీవ్ర నష్టం చేసింది. ఆ రోజు మేం బ్యాట్‌తో మెరుగైన ప్రదర్శన చేయాల్సి ఉంది. జట్టులో చాలా మంది అనుభవం కలిగిన ఆటగాళ్లు ఉన్నారు. టీమ్ ఓటమికి దారితీసిన కారణాలను విశ్లేషిస్తామని ప్యాట్ కమిన్స్ చెప్పుకొచ్చాడు.



## రీల్

# పాటలో బన్నీ ఊరమాస్ స్టెప్పులు!

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ హీరోగా క్రియేటివ్ డైరెక్టర్ సుకుమార్ దర్శకత్వంలో రాబోతున్న 'పుష్ప 2 ది రూల్' నుంచి నిన్న స్పెషల్ సాంగ్ 'కిస్సిక్' వచ్చేసింది. ఎప్పుడెప్పుడు విడుదలవుతుందా అని ఎదురు చూసిన ఈ పాట లిరికల్ వీడియో ప్రస్తుతం విపరీతంగా ఆకట్టుకుంటుంది. ముఖ్యంగా లిరిక్స్ తో పాటు శ్రీలీల బన్నీ స్టెప్స్ భారీ హైలెట్ అవుతున్నాయి. అటు బన్నీ శ్రీలీల కెమిస్ట్రీ కూడా చాలా బాగుంది. అయితే, చెన్నై వేదికగా నిర్వహించిన పుష్ప 2 వైల్డ్ ఫైర్ ఈవెంట్లో.. దేవిశ్రీ ప్రసాద్, వచ్చే వారం రాబోతున్న మరో పాట గురించి చేసిన కామెంట్స్ ప్రస్తుతం హాట్ టాపిక్ గా మారాయి. ఇంతకీ, దేవిశ్రీ ప్రసాద్ ఏం మాట్లాడారు అంటే.. 'నేను 'పుష్ప 2' చిత్రం ప్రథమార్థం చూసినప్పుడే ఫిదా అయిపోయాను. ద్వితీయార్థం చూశాక మతిపోయింది. నిజంగా అల్లు అర్జున్ తన నట విశ్వరూపం చూపించాడు. ముఖ్యంగా వచ్చే వారం మరో పాట వస్తుంది. ఆ పాటలో బన్నీ ఊరమాస్ స్టెప్పులు చూస్తారు' అంటూ దేవిశ్రీ ప్రసాద్ చెప్పుకొచ్చారు. మరి ఆ పాట ఎలా ఉంటుందో.. నిజంగానే బన్నీ ఊరమాస్ స్టెప్పులు ఎలా ఉంటాయో చూడాలని ఫ్యాన్స్ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ మూవీలో నేషనల్ క్రష్ రష్మిక మందన్న హీరోయిన్ గా నటిస్తుంది. కాగా మైత్రి మూవీ మేకర్స్ సంస్థపై నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్ పాన్ ఇండియన్ రేంజ్‌లో గ్రాండ్‌గా నిర్మిస్తున్నారు.



# 'యానిమల్' విమర్శలపై రణ్‌భీర్ రియాక్షన్



దర్శకుడు సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో రణబీర్ కపూర్ హీరోగా వచ్చిన 'యానిమల్' సినిమా భారీ కలెక్షన్స్ ను సాధించి.. అద్భుత విజయాన్ని సాధించింది. ఐతే, ఈ సినిమాపై ఎన్నో విమర్శలు వచ్చిన సంగతి తెలిసిందే. తాజాగా ఈ విమర్శలపై హీరో రణ్‌భీర్ కపూర్ స్పందించారు. 'ఇఫ్ఫీ' వేదికగా ఆయన ఈ అంశంపై మాట్లాడుతూ.. 'యానిమల్ విషయంలో అందరి అభిప్రాయాలతో నేను కూడా పూర్తిగా ఏకీ భవిస్తున్నాను. అందులో ఎలాంటి సందేహం లేదు. ఐతే, ప్రేక్షకులకు నచ్చే సినిమాలు తీసుకురావాల్సిన బాధ్యత మాపై ఉంది. కొత్తదనాన్ని ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది. ఒక నటుడిగా ఇది చాలా ముఖ్యం. ఎప్పుడైతే నటులందరూ విభిన్నమైన పాత్రలు పోషిస్తారో.. అప్పుడే వారి కెరీర్ బాగుంటుంది' అంటూ రణబీర్ తెలిపారు. అన్నట్టు ఇదే వేదికపై రణ్‌భీర్ కపూర్ మాట్లాడుతూ.. బాలీవుడ్ దిగ్గజాలను నేటి తరానికి తెలిసేలా చేసే బాధ్యత మన అందరిపై ఉంది. అందులో భాగంగానే డిసెంబర్ 13 నుంచి 15 వరకు ఫిల్మ్ ఫెస్టివల్ను నిర్వహిస్తున్నాం. ఈ క్రమంలోనే భారతదేశమంతా రాజ్ కపూర్ సినిమాలను ప్రదర్శించనున్నాం' అని రణ్‌భీర్ ప్రకటించారు. రాజ్‌కపూర్ నటించిన కొన్ని అపురూమైన చిత్రాలను ఈ జనరేషన్ కి అందించాలని రణ్బీర్ కపూర్ చాలా పట్టుదలగా ఉన్నారట.

# 'రాబిన్ హుడ్' కోసం పాప్ క్వీన్



హీరో నితిన్ నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'రాబిన్ హుడ్' క్రిస్మస్ కానుకగా గ్రాండ్ రిలీజ్కు రెడీ అవుతోంది. ఈ సినిమాను దర్శకుడు వెంకీ కుడుముల డైరెక్ట్ చేస్తుండగా పూర్తి యాక్షన్ థ్రిల్లర్ మూవీగా రూపొందుతోంది. ఇక ఈ సినిమాతో నితిన్ బాక్సాఫీస్ దగ్గర సాలిడ్ హిట్ అందుకోవాలని చూస్తున్నాడు. ఇప్పటికే రిలీజ్ అయిన ఈ మూవీ కంటెంట్ ప్రేక్షకుల్లో మంచి బజ్ని క్రియేట్ చేసింది. అయితే, ఈ సినిమాలోని ఫస్ట్ సింగిల్ సాంగ్‌ని రిలీజ్ చేసేందుకు మేకర్స్ రెడీ అవుతున్నారు. ఈ చిత్రంలోని ఫస్ట్ సింగిల్ సాంగ్ 'వన్ మోర్ టైమ్' అనే పాటను రిలీజ్ చేస్తున్నట్లు చిత్ర యూనిట్ అనౌన్స్ చేసింది. ఈ పాటను పాప్ క్వీన్, ఇండోఫ్యూజన్ సింగర్ విద్యా వోక్స్ పాడింది. ఈ మేరకు చిత్ర యూనిట్ ఓ పోస్టర్‌ని కూడా రిలీజ్ చేశారు. ఇక ఈ పాటను నవంబర్ 26న సాయంత్రం రిలీజ్ చేస్తున్నట్లు చిత్ర యూనిట్ తెలిపింది.ఈ సినిమాలో అందాల భామ శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తుండగా జివి.ప్రకాష్ కుమార్ ఈ చిత్రానికి సంగీతాన్ని అందిస్తున్నాడు. మైత్రీ మూవీ మేకర్స్ వారు ఈ చిత్రాన్ని ప్రొడ్యూస్ చేస్తున్నారు.

# రిషికేశ్‌లో మీనాక్షితో వెంకీ రొమాన్స్

విక్టరీ వెంకటేష్ ప్రస్తుతం కమర్షియల్ డైరెక్టర్ అనిల్ రావిపూడి దర్శకత్వంలో 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే. ముగింపు దశలో ఉన్న ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం డెహ్రాడూన్, ముస్సోరీ, రిషికేశ్ తదితర ప్రాంతాల్లో శరవేగంగా జరుగుతోంది. ఐతే, ప్రస్తుత షెడ్యూల్



లో వెంకీ, మీనా క్షిలపై ఓ పాటను షూట్ చేస్తున్నారు. ఈ పాటకు భీమ్స్ సిసిరోలియో స్వరాలు సమకూర్చగా.. అనంత శ్రీరామ్ సాహిత్యాన్ని అందించారు. ఈ పాట రొమాంటిక్ టోన్‌లో సాగుతుందని తెలుస్తోంది.ముక్కోణపు క్రైమ్ కథాంశంతో రూపొందుతోన్న ఈ సినిమాలో వెంకటేశ్ మాజీ పోలీసు అధికారిగా కనిపిం చనున్నారు. ఆయన భార్యగా ఐశ్వర్య, మాజీ ప్రేయసిగా మీనాక్షి నటిస్తోంది. ఈ చిత్రాన్ని శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై దిల్‌రాజు సమర్పణలో శిరీష్ నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో ఉపేంద్ర లిమాయే, రాజేంద్రప్రసాద్, సాయికుమార్, నరేష్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. జనవరి 14న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రానికి కూర్పు: తమ్మిరాజు, ఛాయాగ్రహణం: సమీర్ రెడ్డి అందిస్తున్నారు.

# జార్ఖండ్ అసెంబ్లీలో 89 శాతం మంది కోటీశ్వరులే!



**రాంచీ:** జార్ఖండ్ అసెంబ్లీకి కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలలో 89 శాతం మంది కోటీశ్వరులు. జార్ఖండ్ ఎలక్షన్ వాచ్, అసోసియేషన్ ఫర్ డెమోక్రాటిక్ రిఫామ్స్ (ఏడిఆర్) సోమవారం సంయుక్తంగా విడు దల చేసిన నివేదికను అనుసరించి, కాంగ్రెస్‌కు చెందిన రామేశ్వర్ ఒరాన్ 42.20 కోట్ల రూపాయల ఆస్తితో మొదటి స్థానంలో నిలిచాడు. గెలిచిన 81 మంది ఎమ్మెల్యేలలో 80 మంది అఫిడవిట్లను పరిశీలించగా, 71 మంది కోటీశ్వరులుగా తేలింది. 2019లో ఎన్నికైన కోటీశ్వరుల సంఖ్య కంటే ఇది 20 శాతం అధికం. అప్పట్లో ఎన్నికైన 18 మందిలో 56 మంది కోటీశ్వరులు. 2014లో వీరి సంఖ్య 41. ఇలావుంటే, కొత్తగా ఎన్నికైన కరోడ్‌పతి' ఎమ్మెల్యేలలో 28 మంది జార్ఖండ్ ముక్తిమోర్చా (జెఎంఎం), 20 మంది బిజెపి, 14 మంది కాంగ్రెస్, నలుగురు ఆర్‌జెడి, సిపిఐ (ఎంఎల్) లిబరేషన్, ఆర్ జెడి నుంచి చెరి ఇద్దరు, ఎల్‌జెపి (రామ్ విలాస్), జెడియు, ఎజె ఎస్‌యు పార్టీ నుంచి తలా ఒక్కరు చొప్పున ఉన్నారు. ఈ ఎన్నికల్లో ఎఎంఎం 34 సీట్లు గెల్చుకోగా, దాని మిత్ర పక్షాలైన కాంగ్రెస్‌కు 16, ఆర్‌జెడికి 4, సిపిఐ (ఎంఎల్) లిబరేషన్‌కు 2 చొప్పున సీట్లు దక్కాయి.కాగా, ప్రధాన ప్రతిపక్షమైన బిజెపి 21 స్థానాల్లో గెలిచింది. దాని మిత్రపక్షాలైన ఎల్‌జెపి (రామ్ విలాస్), జెడియు, ఎజెఎస్ యులకు తాల ఒక ఎమ్మెల్యే ఉన్నారు. అత్యంత ధనవంతులైన ఎమ్మెల్యేలలో రామేశ్వర్ ఒరాన్ మొదటి స్థానంలో ఉంటే, బిజెపికి చెందిన కుశ్వంత్ శశిభూషణ్ మెహతా 32.15 కోట్ల రూపాయల ఆస్తితో రెండో స్థానంలో నిలిచారు. ఆర్‌జెడి ఎమ్మెల్యే సంజయ్ ప్రసా ద్ యాదవ్ రూ. 29.59 కోట్లతో మూడోస్థానాన్ని ఆక్రమించారు. డుమ్రీ నియోజగవర్గం నుంచి ఎన్నికైన లోక్‌తాంత్రిక్ క్రాంతికార్ మోర్చా (జెఎల్‌కెఎం) అభ్యర్థి జైరామ్ మహతో కేవలం 2.55 లక్షల ఆస్తులతో ఈ జాబితాలో చిట్టచివరిన ఉన్నారు. మొత్తం ఎమ్మెల్యేలలో 43 మంది తమకు రూ. కోటి లేదా అంతకంటే ఎక్కువ అప్పులు ఉన్నట్టు తెలిపారు. మణిపూర్‌లో కర్ఫ్యూ ఉత్తర్వులను ధిక్కరిస్తూ వేలాది మంది మహిళలు సోమవారం ర్యాలీ నిర్వహించారు. సా యుధ బలగాలకు ప్రత్యేక అధికారాలను కట్టబెడుతున్న 'ఎఎఫ్ఎస్ పిఎ' చట్టాన్ని తక్షణలో వెనక్కు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఇంఫాల్‌లోని కోంగ్బా మజార్ నుంచి బయలుదేరిన రాయలీని భద్రతా బలగాలు అడ్డుకున్నాయి. కర్ఫ్యూ నిబంధనలను అతిక్రమించ్చొద్దని, వెంటనే ఆందోళన విరమించి వెనక్కు వెళ్లాలని కోరాయి. కానీ, భారీగా తరలి వచ్చిన మహిళలు ఎఎఫ్ఎస్‌పిఎకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు.

# వేడుకల వేళ రైతుల్లో అసంతృప్తి

**ప్రజాపక్షం/ఖమ్మం :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడిచిన సందర్భంగా డిసెంబర్ ఒకటి నుంచి వారం రోజుల పాటు సంబురాలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. వేడుకల వేళ తెలంగాణ రైతాంగంలో తీవ్రమైన అసంతృప్తి ఉంది. గత ప్రభుత్వం రైతులను విస్మరించిందని రైతాంగ సమస్యలను పట్టించుకోలేదన్న భావనతో రైతులు మూకుమ్మడిగా అప్పటి ప్రభుత్వానికి వ్యతిరేకంగా కాంగ్రెస్‌కు అనుకూలంగా ఓట్లు వేశారు. ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ రైతు డిక్లరేషన్ గత ఏడాది ఎన్నికలలో రైతులను బాగా ఆకర్షించింది. రెండు లక్షల లోపు రుణమాఫీ, ఎకరానికి రూ. 15వేలు, రైతు బీమా రైతాంగాన్ని బాగా ఆకట్టుకున్నాయి. సన్న రకం ధాన్యానికి రూ. 500 బోనస్ రైతుల సానుకూలతకు కారణమైంది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆగస్టు 15 నాటికి రుణమాఫీని పూర్తి చేస్తామని ప్రకటించినప్పటికీ వాస్తవ పరిస్థితి తద్విరుద్దంగా ఉంది. రాష్ట్ర ప్రభుత్వం రూ.17వేల కోట్లు ఖర్చు చేశామని చెపుతున్నప్పటికీ రుణమాఫీ పట్ల రైతుల్లో వ్యతిరేకత వ్యక్తమవుతూనే ఉంది. రెండు లక్షల పైబడి రుణం కలిగిన రైతులకు మాఫీ జరగకపోవడంతో ఆ రైతుల్లో అసంతృప్తి నెలకొన్నది. కాని రెండు లక్షల లోపు రుణాలు ఉన్న రైతుల్లో పూర్తి స్థాయిలో రుణమాఫీ కాకపోవడంతో తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. రకరకాల కారణాలతో రాష్ట్ర వ్యాప్తంగా రెండు లక్షల లోపు రుణమున్న 30 నుంచి 40 శాతం మంది రైతులకు రుణమాఫీ జరగలేదు. అధికార యంత్రాంగం ఫోటోలు తీయడం, రేషన్ కార్డు ప్రక్రియ, కుటుంబ వివరాలు తదితర వివరాలను స్వీకరించినప్పటికీ రుణమాఫీ జరగకపోవడంపై రైతులు ఆవేదనకు గురవుతున్నారు. ఇలా పలు సమస్యలకు రైతుల ఆవేదనకు, అసంతృప్తికి కారణమవుతుంది.

# ఫడ్నవీస్–షిండే మధ్య పోటీ!

(మొదటి పేజీ తరువాయి)

ఉమ్మడి నిర్ణయం తీసుకుంటారని సోమవారంనాడు ఆయన పాత్రికేయులకు కరద్‌లో చెప్పారు. మంత్రివర్గ నిర్మాణంపై ఎలాంటి ఫార్ములా రూపొందిస్తే బాగుంటుందన్న విషయాన్ని బిజెపి,శివసేన, ఎన్‌సిపి కలిసి నిర్ణయిస్తాయన్నారు. ఈనెల 27వ తేదీలోపు అంటే రాబోయే 48 గంటల్లోనే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని, లేకపోతే మహారాష్ట్రలో రాష్ట్రపతి పాలన విధిస్తారని పత్రికల్లో వార్తలు వస్తున్నాయని, అలాంటిదేమీ ఉండబోదని అన్నారు. మహాయుతి కూటమిలో ఎక్కువసీట్లు గెలుచుకున్న బిజెపి తరపు నాయకుడు,ఉపముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌కు ఈసారి ముఖ్యమంత్రి పదవి లభిస్తుందని ప్రముఖంగా వినిపిస్తున్నది. కానీ శివసేన నాయకుడు,మంత్రి దీపక్ కేసర్కర్ మాత్రం ఏక్‌నాథ్ షిండే మళ్ళీ ముఖ్యమంత్రి పదవి అధిష్టిస్తారని తమ పార్టీ ఎంఎల్‌ఎలు భావిస్తున్నారని చెప్పారు. శివసేనపార్టీ నాయకుడుగా ఏక్‌నాథ్ షిండేను, బిజెపి నాయకుడుగా ఫడవీస్‌ను ఆయాపార్టీల శాసనసభ్యులు ఎన్నుకున్నారు. ఫడ్నవీస్–షిండే మధ్య ముఖ్యమంత్రి పదవికోసం ప్రధానంగా పోటీ జరుగుతోందని తెలుస్తోంది.

''మమ్మల్ని గెలిపించిన లడ్కీ బహిన్ పథకాన్ని మరచిపోబోం, మహిళా ఓటర్లకు మేం ఎంతగానో రుణపడి ఉన్నాం'' అన్నారు. రాష్ట్ర ఆర్థికమంత్రిగా ఈ పథకాన్ని అమలుచేసేముందుగా తాను పదవీ విరమణ చేసిన ఎంతోమంది ఆర్థికశాఖాధికారులతో చర్చించి నిర్ణయం తీసుకున్నానన్నారు. ఇవిఎంలపై ప్రతిపక్షాలు వ్యక్తం చేస్తున్న ఆందోళనను ఆయన కొట్టిపారేశారు. ఇవిఎంలలో సక్సెస్–డిఫీట్ అనేవి ఓటర్లపై ఆధారపడి ఉంటుందన్నారు. ''లోక్‌సభ ఎన్నికల్లో ఓటమిని మేం అంగీకరించాం, ఆనాడు ఇవిఎంలు సక్రమంగా సజావుగా పనిచేశాయా? ఈనాడు సరిగ్గా లేవా? ఈ ఆరోపణలకు అర్థం లేదు, జయాపజయాలు ఓటర్లపై ఆధారపడి ఉంటాయి'' అన్నారు. పెద్ద రాష్ట్రం బిజెపికి, చిన్న రాష్ట్రం ప్రతిపక్షాలకు వెళ్ళిందని శరద్ పవార్ చేసిన వ్యాఖ్యలపై అజిత్‌పవార్ పైవిధంగా స్పందించారు. సతారా జిల్లాలో మహావికాస్ అఘాడీకి చెందిన ఒక్కరు కూడా ఎంఎల్‌ఏగా గెలవలేదని, ప్రజలు తమకు ఇష్టమైన వారిని గెలిపించుకుంటారని దీన్నిబట్టే అర్థమవుతోందని అన్నారు. తమకు భారీ మెజారిటీ దక్కిందనీ, ప్రతిపక్షంలో ఏ ఒక్కసార్టీకీ తగినన్ని సీట్లు రాలేదని , ఐనప్పటికీ కూడా ప్రతిపక్షాలను, ఇతర సభ్యులను గౌరవించే సంప్రదాయాన్ని తాము కొనసాగిస్తామన్నారు. ఈ విజయం ద్వారా ప్రజలు మహాయుతి కూటమి నాయకుల భుజస్కంధాలపై చాలా గురుతరమైన బాధ్యతలు మోపారని అజిత్ పవార్ అన్నారు. శనివారంనాడు వెలువడిన మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో అధికార మహాయుతి కూటమి విజయ ఢంకా మోగించింది. అసెంబ్లీలో మొత్తం 288 స్థానాలు ఉండగా 230 నియోజకవర్గాలను అధికార కూటమి పార్టీలు గెలుచుకున్నాయి. వీటిల్లో 149 స్థానాలకు పోటీ చేసిన బిజెపి ఏకంగా 132 స్థానాల్లో విజయం సాధించింది. బిజెపి భారీగా సీట్లు గెలుచుకున్నందువల్ల ముఖ్యమంత్రి పదవి బిజెపినేత దేవేంద్ర ఫడ్నవీస్‌కు లభిస్తుందని అందరూ భావిస్తున్నారు. ఆయనే ప్రధాన పోటీదారుగా కనిపిస్తున్నారు. మెజార్టీస్థానాలు గెలుచుకున్న పార్టీయే కూటమికి నాయకత్వం వహిస్తుంది.

ముఖ్యమంత్రి పదవి విషయంలో ఏదైనా ఫార్ములాపై చర్చించారా? అని పాత్రికేయులు అజిత్ పవార్‌ను పాత్రికేయులు ప్రశ్నించారు. అలాంటి ఫార్ములాపై చర్చ జరగలేదని ఆయన సమాధానం చెప్పారు. మూడు భాగస్వామ్యపార్టీలూ కూర్చుని నిర్ణయం తీసుకుంటాయన్నారు. మహాయుతికి మహారాష్ట్ర ప్రజలు భారీ విజయాన్ని చేకూర్చారని, మహా వికాస్ అఘాడీ కూటమికి కనీస సీట్లు కూడా రాలేదని అన్నారు. ఆ కూటమి అసెంబ్లీలో ప్రతిపక్ష హోదా అడిగేందుకు సరిపడ సీట్లు కూడా లేవన్నారు. ప్రభుత్వం అమలు చేసిన 'లడ్కీ బహిన్ పథకం గొప్ప విజయం సాధించిందని, ప్రజలు ఈ పథకాన్ని ఎంతగానో ఆదరించారని అన్నారు. మహిళలకు నెలవారీ ఆర్థిక సహాయం అందించే ఈ పథకం అమలు చేయడంవల్లే మహాయుతి కూటమికి ఘన విజయం లభించిందని ఆయన అన్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందుగా ఈ పథకాన్ని మహాయుతి కూటమి ప్రారంభించింది. మహారాష్ట్ర మొదటి ముఖ్యమంత్రి యశ్వంత్ రావ్ చవాన్ వర్థంతి సందర్భంగా కరద్‌లో జరిగిన కార్యక్రమంలో పాల్గొని ఆయన ప్రసంగించారు. చవాన్‌కు నివాళులు అర్పించారు.

# మద్దతు ధర కోసం పోరాటాలను ఉధృతం చేయండి

**రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ**

**ప్రజాపక్షం/కమలాపూర్:** అన్ని పంటలకు మద్దతు ధరలు ప్రకటించడం కోసం రైతాంగం తోకలిసి ఉద్యమాలను ఉధృతం చేయుటకు ముందుకు రావాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ పిలుపునిచ్చారు. కమలాపూర్ మండలం వంగపల్లి గ్రామంలో సోమవారం తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం హనుమకొండ మూడవ జిల్లా మహాసభలు మెట్టు శ్యాంసుందర్ రెడ్డి అధ్యక్షతన జరిగాయి. ముఖ్యఅతిథిగా పశ్య పద్మ హాజరై మాట్లాడుతూ. కేంద్రంలో బిజెపి ప్రభుత్వ రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటిస్తూ ఎండగట్టాలని అందుకు రైతు సోదరులు కలిసి రావాలని పిలుపునిచ్చారు. కార్పోరేటు అనుకూల ఆర్థిక విధానాలను తీసుకురావడం వల్ల రైతులు, కార్మికులు అనేక విధాలుగా కష్టనష్టాలు ఎదుర్కొంటున్నారని రైతాంగం తీవ్రంగా నష్టపోతున్నారని,అన్ని పంటలకు మద్దతు ధర వ్యవసాయ ఖర్చుపోను 50 శాతం అదనంగా జోడించి అమలు చేయాలని, రెండు లక్షల రూపాయలను రుణమాఫీ చేయాలని అన్నారు. వ్యవసాయ రంగాన్ని కార్పొరేటు చేయడానికి తీసుకున్న డిజిటల్ వ్యవసాయ మిషన్ జాతీయ సహకార విధానంలో భాగంగా పరిశోధన రద్దు చేయాలని, భూసేకరణ చట్టాన్ని అమలు చేసి హక్కు పత్రాలున్న రైతన్నను ఆదుకోవాలని, సన్న వడ్లకు ఐదు వందల రూపాయలు బోనస్ ఇచ్చే విధంగానే దొడ్డువడ్లకు కూడా 500 రూపాయలు బోనస్‌ను అందించాలని కోరారు. కౌలు రైతులను గుర్తించి అన్ని పథకాలు వర్తింప చేసే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, విత్తనాలు క్రిమిసంహారక ఎరువులు యంత్రాలు సబ్సిడీకి అందించాలని కోరారు. శీతల గిడ్డంగులను ఏర్పాటు చేసి పంటలకు ధరలు వచ్చే వరకు నిల్వ చేసి రైతులు అమ్ముకునే విధంగా పంటలను దాచుకునే విధంగా సహకారం రైతాంగానికి అందించాలని, వ్యవసాయ గిడ్డంగులను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నగరానికి అనుకుని ఉన్న గ్రామాలను గుర్తించి కూరగాయల పండ్ల తోట ఏర్పాటు చేసే విధంగా విత్తనాలు, సబ్సిడీలు, ఎరువులు అందించి రైతన్నను ఆదుకొనుటకు ఉపయోగపడే విధంగా చూడాలని కోరారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం వ్యవసాయాన్ని నల్ల చట్టాలను తీసుకువచ్చి వ్యవసాయ రంగాన్ని కూలీలుగా పూర్తిగా నిర్లక్ష్యం చేసే విధంగా సబ్సిడీ ఎత్తివేయడం వల విత్తనాల ధరలు కార్పొరేట్ శక్తుల్లో ఉండడంవల్ల రైతాంగం కొనలేని పరిస్థితిలో ఉన్నారని, సబ్సిలకు విత్తనాలు ఎరువులు యంత్రాలు అందించే విధంగా చూడాలని పంటల భీమాను అమలు చేయాలని, అకాల వర్షాల వల్ల దెబ్బతిన్న పంటలకు రైతన్న నష్టపోయిన వారిని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మాసభలో సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఆదరి శ్రీనివాస్, జిల్లా నాయకులు నకిర్త ఓదెలు, జక్కు రాజు గౌడ్, ఉ ట్కూరు రాములు, కర్రె లక్ష్మ ణ్,మంచాల రమాదేవి, మెట్టు శ్యాంసుందర్ రెడ్డి, గొట్టిముక్కుల మనోహర్రావు,మునగాల బిక్షపతి, ధర్ముల రామ్మూర్తి, ఐలయ్య, బాలరాజ్, చిగురు రవి,శంకర్, మహేందర్, తిరుపతి, ఇల్లందుల రాములు తదితరులు పాల్గొన్నారు. అనంతరం తెలంగాణ రాష్ట్రరైతు సంఘం హనుమకొండజిల్లా అధ్యక్ష కార్యదర్శులుగా నకిర్తే ఓదెలు, ఊట్కూరు రాములుతోపాటు ఉపాధ్యక్షులు,కార్యదర్శులుగా కొంగల రామచంద్ర రెడ్డి, గొట్టేముక్కల మనోహ ర్రావు, మెట్టు శ్యాంసుందర్ రెడ్డి, ఈసంపల్లి శంకర్, మునగాల ఐలయ్య, బాలరాజ్ గా మరో ఎనిమిది మంది కార్యవర్గ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.




# 'వాంకిడి' ఫుడ్ పాయిజన్.. చికిత్స పొందుతూ విద్యార్థిని మృతి

**ప్రజాపక్షం/హైదరాబాద్/వాంకిడి:** కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని వాంకిడి గిరిజన ఆశ్ర మ పాఠశాలలో ఫుడ్ పాయిజన్‌కు గురై హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థిని శైలజ సోమవారం మరణించింది. గత నెల 30న వాంకిడి ఆశ్రమ పాఠశాలలో ఫుడ్ పాయిజన్ జరగగా 64 మంది అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. వీరిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉండడంతో



వా రికి నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు.వీరిలో ఇద్ద రు కోలుకోగా శైలజ పరిస్థితి విషమించడంతో వెంటిలేటర్ పై ఉంచిచికిత్స అందించారు.20రోజులుగా చికిత్స పొందిన ఆమె చివరకు మృత్యువాత పడ్డారు. శైలజ మృతితో తల్లిదండ్రులు, బంధువుల రోదనలు మిన్నంటాయి.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad - 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com